www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
మంగళవారం | 12-8-2025
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 135
వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ.8:41 తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.11:52 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా.8:56-10:26; దుర్ముహూర్తం: ఉ.8:32-9:23, రా.10:22-11:06; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6:01; సూర్యాస్తమయం: 6:39
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎల్‌ఏసీ సమీపం నుంచి చైనా భారీ రైల్వే లైన్!

జింజియాంగ్ ప్రావిన్స్ నుంచి టిబెట్‌ను అనుసంధానించేలా..

ఉద్రిక్త పరిస్థితులేవైనా ఏర్పడితే.. రక్షణపరంగా భారత్‌కు తలనొప్పే!

వేగంగా సైన్యాన్ని, ఆయుధాలను తరలించేందుకు చైనాకు అవకాశం

బీజింగ్, ఆగస్టు 11: భారత్‌తో సరిహద్దులకు సమీపంలో భారీ రైల్వే మార్గం నిర్మాణానికి చైనా సిద్ధమైంది. జింజియాంగ్ ప్రావిన్స్‌లోని హోటన్ నుంచి టిబెట్‌లోని లాసాకు నిర్మిస్తున్న ఈ రైల్వే మార్గంలో కొంత భాగం వాస్తవాధీన రేఖ (లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్- ఎల్‌ఏసీ)కు బాగా దగ్గరి నుంచే వెళుతుంది. ఈ ఏడాదే ఈ రైల్వే మార్గం పనులు ప్రారంభం కానున్నాయని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తాజా కథనంలో వెల్లడించింది. ఇది రక్షణ పరంగా, వ్యూహాత్మకంగా చైనాకు ప్రయోజనకరమని పేర్కొంది. మొత్తంగా టిబెట్‌ను చైనాలోని కీలక ప్రాంతాలకు

మిగతా 12వ పేజీలో...

ఏం చేద్దాం!?

బీసీ రిజర్వేషన్లపై పార్టీ పరంగా 42% ప్రకటించి ముందుకెళ్దామా?

కోర్టును మరింత సమయం కోరదామా?

రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ భేటీలో చర్చ

రాజకీయ వ్యవహారాల కమిటీలో నిర్ణయం

వారం రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీ!

23 నుంచి ప్రజాపథం పునఃప్రారంభం

ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం!



హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నిర్ణయించారు. ఈ నెల 16 లేదా 17న పీఏసీ సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. మహేశ్‌గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. స్థానిక ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, ఇతర అంశాలపై చర్చించారు. స్థానిక ఎన్నికల నిర్వహణకు కోర్టు ఇచ్చిన గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఎలా ముందుకు

మిగతా 13వ పేజీలో...



పాత పార్లమెంటు భవనం మీదుగా ఈసీ ఆఫీసుకు ర్యాలీగా బయల్దేరిన ఇండియా కూటమి ఎంపీలు



కదం తొక్కిన విపక్షం

ఓట్ల చోరీ, ఎస్ఐఆర్‌పై 300 మంది ఎంపీల నిరసన



బారికేడ్లను దాటుకొని వస్తున్న మహువా, అఖిలేశ్



పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయానికి..

ఇండియా కూటమి ఎంపీల భారీ నిరసన ప్రదర్శన

ర్యాలీలో పాల్గొన్న లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు

మధ్యలోనే అడ్డుకుని నిర్బంధించిన ఢిల్లీ పోలీసులు

బారికేడ్లు ఎక్కి నిరసన తెలిపిన మహిళా ఎంపీలు

పోలీసులతో వాగ్వాదం.. తోపులాట.. తీవ్ర ఉద్రిక్తత

రాహుల్, ఖర్గే, ప్రియాంక సహా పలువురు నేతల అరెస్టు

నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా?

వారం ముందే వాయిదాకు కేంద్రం నిర్ణయం!

ప్రతిపక్షాల నిరసనలతో ఆత్మరక్షణలో ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ తీరును నిరసిస్తూ ఢిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు కదం తొక్కారు. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ పేరుతో భారీగా ఓట్లను తొలగిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ.. సోమవారం నిరసన చేపట్టారు. పార్లమెంట్ భవనం నుంచి ఈసీ కార్యాలయం దాకా ఎంపీలు ప్రదర్శన చేపట్టగా.. వారిని ఢిల్లీ పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకొని నిర్బంధించారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు నేతలు బారికేడ్లు ఎక్కి ముందుకెళ్లే యత్నం చేయడం, పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇద్దరు మహిళా ఎంపీలు కళ్లుతిరిగి పడిపోయారు. ఎంపీల శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని

మిగతా 2వ పేజీలో...

'ఓటు చోరీ'పై మహోద్యమం.. 15 లక్షల మంది రిజిస్టర్.. 10 లక్షల మిస్డ్ కాల్స్: రాహుల్ 2

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రపతి వద్దకు!

కాళేశ్వరం, బనకచర్లపై సుప్రీంకోర్టుకు?

14న కరీంనగర్ బీసీ సభపై దృష్టి పెట్టండి

కేటీఆర్, హరీశ్, వినోద్‌తో భేటీలో కేసీఆర్

జ్వరంతో బాధపడుతున్న బీఆర్ఎస్ చీఫ్?



గజ్వేల్/మర్కుక్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్ కూడా కార్యాచరణ సిద్ధం చేస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో పార్టీ అధినేత కేసీఆర్ భేటీ అయ్యారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో జరిగిన సమావేశంలో 'బీసీ రిజర్వేషన్ల కార్యాచరణపై చర్చించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయమై ఈ నెల 14న కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయడంపై దృష్టి సారించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో అవసరమైతే రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని, బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్, హరీశ్‌రావులను ఆదేశించినట్లు తెలిసింది. కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలోనూ కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని, బనకచర్లపై ప్రభుత్వ నిర్లక్ష్య

మిగతా 12వ పేజీలో...

ఇజ్రాయెల్ దాడుల్లో ఐదుగురు జర్నలిస్టుల మృతి

గాజాలో ఆస్పత్రి ఆవరణలో మీడియా టెంట్‌పై బాంబులు

తీవ్రంగా గాయపడి మరణించిన అల్ జజీరా పాత్రికేయులు, ఇద్దరు పౌరులు

ఇజ్రాయెల్ దారుణాలను వెల్లడిస్తున్నందుకే చంపుతున్నారు: అల్ జజీరా

గాజాలో గత 22 నెలల్లో 200 మంది జర్నలిస్టుల మృతి



అనస్ అల్ షరీఫ్, మొహమ్మద్ ఖ్రీకె, ఇబ్రహీం జహీర్



మోమెన్ అలీవా



నౌఫల్

గాజా, ఆగస్టు 11: గాజాలో ఇజ్రాయెల్ సైన్యం జరిపిన తాజా బాంబు దాడుల్లో అల్ జజీరా సంస్థకు చెందిన ఐదుగురు జర్నలిస్టులు సహా మొత్తం ఏడుగురు మరణించారు. ఆదివారం అల్ షిఫా ఆస్పత్రి ఆవరణలోని మీడియా టెంట్‌పై ఈ దాడి జరిగింది. ఈ దాడిలో ఆస్పత్రి ప్రధాన ద్వారం కూడా ధ్వంసమైందని ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ రమీ మొహన్న తెలిపారు. మృతుల్లో తమ సంస్థ కరస్పాండెంట్లు అనస్ అల్ షరీఫ్, మొహమ్మద్ ఖ్రీకె, కెమెరామెన్ ఇబ్రహీం జహీర్, మోమెన్ అలీవా, మొహమ్మద్ నౌఫల్ ఉన్నట్టు అల్ జజీరా సంస్థ తెలిపింది. అయితే, మృతుల్లో

మిగతా 2వ పేజీలో...

రోడ్డు కింద చెరువులు



రహదారులపై వరద నిలవకుండా హైదరాబాద్‌లో భారీ భూగర్భ సంపులు

అటు ట్రాఫిక్ సమస్యకు చెక్

ఇటు భూగర్భ జలాల పెంపునకు దోహదం

2.6 లక్షల నుంచి 10.4 లక్షల లీటర్ల వరకు సామర్థ్యం

ఇప్పటికే 10 చోట్ల ఏర్పాటు పూర్తి.. మరో ప్రాంతంలో తుదిదశలో నిర్మాణం

నగరవ్యాప్తంగా మరిన్ని ప్రాంతాల్లో నిర్మించేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు



హైదరాబాద్‌లో ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసు వద్ద సంపు నిర్మాణం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాస్త వానపడితే చాలు హైదరాబాద్ మహానగరంలో రహదారులపై వరద చేరుతోంది. నీళ్ల నిలిచిపోయిన చోట వాహనాలు ముందుకు కదలలేక ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం భారీ భూగర్భ నీటి సంపుల (రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్) మార్గం పట్టింది. ఓ రకంగా రోడ్డు కింద చిన్నపాటి చెరువులు నిర్మిస్తోంది. వాన నీరు వాటిలోకి చేరి రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బంది తప్పడమే కాకుండా.. సంపుల నుంచి నీళ్లు భూమిలోకి ఇంకే ఏర్పాట్లతో భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు చేపడుతోంది. తరచూ నీళ్లు నిలుస్తున్న ప్రాంతాలను

మిగతా 13వ పేజీలో...



గింజ కూడా వదలం

నిర్ణీత వ్యవధిలోనే సీఎంఆర్ బియ్యాన్ని రికవరీ చేస్తాం

గడువు దాటితే.. 25% జరిమానా, 12% వడ్డీ వసూలు చేస్తాం

ఇప్పటికే ధాన్యం అమ్ముకున్న రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదు సీజన్లకు సంబంధించి రైస్ మిల్లర్ల వద్ద 91 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయని, వాటిని మరాడించి.. ఒక్క బియ్యం గింజ కూడా బాకీ లేకుండా వసూలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. '5 సీజన్లు.. కోటి మెట్రిక్ టన్నులు!' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై డీఎస్ చౌహాన్ వివరణ ఇచ్చారు. "2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి 18.98 లక్షల టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి చేయడానికి ఇందులో 1.5 లక్షల టన్నులు కేటాయించాం. 0.81 లక్షల టన్నులు సన్న బియ్యం పథకానికి కేటాయించాం. మిగిలిన 16.69 లక్షల టన్నులు రైస్ మిల్లర్ల వద్ద ఉండాలి. ఇందులో 5.40 లక్షల టన్నులు రైస్ మిల్లుల్లో లేదని గుర్తించాం. సదరు మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు

మిగతా 13వ పేజీలో...

టెన్త్‌లో 20 శాతం ఇంటర్నల్స్ యథాతథం

ఈ విద్యా సంవత్సరంలోనూ కొనసాగింపు

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ 14



ఔటర్ రాబడి హైస్పీడ్!

టోల్ సంస్థకు సగటున నెలకు రూ.70 కోట్ల ఆదాయం 14

ఈ ఏడాది తొలి 6 నెలల్లోనే 414కోట్లు

రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు, టోల్ పెంపుతో మరింత ఆదాయం

ఔటర్ నిర్వహణ, టోల్ వసూలు హక్కును రూ.7,380 కోట్లకే 30 ఏళ్ల లీజుకిచ్చిన గత ప్రభుత్వం

బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ఉగ్రవాద సంస్థ

ప్రకటించిన అమెరికా ప్రభుత్వం 2

హైకోర్టు న్యాయమూర్తికి క్షమాపణ చెప్పండి

రేవంత్‌పై దాఖలైన పిటిషన్లో పిటిషనర్, లాయర్లకు సుప్రీం ఆదేశం



జడ్జిలను న్యాయవాదులు విమర్శించే ధోరణికీ అడ్డుకట్ట వేయాల్సిందే

నేతలు నిందితులైతే న్యాయం జరగదన్న భావన పెరిగింది

నేతల కేసుల్ని ఓ రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీకి అనుమతించొద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై దాఖలు చేసిన ఓ కేసులో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అవమానకర వ్యాఖ్యలు చేసిన పిటిషనర్, ఆయన తరఫు న్యాయవాదులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీం కోర్టుకు మాత్రమే కాకుండా వారు ఆరోపణలు చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసుమి భట్టాచార్యకు కూడా వారంలోగా బేషరతుగా

మిగతా 14వ పేజీలో...

ఢిల్లీ వీధుల్లో కుక్కలు కనిపించొద్దు

2 అన్నింటినీ షెల్టర్లకు తరలించండి

స్టెరిలైజేషన్ తర్వాత కూడా వీధుల్లోకి వదలొద్దు

అడ్డుపడే సంస్థలపై కఠిన చర్యలు తప్పవు

దీనిపై జంతు ప్రేమికుల పిటిషన్లు పరిగణించం

నిబంధనల్ని పక్కనపెట్టి పనిలోకి దిగండి: సుప్రీం



కేసీఆర్, కేటీఆర్ కన్నా జగదీశ్ రెడ్డే ఎక్కువ సంపాదించారు

కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర ఎకరా రూ.50 లక్షలు

జగదీశ్‌రెడ్డి ఫాంహౌస్ వద్ద ఎకరా రూ.40 కోట్లు

ఓఆర్ఆర్ పక్కన షాబాద్‌లో జగదీశ్‌కు 80ఎకరాల క్షేత్రం

ఎస్ఎల్‌బీసీ కూలడానికి కేసీఆర్ క్షుద్రపూజలు?

మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డుకు దగ్గర్లో షాబాద్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి 80ఎకరాల వ్యవసాయ క్షేత్రం ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇక్కడ ఎకరం ధర రూ.40కోట్ల నుంచి రూ.50కోట్లు ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్, కేటీఆర్ కంటే జగదీశ్ రెడ్డే ఎక్కువ ఆస్తులు సంపాదించారని ఆయన

మిగతా 12వ పేజీలో...

సమస్యల పరిష్కారానికి కమిటీ 10

సినీ ప్రతినిధులతో మంత్రి కోమటిరెడ్డి

ఏపీలో త్వరలో కొత్త ఫిల్మ్ పాలసీ: దుర్గేశ్

ఓఆర్ఆర్‌పై పనిచేస్తున్న కూలీలను ఢీకొట్టిన ట్రాలీ

ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మృతి

అందరూ ఒడిసాకు చెందిన వారే

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే దారుణం

పోలీసుల అదుపులో ట్రాలీ డ్రైవర్

కీసర రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కీసర ఔటర్ రింగ్ రోడ్డుపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఔటర్‌పై పూల మొక్కల పెంపకంలో పనిచేస్తున్న ముగ్గురు దినసరి కూలీలపైకి ఓ ట్రాలీ వాహనం వేగంగా దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన నారాయణ (28), చెకొమోహన్ (24), జైరామ్ (32)అనే ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన డ్రైవర్ గణేష్.. గాజువాక నుంచి సెల్‌ఫోన్ టవర్ సామగ్రితో శామీర్‌పేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. 11 మంది కార్మికులు.. అదే సమయంలో మధ్యాహ్న భోజనాలు ముగించుకుని తిరిగి పనిలోకి నడుచుకుంటూ వెళ్తున్నారు. వెనక నుంచి వచ్చిన

మిగతా 12వ పేజీలో...

ఇక కొత్త ఆదాయ పన్ను చట్టం!

- బిల్లును ఆమోదించిన లోక్‌సభ
- కొత్త చట్టంలో ఆలస్యంగా రిటర్న్‌లు ఫైల్ చేసినా రిఫండ్స్



న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఆదాయ పన్ను (ఐటీ) చట్టం మరింత సులభతరంకానుంది. ఇందు కోసం ఆదాయ పన్ను బిల్లు, 2025 పేరుతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బిల్లును లోక్‌సభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. పన్ను చెల్లింపుదారుల ందరికీ సులభంగా అర్థమయ్యేలా ఈ బిల్లును రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభ ఆమోదం తర్వాత రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ బిల్లు 'ఆదాయ పన్ను చట్టం, 2025' పేరుతో అమల్లోకిరానుంది. ఈ బిల్లులోని ప్రధానాంశాలు ఏమిటంటే..

రిఫండ్స్‌పై ఊరట..

కొత్త ఐటీ చట్టంలో ఆలస్యంగా ఐటీ రిటర్న్‌లు దాఖలు చేసే వారికి రిఫండ్స్ రద్దు చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే అలాంటిదేమీ లేకుండా ఆలస్యంగా రిటర్న్‌లు ఫైల్ చేసే వారికీ రిఫండ్స్‌ను అనుమతించబోతున్నారు. అనారోగ్యం, సాంకేతిక సమస్యలతో సకాలంలో ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయలేని వారికి ఇది పెద్ద ఊరట కానుంది. ఇక టీడీఎస్ చెల్లింపుదారులకూ కొత్త ఐటీ చట్టం ఊరట కల్పించనుంది. ఈ వివరాలు ఆలస్యంగా ఫైల్ చేసినా జరిమానాలు ఉండవు. అలాగే టీడీఎస్ చెల్లింపు భారం లేని పన్ను చెల్లింపుదారులు ముందుగానే 'నిల్ టీడీఎస్' సర్టిఫికెట్ పొందేందుకూ అవకాశం లభించనుంది.

కమ్యూటెడ్ పెన్షన్‌పై..

ప్రస్తుతం ఉద్యోగులకు కమ్యూటెడ్ పెన్షన్‌పై పన్ను మినహాయింపు సదుపాయం ఉంది. ఇప్పుడు ఈ ప్రయోజనాన్ని ఉద్యోగేతరులకూ విస్తరించబోతున్నారు. ఎల్ఐసీ పెన్షన్ ఫండ్ వంటి ప్రత్యేక ఫండ్స్ నుంచి ఒకేసారి ఏక మొత్తంలో పెన్షన్ అందుకునే వారికీ ఈ ప్రయోజనం లభిస్తుంది.

ప్రాపర్టీ ట్యాక్స్‌పై స్పష్టత

గృహ ఆస్తుల ఆదాయం పన్ను మదింపుపైనా కొత్త చట్టంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. మునిసిపల్ ట్యాక్స్‌లు పోగా వచ్చే వార్షిక ఆదాయం నుంచి 30 శాతాన్ని స్టాండర్డ్ డిడక్షన్‌గా అనుమతిస్తారు. ఇల్లు కొనేందుకు, నిర్మించేందుకు లేదా మరమ్మతు చేయించేందుకు చేసిన అప్పులపై చెల్లించే వడ్డీకి కూడా గృహ యజమానులు ఈ ఆదాయం నుంచి డిడక్షన్ పొందవచ్చు. గృహాస్తి మొత్తాన్ని లేదా కొంత భాగాన్ని మాత్రమే అద్దెకు ఇస్తే.. సముచిత లేదా వాస్తవ అద్దె ఆదాయం.. ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే దాన్ని మాత్రమే గృహాస్తి ఆదాయంగా పరిగణిస్తారు. కాగా, కొత్త చట్టంలో ప్రస్తుత ఆదాయ శ్లాబులు యథాతథంగా ఉండనున్నాయి.

నేడే పార్లమెంట్ నిరవధిక వాయిదా?

- వారం ముందుగానే వాయిదాకు కేంద్రం నిర్ణయం!

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఉభయ సభలను మంగళవారం నిరవధికంగా వాయిదా వేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వర్షాకాల సమావేశాలను ఈ నెల 21 వరకు కొనసాగించాలని కేంద్రం ముందుగా నిర్ణయించినా.. వారం రోజుల ముందే వాయిదా వేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్), దేశవ్యాప్తంగా ఓట్ల చోరీపై ప్రతిపక్షాల నిరసన ఉధృతం కావడం, గత మూడు వారాలుగా ఉభయ సభలు స్తంభించిపోవడంతో ఆత్మరక్షణలో పడిన కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సోమవారం ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు గందరగోళం సృష్టించి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లడంతో.. కీలకమైన బిల్లులను ఎన్డీయే భాగస్వామ్య పార్టీల మద్దతుతో ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అత్యంత కీలకమైన జాతీయ క్రీడా పాలనా బిల్లు, జాతీయ యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లు, ఆదాయ పన్ను బిల్లు వంటి వాటిని లోక్‌సభ ఆమోదించింది. మరోవైపు రాజ్యసభలో మర్చంట్ షిప్పింగ్ బిల్లు, గోవాలో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్టీ ప్రాతినిధ్యాన్ని సవరించే బిల్లును ఆమోదించారు. కాగా, సమైక్య పింఛన్ పథకం చందాదారులకు పన్ను మినహాయింపులు కల్పిస్తూ పన్ను చట్టాలను, ముఖ్యంగా ఆదాయ పన్ను బిల్లును సవరిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బిల్లును ప్రవేశ పెట్టారు. దీనిపై కొంతసేపు చర్చ జరిగిన అనంతరం సభను వాయిదా వేశారు. ఇక జాతీయ క్రీడాపాలనా బిల్లు, యాంటీ డోపింగ్ సవరణ బిల్లును మధ్యాహ్నం 2గంటల తర్వాత వరుసగా ఈ బిల్లులను ప్రవేశ పెడుతూ.. ఒకదాని తర్వాత మరొకటి ఆమోదిస్తూ వచ్చారు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఆదాయపన్ను బిల్లు, పన్ను చట్టాల సవరణ బిల్లును ఆమోదించగానే సభను మంగళవారానికి వాయిదా వేశారు.

ఎస్పీజీలో తొలి మహిళా అధికారి 'అదాసో కపెసా'



ప్రధాని మోదీ భద్రతా విభాగంలో అధికారిగా అదాసో కపేసా

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల యూకే పర్యటనలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన ఫొటో వైరల్‌గా మారింది. అది ప్రధాని మోదీది కాదు ఆయన వెనుక అచంచలంగా నిలబడి ఉన్న ఓ మహిళా అధికారిది. ఆమె పేరు అదాసో కపెసా భారత ప్రధాని వ్యక్తిగత భద్రతా విభాగం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీజీ)లో చేరిన తొలి మహిళా అధికారిగా ఆమె గుర్తింపు పొందారు. 1885లో ఏర్పాటైన ఎస్పీజీలో ఓ మహిళా అధికారి విధులు నిర్వర్తించడం ఇదే తొలిసారి కావడం విశేషం. మణిపూర్‌లోని సేనాపతి జిల్లా కైబీ గ్రామానికి చెందిన కపెసా ప్రస్తుతం ఎస్పీజీలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. అంతకుముందు ఆమె సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)లో చేరి 55వ బెటాలియన్‌లో ఉత్తరాఖండ్‌లోని పిథోర్‌గడ్‌లో సేవలందించారు. ఓ మారుమూల గ్రామం నుంచి ఎస్పీజీలో అధికారిగా ఎదిగిన కపెసా ప్రయాణం తన వ్యక్తిగత విజయం మాత్రమే కాకుండా తనలాంటి ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

యుద్ధాన్ని ఆపేందుకు సహకరిస్తాం

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఉక్రెయిన్ యుద్ధానికి సాధ్యమైనంత త్వరలో, శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు అన్ని రకాలుగా సహకరిస్తామని ప్రధాని మోదీ చెప్పారు. సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ.. ఈ విషయాన్ని ఆయనకు స్పష్టం చేశారు. మూడు రోజుల కిందట రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చించిన మోదీ.. తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడితోనూ మాట్లాడారు. శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. అలాగే భారత్-ఉక్రెయిన్ సంబంధాల బలోపేతానికి కూడా కట్టుబడి ఉన్నామని తెలిపారు. శాంతి ప్రయత్నాల్లో మోదీ మద్దతుగా నిలుస్తామని ప్రకటించడాన్ని అభినందిస్తూ జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించాలని సూచించారు. అలా చేస్తే రష్యాకు యుద్ధం కొనసాగించే ఆర్థిక సామర్థ్యం తగ్గుతుందని తెలిపారు.

న్యూఢిల్లీ-వాషింగ్టన్ నాన్‌స్టాప్ సర్వీసులు రద్దు

- విమానాల కొరత కారణంగా ఎయిరిండియా నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి న్యూఢిల్లీ, వాషింగ్టన్ డీసీ మధ్య నాన్‌స్టాప్ విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. విమానాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య ఎయిరిండియా వారానికి ఐదు నాన్‌స్టాప్ సర్వీసులు నడుపుతోంది. వీటికోసం విశాలంగా ఉండే బోయింగ్ 787 విమానాలను వినియోగిస్తోంది. సెప్టెంబరు 1 తర్వాత న్యూఢిల్లీ నుంచి వాషింగ్టన్‌కు వెళ్లేవారుగానీ, వాషింగ్టన్ నుంచి న్యూఢిల్లీకి వచ్చేవారుగానీ తమ విమానాలను బుక్ చేసుకుంటే.. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఎయిరిండియా ప్రకటించింది. లేదంటే పూర్తి రిఫండ్‌తో టికెట్ డబ్బులు వెనక్కి ఇచ్చేస్తామని తెలిపింది.

బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ, మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్ర సంస్థలుగా ప్రకటించిన అమెరికా

న్యూయార్క్, ఆగస్టు 11: పాక్ సర్కారుకు కంట్లో నలుసుగా మారిన 'బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)'ని, దానికి చెందిన మజీద్ బ్రిగేడ్‌ను అమెరికా విదేశీ ఉగ్రవాద సంస్థల (ఎఫ్‌టీవో) జాబితాలో చేర్చింది. 2019 నుంచి ఆ రెండు సంస్థలూ పలు ఉగ్రదాడులు చేసిన నేపథ్యంలో.. వాటిని ఎఫ్‌టీవోలుగా గుర్తిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. బీఎల్ఏని 2019లోనే.. 'స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ)' జాబితాలో చేర్చిన అమెరికా.. తాజాగా మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్ఏలో భాగంగానే భావిస్తున్నట్లు ప్రకటించింది. నిరుడు కరాచీ ఎయిర్‌పోర్టు సమీపంలో, గ్వాదర్ పోర్ట్ అథారిటీ కాంప్లెక్స్ దగ్గర్లో జరిగిన ఆత్మాహుతి పేలుళ్లకు, 2025లో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళ్తున్న జఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసి 31 మంది పౌరులు/భద్రతాసిబ్బంది ప్రాణాలు తీసి 300 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకున్న ఘటనల వెనుక బీఎల్ఏనే ఉంది. అయితే.. అమెరికా ప్రకటన వెనుక కారణం ఇంకేదో ఉంటుందని విదేశీ వ్యవహారాల నిపుణులు భావిస్తున్నారు. "పాకిస్థానే ఇండియాకు చమురు అమ్మవచ్చు" అని ట్రంప్ ఇటీవల ప్రకటించడం.. పాకిస్థాన్‌లో అత్యంత అరుదైన ఖనిజలోహాలు ఉన్నాయని చెప్పడం.. రెండ్రోజుల క్రితం అమెరికాకు వెళ్లిన పాక్ సైన్యాధిపతి ఆసీమ్ మునీర్ ఏమో.. 'కలీమా ఆధారంగా ఏర్పడ్డ రాజ్యాలు రెండే. ఒకటి మదీనా (ఇప్పుడు సౌదీఅరేబియాలో అది ఒక నగరం). రెండోది పాకిస్తాన్. దేవుడు మదీనాను ఆశీర్వదించినట్లే పాక్‌ను కూడా ఆశీర్వదిస్తాడు' అని వ్యాఖ్యానించడం చూస్తుంటే.. పాక్‌లో పెద్ద ఎత్తున అరుదైన మినరల్స్ లేదా చమురు నిక్షేపాలు దొరికాయా అనే అనుమానాలు కలుగుతున్నాయని నిపుణులు అంటున్నారు.

కదం తొక్కిన విపక్షం

(మొదటిపేజీ తరువాయి)

పలువురు నేతలు మండిపడ్డారు. సోమవారం ఉదయం పార్లమెంట్ సమావేశం కాగానే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలి.. ఓట్ల చోరీని నిలిపివేయాలి అని నినాదాలు చేస్తూ ప్రతిపక్ష సభ్యులు ఉభయ సభలను స్తంభింపజేశారు. దీంతో సభలు వాయిదా పడ్డాయి. అనంతరం ఉభయ సభలకు చెందిన దాదాపు 300 మంది ఇండియా కూటమి ఎంపీలు అక్కడి నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఎంపీ ప్రియాంకగాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్, ఎన్సీపీ-ఎస్పీ నేత శరద్‌పవార్, శివసేన నేతలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, డీఎంకే నేత టీఆర్ బాలు, తృణమూల్ నేత డెరెక్ ఒబ్రెయిన్ సహా ఆర్జేడీ, లెఫ్ట్, ఆప్ నేతలు సైతం ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కై బీజేపీని గెలిపిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ మకర ద్వారం నుంచి బయలుదేరి ప్రదర్శనగా వెళుతుండగా.. పోలీసులు అడుగడుగునా బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు.

బారికేడ్లు ఎక్కి నినాదాలు..

సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, సంజనా జాదవ్, జ్యోతిమణి, ఎన్సీపీ నేత సుప్రియా సూలే.. బారికేడ్లపైకెక్కి ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ.. నిరసన జరిగినంతసేపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరకు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ వాద్రా, అఖిలేశ్ యాదవ్, సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది సహా పలువురిని పోలీసులు బస్సుల్లోకి ఎక్కించి పార్లమెంట్ వీధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత కొద్దిసేపటికి విడుదల చేశారు. కాగా, 30 మంది ఎంపీలను కలుసుకునేందుకు మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చిందని, కానీ.. 200 మందికి పైగా నేతలు ర్యాలీలో పాల్గొన్నారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ దేవేశ్‌కుమార్ మహా తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు వారిని నిలువరించి నిర్బంధించాల్సి వచ్చిందన్నారు. బారికేడ్లు దాటి ముందుకెళ్లే ప్రయత్నంలో పోలీసులతో ఘర్షణ పడిన తృణమూల్ ఎంపీలు మహువా మోయిత్రా, మిథాలీ బాగ్ స్పృహ తప్పి పడిపోయారు. వారికి రాహుల్‌గాంధీ సాయం అందించడంతో మహువా తేరుకున్నారు. మిథాలీ తేరుకోకపోవడంతో ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు.





ర్యాలీకి ముందు పార్లమెంటు వద్ద విపక్ష ఎంపీలు, సొమ్మసిల్లి పడిపోయిన మహువాకు నీళ్లు తాగిస్తున్న రాహుల్

రాజకీయ యుద్ధం కాదు..

తమది రాజకీయ పోరు కాదని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు చేస్తున్న యుద్ధమని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో ఓట్లను కొల్లగొట్టి బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరుపై తాము పోరాడుతున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్‌తో తాము మాట్లాడలేకపోతున్నామనేది వాస్తవమని, తమకు స్వచ్ఛమైన, నిజమైన ఓటర్ల జాబితా కావాలని డిమాండ్ చేశారు. ఒకే వ్యక్తికి ఒకే ఓటు ఉండాలన్న దానిపై తాము పోరాడుతున్నామని, వాస్తవాలను దేశ ప్రజలకు తెలియజేశామని పేర్కొన్నారు. కాగా, ఓట్ల చోరీపై తాము శాంతియుతంగా ప్రదర్శన చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందో తెలియడం లేదని ఖర్గే అన్నారు. మరోవైపు రాహుల్‌గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల కమిషన్ జవాబు ఇవ్వకుండా.. ప్రమాణం చేయడాలనడం విడ్డూరమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. పోలీసులతో నిర్బంధించడం ద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

లోకం తీరు



ప్రమాణ పత్రమైనా ఇవ్వండి క్షమాపణలైనా చెప్పండి

- ఓట్ల చోరీ ఆరోపణలపై రాహుల్‌కు మరోసారి ఈసీ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఓట్ల చోరీ జరిగిందంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) మరోసారి తన వైఖరిని స్పష్టం చేసింది. "ఇంకా సమయం ఉంది. ఓట్ల చోరీ జరిగిందన్న ఆరోపణలను రుజువు చూపిస్తూ ప్రామాణిక డిక్లరేషన్‌పై సంతకం చేసి సమర్పించండి. లేదంటే దేశానికి క్షమాపణ చెప్పండి" అని డిమాండు చేసింది. కర్ణాటక, హరియాణా ప్రధాన ఎన్నికల అధికారులు రాహుల్ గాంధీకి నోటీసులు పంపించిన నేపథ్యంలో ఈసీ తన వాదనను పునరుద్ఘాటించింది. ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ విలేకరులకు చూపించిన పత్రాల్లో శకున్ రాణి అనే మహిళ రెండు సార్లు ఓటు వేసినట్టు ఉంది. తాము దర్యాప్తు జరపగా తాను రెండు సార్లు ఓటు వేయలేదని ఆమె చెప్పిందని, ఆమె ఓటు వేసినట్టు రెండు చోట్ల ఉన్న పత్రాల్లో టిక్ ఉండడం కూడా వాస్తవం కాదని కర్ణాటక ఎన్నికల అధికారి చెప్పారు. ఇదిలా ఉండగా, బిహార్‌లో ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలపై ఇంతవరకు ఏ పార్టీ కూడా విజ్ఞప్తులు సమర్పించలేదని ఈసీ తెలిపింది. పేర్లు చేర్చాలనిగానీ, తొలగించాలనిగానీ కోరుతూ ఎలాంటి దరఖాస్తులు ఇవ్వలేదని పేర్కొంది.

'ఓటు చోరీ'కి భారీ స్పందన

న్యూఢిల్లీ, ఆగస్టు 11: దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి నిరసనగా చేపట్టిన పోరాటానికి ప్రజల నుంచి భారీ స్పందన వస్తోందని రాహుల్‌గాంధీ తెలిపారు. 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా తాము ప్రారంభించిన వెబ్‌పోర్టల్‌లో ఇప్పటికే 15లక్షల మందికి పైగా రిజిస్టర్ అయ్యారని, 10 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. ఈ ఉద్యమం మహోద్యమంగా మారిందని 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ చేశారు. "దేశంలో నిజమైన ప్రజాస్వామ్యానికి ఇది నిదర్శనం. అణచివేతకు గురైన గొంతుకలు మా ఉద్యమం ద్వారా ఎలుగెత్తుతున్నాయి" అని రాహుల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఓట్ల చౌర్యం వ్యవహారంలో పార్టీ అగ్రనేత రాహుల్ ఓ వైపు పోరాటం చేస్తుండగా, 'ఎన్నికలప్పుడు కళ్లు మూసుకున్నారా..?' అని కర్ణాటక మంత్రి రాజణ్ణ చేసిన వ్యాఖ్యలు ఆయన పదవికి ఎసరు తెచ్చాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో సీఎం సిద్దరామయ్య ఆయనను పదవి నుంచి తప్పించారు.

హైకోర్టు జడ్జిల సామర్థ్యంపై సుప్రీం జడ్జిల కామెంట్లు వద్దు!

- హైకోర్టులు సుప్రీంకోర్టుకు సబార్డినేట్ కావు
- పనితీరు మెరుగుదలకు అంతర్గతంగా సూచనలు చేయవచ్చు: సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: దిగువస్థాయి కోర్టుల న్యాయమూర్తుల సామర్థ్యం మీద ఉన్నతస్థాయి కోర్టుల జడ్జీలు వ్యాఖ్యలు చేయటం సరైనది కాదని సీజేఐ జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ జడ్జిపై ఇటీవల సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు తీవ్ర అలజడి సృష్టించటం, ఆ వ్యాఖ్యల్ని సదరు ధర్మాసనం ఉపసంహరించుకోవటం తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలోనే, ఒక ఆంగ్లపత్రికతో సీజేఐ మాట్లాడుతూ.. ఈ స్పష్టతనిచ్చారు. 'హైకోర్టులు సుప్రీంకోర్టుకు సబార్డినేట్ (దిగువస్థాయి) కావు. రెండూ కూడా రాజ్యాంగ కోర్టులే. హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సవరించవచ్చు. మెరుగుపర్చవచ్చు. మొత్తంగా పక్కన పెట్టవచ్చు. అంతే. ఒక హైకోర్టు న్యాయమూర్తి సామర్థ్యం, పనితీరు, పరిజ్ఞానంపై వ్యాఖ్యానించే అధికారం రాజ్యాంగం సుప్రీంకోర్టుకు ఇవ్వలేదు' అని జస్టిస్ గవాయ్ వెల్లడించారు. ఇదే సూత్రం హైకోర్టు జడ్జీలకూ వర్తిస్తుందని, కింది స్థాయి కోర్టుల న్యాయాధికారుల మీద వారు కూడా కామెంట్లు చేయవద్దన్నారు. అయితే, పనితీరును ఎలా మెరుగుపర్చుకోవాలి? ఏ అంశాలపై దృష్టి సారించాలి? అన్నదానిని అంతర్గతంగా ఉన్న విధానాల ద్వారా దిగువ కోర్టుల జడ్జీలు, న్యాయమూర్తులకు తెలియజేయవచ్చన్నారు. ఇదిలా ఉండగా, ఆర్మీలోని న్యాయ విభాగంలో జడ్జి అడ్వకేట్ జనరల్ (జేఏజీ) పోస్టుల నియామకంలో మహిళలపై ఉన్న పరిమితులను ఎత్తివేస్తూ సుప్రీంకోర్టు సోమవారం ఆదేశాలు ఇచ్చింది. జేఏజీ ఎంట్రీ స్కీంలో ఆరు పోస్టులను పురుషులకు, మూడింటిని మహిళలకు కేటాయిస్తూ భర్తీ ప్రక్రియను నిర్వహించగా అది సరైన విధానం కాదని తెలిపింది. సమానత్వం పాటించాలని, ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది.

రిజర్వేషన్లలో ఆదాయ పరిమితిపై విచారణకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఎస్సీ ఎస్టీ, బీసీ రిజర్వేషన్లలో చాలావరకు ఆయా వర్గాల్లో సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉన్నవారికే దక్కుతున్నాయని.. అందువల్ల రిజర్వేషన్లలో అంతర్గతంగా ఆదాయ పరిమితి విధించేలా కేంద్రాన్ని ఆదేశించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. రమాశంకర్ ప్రజాపతి, యమునా ప్రసాద్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు పరిశీలించింది. దేశంలో దశాబ్దాలుగా రిజర్వేషన్లను అమలు చేస్తున్నా... ఆయా కేటగిరీల్లోని కొన్ని వర్గాల వారే ప్రయోజనం పొందుతున్నారని, బాగా వెనుకబడినవారి పరిస్థితి ఏమాత్రం మారడం లేదని పిటిషనర్లు కోర్టుకు విన్నవించారు. ఆయా కేటగిరీలలో అంతర్గతంగా ఆదాయ పరిమితిని అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని, ఆ దిశగా చర్యలు చేపట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌ను ధర్మాసనం.. విచారణకు స్వీకరించింది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలపై అక్టోబర్ 10లోపు స్పందించాలంటూ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

ఢిల్లీ వీధుల్లో ఒక్క కుక్కా కనిపించొద్దు

అన్నింటినీ షెల్టర్లకు తరలించండి.. అడ్డుపడే సంస్థలపై కఠిన చర్యలు తప్పవు

- వీధి కుక్కల దత్తతను అనుమతించొద్దు
- ఢిల్లీ అధికారులకు సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: దేశ రాజధానిలో పెద్ద బెడదగా మారిన వీధికుక్కల సమస్యపై సుప్రీంకోర్టు సుమోటోగా స్పందించింది. ఢిల్లీ- ఎన్‌సీఆర్ పరిధిలో ఒక్క కుక్క కూడా వీధుల్లో కనిపించడానికి వీల్లేదని, వాటన్నింటినీ తక్షణం షెల్టర్లకు తరలించాలని అధికారులను ఆదేశించింది. ఈ తరలింపు ప్రక్రియకు అడ్డుపడే సంస్థలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఇందులో మినహాయింపులకు తావు లేదని తేల్చిచెప్పింది. కుక్క కాటు ఘటనలు, రేబిస్ కారణంగా మరణాల సంఖ్య బాగా పెరిగిపోయింది. దీనిపై పత్రికలు, మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారణను చేపడుతోంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వాదనలను మాత్రమే తాము పరిగణనలోకి తీసుకుంటామని, శునక ప్రియుల పిటిషన్లను పట్టించుకోబోమని బెంచ్ స్పష్టం చేసింది. "ఇది మా కోసం తీసుకుంటున్న నిర్ణయం కాదు. ప్రజల ప్రయోజనాలే ఇందులో ప్రధానం. అందువల్ల ఏ తరహా సెంటిమెంట్లను మేం అనుమతించబోం. స్టెరిలైజేషన్ (కుటుంబ నియంత్రణ ఆపరేషన్) జరిపిన తర్వాత కూడా కుక్కలను వదిలిపెట్టొద్దు" అని జస్టిస్ పార్దివాలా తేల్చిచెప్పారు. ఈ సమస్యపై ఎటువంటి చర్యలు చేపట్టేందుకు వీలున్నదో అమికస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్ చెప్పే ప్రయత్నం చేయగా, కొంతకాలానికి అన్ని నిబంధనలు పక్కనబెట్టి, అన్ని ఏరియాల్లో కుక్కలను పట్టుకుని షెల్టర్లకు తరలించాలని ఆయన తెలిపారు. ఈ పనులను పౌర సంస్థలు చేయగలిగితే సరేనని.. లేదంటే ప్రత్యేక బృందాలను నియమిస్తామని బెంచ్ అనగా, కోర్టు నిర్ణయాన్ని తు.చ. తప్పక పాటిస్తామని ఢిల్లీ ప్రభుత్వ అధికారులు తెలిపారు. కాగా, ఈ ఏడాది జనవరి నుంచి జూన్‌వరకు దేశ రాజధానిలో 49 రేబిస్ కేసులు, 35,198 కుక్క కాటుకు సంబంధించిన ఘటనలు నమోదయ్యాయి. అలాగే, దేశవ్యాప్తంగా ఏటా ఆరువేలమంది కుక్క కాటు, రేబిస్ కారణంగా మరణిస్తున్నారు.

'గుడ్, బ్యాడ్ అండ్ అగ్లీ' సినిమా ప్రస్తావన

జంతు ప్రేమికుల తీరుపై బెంచ్ తీవ్రస్వరం వినిపించింది. "రేబిస్ కారణంగా ఆత్మీయులను కోల్పోయిన కుటుంబసభ్యులకు తిరిగి వారిని ఈ జంతు ప్రేమికులు తెచ్చి ఇస్తారా?" అంటూ ఆగ్రహించింది. ఈ సమయంలో 'గుడ్, బ్యాడ్ అండ్ అగ్లీ' అనే సినిమాను ప్రస్తావించింది. "కాల్చాలనుకుంటే కాల్చడమే. అక్కడ మాటలు అవసరం లేదు. ఇది మాటలకు సమయం కాదు. చేతల్లో చూపించాలి." అని వ్యాఖ్యానించింది. హెల్ప్‌లైన్‌ను ఒక వారంలో ఏర్పాటు చేయాలని బెంచ్ ఆదేశించింది. వీధి కుక్కలను ఉంచేందుకు షెల్టర్లను 8 వారాల్లో ఏర్పాటు చేసి, తమకు తెలియజేయాలని కోర్టు ఢిల్లీ ప్రభుత్వాన్ని, మున్సిపల్ కార్పొరేషన్లను ఆదేశించింది. ఈ షెల్టర్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేసేందుకు తగినంత మంది సిబ్బంది ఉండాలని పేర్కొంది.

రూ.15వేల కోట్లు అవసరం: మేనకా గాంధీ

సుప్రీంకోర్టు ఆదేశాలపై జంతు ప్రేమికురాలు, కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ మాట్లాడుతూ కుక్కల షెల్టర్లకు అవసరమయ్యే నిధులు, స్థలాలు పురపాలక సంఘాల వద్ద ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. ఢిల్లీలోని కుక్కల పునరావాసానికి రూ.15వేల కోట్లు అవసరం ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున కుక్కలను తరలించడం అనేది 'అశాస్త్రీయం', 'వ్యర్థ ప్రయాస' అని జంతు ప్రేమికుల సంస్థ 'పెటా' అభిప్రాయపడింది. వీధి కుక్కలను జైల్లో పెట్టి సాధించేది కూడా ఏమీ ఉండబోదని పేర్కొంది. ఉమీద్ ఫర్ యానిమల్స్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు నిఖిల్ మహేష్ మాట్లాడుతూ ఈ తీర్పును సవాలు చేస్తామని తెలిపారు. కాగా, పలు కాలనీ సంఘాలు తీర్పును స్వాగతించాయి. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా విలేకరులతో మాట్లాడుతూ తీర్పునకు అనుగుణంగా విధానాన్ని రూపొందించి, ప్రణాళికా బద్ధంగా అమలు చేస్తామని చెప్పారు.

ఎంపీల నివాస భవనాలకు నదుల పేర్లు

- ప్రారంభించిన ప్రధాని మోదీ



ఢిల్లీలో ఎంపీల కోసం నిర్మించిన అపార్ట్‌మెంట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: భవనాలు, నివాసాలకు నదుల పేర్లు పెట్టే సంప్రదాయం.. ప్రజలను ఏకం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. పార్లమెంటు సభ్యుల కోసం ఢిల్లీలో నిర్మించిన బహుళ అంతస్తుల నివాస సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఇందులో ఉన్న నాలుగు బ్లాకులకు.. కృష్ణా, గోదావరి, హుగ్లీ, కోసీ నదుల పేర్లు పెట్టారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిపెట్టుకునే కోసీ నది పేరుపెట్టారంటూ కురుచబుద్ధి కలిగిన కొందరు విమర్శిస్తున్నారని.. నదుల పేర్లు పెట్టడం వల్ల ప్రజలు ఏకమవుతారని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు. పార్లమెంటు భవనం సమీపాన బాబా ఖరక్‌సింగ్ మార్గ్‌లో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో ఒక్కోటీ 5 వేల చదరపు అడుగుల వైశాల్యం కలిగిన 350 ఫ్లాట్లు ఉన్నాయి. ఇక్కడ వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన ఎంపీలు నివసించబోతున్నారని.. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి నిలువుటద్దంలా నిలుస్తారని తెలిపారు. ఈ సముదాయంలో విభిన్న పండుగలు జరుపుకోవాలని.. వీటికి తమ నియోజకవర్గ ప్రజలను కూడా ఆహ్వానించవచ్చని సూచించారు. కొత్త నివాస సముదాయాన్ని పర్యావరణం, పరిశుభ్రతకు ప్రతీకగా ఎంపీలు మలచాలన్నారు. పరిశుభ్రతపై ఏటా రెండు మూడు పోటీలు నిర్వహించాల్సిందిగా పట్టణాభివృద్ధి శాఖ, రెసిడెన్షియల్ కమిటీలను కోరతానని చెప్పారు. దేశ రాజధానిలో ఎంపీలకు చాలా కాలంగా నివాస కొరత ఉందని ప్రధాని గుర్తుచేశారు. ముఖ్యంగా తొలిసారి గెలిచి వచ్చినవారికి వసతి దొరకడం క్లిష్టంగా మారిందన్నారు. కొత్త కాంప్లెక్స్ నిర్మాణంతో ఆ కష్టాలు తీరాయని చెప్పారు. 2004-14 నడుమ నాటి యూపీఏ ప్రభుత్వం ఒక్క నివాసాన్ని కూడా నిర్మించలేదని ఆక్షేపించారు. తన ప్రభుత్వం 350 ఫ్లాట్లు ఇప్పుడు నిర్మించి అందుబాటులోకి తెచ్చిందన్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో ఐదుగురు జర్నలిస్టుల మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఒక ఉగ్రవాది ఉన్నాడని ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. అనస్ అల్ షరీఫ్ కొంతకాలం హమాస్ ఉగ్రవాద సెల్‌కు అధ్యక్షుడిగా పనిచేశాడని తెలిపింది. జర్నలిస్టు ముసుగులో అతడు ఉగ్రవాద కార్యకలాపాలను కొనసాగించాడని పేర్కొంది. ఇజ్రాయెల్ పౌరులపైనా, ఐడీఎఫ్ దళాలపైనా రాకెట్ దాడులు జరగడానికి అతనే కారణమంది. ఇజ్రాయెల్ ఆరోపణలను అల్ జజీరా సంస్థ ఖండించింది. గాజాలోని పరిస్థితులను ప్రసారం చేస్తున్నందుకే జర్నలిస్టులను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుందని ఆరోపించింది. గాజాపై ఇజ్రాయెల్ తీవ్రతరం చేసిన తాజా బాంబు దాడులను మరణానికి కొన్ని క్షణాల ముందు తన 'ఎక్స్' ఖాతాలో కూడా షరీఫ్ పోస్టు చేశాడు. 'నా ఈ మాటలు మీకు చేరేసరికి.. నన్ను, నా గళాన్ని అంతమొందించడంలో ఇజ్రాయెల్ విజయవంతమవుతుంది' అని ఆ పోస్టులో పేర్కొన్నాడు. మరోవైపు ఈ వార్తను ప్రసారం చేసే సమయంలో అల్ జజీరా టీవీ చానల్ యాంకర్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ దాడిని ఐరాస మానవ హక్కుల కార్యాలయం కూడా ఖండించింది. అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని పేర్కొంది. మరోవైపు గాజాపై గత 22 నెలలుగా ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో సుమారు 200 మంది జర్నలిస్టులు మరణించినట్టు మీడియా పేర్కొంది.

7న సికింద్రాబాద్ నుంచి ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు పునరుద్ధరణ

రైళ్ల వేళలు యథాతథం.. అదనపు స్టాపేజీగా చర్లపల్లి

సికింద్రాబాద్‌లో పూర్తయిన ప్లాట్ ఫామ్‌ల పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జంట నగరాల వాసులు దేశంలోని నలు మూలలకు రైలు ప్రయాణం చేయాలంటే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిందే. సుమారు రూ.700 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరుద్ధరణ చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్).. అక్కడి నుంచి బయలుదేరే 25కి పైగా రెగ్యులర్ రైళ్లతోపాటు 50 వరకూ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ గత ఏప్రిల్ నుంచి చర్లపల్లి నుంచి/ మీదుగా నడుపుతుండటంతో జంట నగరాల ప్రజలు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. అత్యధిక డిమాండ్ ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల మళ్లింపుతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్యాసింజర్ రెవెన్యూ (ఆదాయం) ఎక్కువగా ఉండే రైళ్ల మళ్లింపుతో రాబడి తగ్గినట్లు రైల్వే అధికారులు గుర్తించారు. దీనికి తోడు సికింద్రాబాద్ స్టేషన్‌లోని కొన్ని ప్లాట్ ఫామ్‌ల పునరుద్ధరణ పూర్తయింది. దీంతో ఇటీవల ఎస్‌సీఆర్ జనరల్ మేనేజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'పాత రూట్లలోనే ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని నిర్ణయించారు. వచ్చేనెల ఏడో తేదీ నుంచి వివిధ రూట్లలో నడిచే 7 ఎక్స్‌ప్రెస్ రైళ్లను సికింద్రాబాద్ నుంచి నడపాలని నిర్ణయించారు. గతంలో లింగంపల్లి వైపు వెళ్లే రైళ్లు ఏప్రిల్ నుంచి సికింద్రాబాద్, బేగంపేట్ స్టేషన్లకు బదులు చర్లపల్లి నుంచి అమ్ముగూడ, సనత్‌నగర్ మీదుగా నడుస్తున్నాయి. తాజా నిర్ణయంతో ఆయా రైళ్లు తిరిగి సికింద్రాబాద్, బేగంపేట్ స్టేషన్లలో ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. రెగ్యులర్ రూట్లకు మళ్లుతున్న రైళ్ల వేళల్లో మార్పులేవీ లేవని అధికారిక వర్గాల సమాచారం. అలాగే, చర్లపల్లిలో ఏర్పాటు చేసిన అదనపు స్టాపేజీని కొనసాగించనున్నట్లు తెలిసింది.

రెగ్యులర్ రూట్లకు మరలనున్న రైళ్లు ఇవీ

రైలు నంబరు	ఎక్స్‌ప్రెస్ పేరు	రూటు	మార్పు తేదీ
12805/06	జన్మభూమి	లింగంపల్లి-విశాఖపట్నం	సెప్టెంబరు 7
12713/14	శాతవాహన	సికింద్రాబాద్-విజయవాడ	సెప్టెంబరు 7
18519/20	ఎల్‌టీటీ	విశాఖపట్నం-ముంబై	సెప్టెంబరు 7
17013/14	హడాప్సర్	ఖాజీపేట్-హడాప్సర్	సెప్టెంబరు 8
17205/06	షిర్డీ వీక్లీ	సాయినగర్- కాకినాడ	సెప్టెంబరు 9
17207/08	షిర్డీ వీక్లీ	మచిలీపట్నం-సాయినగర్	సెప్టెంబరు 9
17321/22	వాస్కోడగామా	వాస్కోడగామా- జాసిడ్	సెప్టెంబరు 15

కొరికి.. కొట్టి.. కిందపడేసి..

- గుక్కపట్టి ఏడుస్తోన్న చంటిబిడ్డపై.. డే కేర్ సెంటర్ నిర్వాకం
- ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఘటన

నోయిడా, ఆగస్టు 11: తమ బిడ్డను సురక్షితంగా ఉంచుతారన్న నమ్మకంతో.. అభం శుభం తెలియని 15 నెలల చిన్నారిని తల్లిదండ్రులు డే కేర్ సెంటర్‌లో వదిలి వెళ్లడమే ఆ బిడ్డ పట్ల శాపమయింది. ఏడుస్తుంటే లాలించాల్సింది పోయి.. ఆ చంటిబిడ్డ పట్ల అక్కడి ఆయా అమానుషంగా ప్రవర్తించింది. గుక్కపట్టి ఏడుస్తోన్న పాపను పలుమార్లు నేలకేసి కొట్టింది. ముఖంపై పిడిగుద్దులతో తీవ్రంగా గాయపరిచింది. ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన దంపతులు తమ పాపను స్థానికంగా ఉన్న డే కేర్ సెంటర్‌లో రెండు గంటల పాటు వదిలి ఉద్యోగాలకు వెళ్లేవారు. బిడ్డ శరీరంపై మొదట విచిత్రమైన మచ్చలను గమనించిన తల్లిదండ్రులు వాటిని అలర్జీగా భావించి స్థానిక డాక్టర్‌ను సంప్రదించారు. కానీ అవి.. ఎవరో కొరికిన గాయాలని సదరు డాక్టర్ నిర్ధారించడంతో తల్లిదండ్రులు షాకయ్యారు. డే కేర్ సెంటర్ సీసీటీవీ ఫుటేజీని చిన్నారి తల్లిదండ్రులు పరిశీలించగా.. పాపను కొడుతూ, నేలపై పడేసిన దృశ్యాలు బయటపడ్డాయి. దీంతో డే కేర్ సెంటర్ యజమానితో పాటు ఆయాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసినప్పటికీ యజమాని చిన్నారిని కాపాడే ప్రయత్నం చేయలేదని.. పైగా ప్రశ్నించినందుకు తమపై దుర్భాషలాడుతూ నిర్లక్ష్యంగా బదులిచ్చారని తెలిపారు. ప్రతి బిడ్డను సురక్షితంగా చూసుకుంటామని హామీ ఇచ్చారనీ, ఇప్పుడు చూస్తే మైనర్‌ను కేర్ టేకర్‌గా తీసుకోవడమే కాకుండా.. అమానుషంగా ప్రవర్తించారంటూ చిన్నారి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలో రికార్డైన దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేసి.. అక్కడ పని చేసే ఆయాను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఈ కానిస్టేబుల్ నిత్య పెళ్లి కొడుకు

3 పెళ్లిళ్లు.. మూడో పెళ్లి బాలికతో.. విడాకులివ్వకుండానే పరిష్కారం

నాలుగో వివాహానికి సన్నద్ధం.. విచారణ.. డీఎస్పీ ఆఫీసుకు అటాచ్

సూర్యాపేట/ మునగాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆ కానిస్టేబుల్ ఇప్పటికే మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. మూడో వివాహం ఓ బాలికతో చేసుకున్నాడు. ఆమె నుంచీ విడిపోయి నాలుగో పెళ్లికి సిద్ధమయ్యాడు. విడాకులివ్వకుండానే అతడు ఇలా పెళ్లిళ్ల మీద పెళ్లిళ్లు చేసుకోవడం విశేషం. సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలం తుల్జారావుపేటకు చెందిన కృష్ణంరాజు అనే కానిస్టేబుల్ లీలలివి! 2012లో కృష్ణంరాజు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కృష్ణంరాజు అదే సామాజిక వర్గానికి చెందిన సూర్యాపేట వాస్తవ్యురాలైన యువతిని పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల కాపురం అనంతరం దంపతుల మధ్య వివాదం నెలకొంది. ఆమెతో విడిపోయేందుకు కృష్ణంరాజు రాజీ కుదుర్చుకున్నాడు. తర్వాత ఆమె మరొకరిని పెళ్లి చేసుకుంది. కొన్ని నెలలకు మహబూబాబాద్ జిల్లాకు చెందిన యువతిని కృష్ణంరాజు వివాహం చేసుకున్నాడు. ఆమెతో ఆరు నెలల కాపురం చేసి విడాకులు ఇవ్వకుండానే పరిష్కారం చేసుకున్నాడు. ఆమె కూడా మరొకరిని పెళ్లి చేసుకుంది. ఆరు నెలల క్రితం సూర్యాపేటకు చెందిన బాలికను కృష్ణంరాజు ఆర్వపల్లి మండలంలోని సూర్య దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. తిరుమలగిరి స్టేషన్‌లో పనిచేస్తుండగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నాడనే ఆరోపణలు రావడంతో రెండు నెలల క్రితం అతడిని నడిగూడెం స్టేషన్‌కు బదిలీ చేశారు. మూడో భార్యతో కూడా గొడవలు తలెత్తడంతో ఆమెనూ దూరంగా ఉంచేందుకు కృష్ణంరాజు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ విషయం తెలిసి కులపెద్దలు రంగంలోకి దిగారు. కృష్ణంరాజు నాలుగో పెళ్లి కూడా చేసుకునేందుకు సమాయత్తమవుతున్నాడని ఎస్పీ నరసింహకు సమాచారం అందడంతో విచారణకు ఆదేశించారు. విషయం తెలుసుకుని నడిగూడెం నుంచి సూర్యాపేట డీఎస్పీ కార్యాలయానికి కృష్ణంరాజును అటాచ్ చేసినట్లు నడిగూడెం ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. కృష్ణంరాజు ఇప్పటివరకు వివాహం చేసుకున్న ముగ్గురిదీ ఒకే సామాజిక వర్గం కాగా, విడాకులు ఇవ్వకుండానే ఒక్కో కేసులో రాజీపడి పరిష్కారం చేసుకుంటున్నాడు. బాలికను మూడో పెళ్లి చేసుకుని ఆమెను దూరంగా ఉంచటంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ అంశాలపై విచారణ పూర్తయిందని, విచారణ నివేదికను జిల్లా ఎస్పీకి అందజేస్తానని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

సైబర్ మోసాలపై కేంద్రం నజర్

- పైలెట్ ప్రాజెక్టుకు తెలంగాణ ఎంపిక
- త్వరలో రాష్ట్రంలో ఒక రోజంతా సెమినార్
- దేశ ప్రజల్లో చైతన్యానికి కార్యక్రమాలు
- సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ 'కమాండో'పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు.. సైబర్ మోసాల కట్టడిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. సైబర్ కేటుగాళ్ల నేరాలకు ఉపయోగించే సిమ్‌కార్డులను తక్షణమే బ్లాక్ చేసే అధికారాలను జిల్లా స్థాయిలో ఎస్పీలకు దఖలుపరచాలని నిర్ణయించినట్లు వివరించారు. కేటుగాళ్ల లొకేషన్లు, బ్యాంకింగ్, టెలికాం సోర్సుల వివరాలను దేశంలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలోని తన కార్యాలయంలో 14సీ (భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం) ఆధ్వర్యంలో అమల్లోకి తీసుకొచ్చిన సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ కమాండో ప్రోగ్రామ్‌పై హోంశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయానికి 'సమన్వయ్ ప్లాట్‌ఫాం' దోహదపడుతుందని అధికారులు బండి సంజయ్‌కి వివరించారు. దీనిపై సంజయ్ మాట్లాడుతూ.. గ్రామగ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం తెలంగాణను పైలెట్‌ప్రాజెక్టుగా తీసుకున్నట్లు చెప్పారు. త్వరలో తెలంగాణలో ఒక రోజంతా సెమినార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉన్న హోంగార్డు మొదలు, ఎస్పీస్థాయి అధికారితో కలిపి.. ఒక్కో జిల్లా నుంచి 10 మందిని ఎంపిక చేసి, వారికి అవగాహన కల్పిస్తామన్నారు. వీరంతా టీచర్లు, న్యాయవాదులు, ఇంజనీర్లు, డాక్టర్లు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లు.. ఇలా వివిధ రంగాల వారి కోసం సెమినార్లను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ బృందాలు గ్రామ స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తాయన్నారు.


కృష్ణా ప్రాజెక్టులకు నిలకడగా వరద

శ్రీశైలానికి 1.52 లక్షలు, సాగర్‌కు 65,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- గోదావరి బేసిన్‌లో ఎస్సారెస్పీకి 34,734 క్యూసెక్కుల ప్రవాహం
- హైదరాబాద్, పలు జిల్లాల్లో వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్):

కృష్ణా ప్రాజెక్టులకు వరద నిలకడగా వచ్చి చేరుతోంది. సోమవారం ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 30 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 20 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 60 వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 55 వేల క్యూసెక్కులను కిందకు విడుస్తున్నారు. ఉజ్జయిని ప్రాజెక్టుకు 2,551 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఔట్‌ఫ్లో 2,279 క్యూసెక్కులుగా ఉంది. జూరాల ప్రాజెక్టుకు 1.49 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1.19 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. తుంగభద్రకు 28 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డు అవుతుండగా... ఔట్‌ఫ్లో 23 వేల క్యూసెక్కులుగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.52 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 1.01 లక్షల క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 65,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... ఔట్‌ఫ్లో 76 వేల క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు 4 గేట్ల నుంచి నీటి విడుదల చేస్తున్నారు. ఇటు పులిచింతల ప్రాజెక్టుకు 91 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఔట్‌ఫ్లో 1.05 లక్షల క్యూసెక్కులుగా రికార్డయింది. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)కు తప్ప మిగతా ప్రాజెక్టులకు స్వల్పంగానే వరద వస్తోంది. సింగూరుకు 5,170 క్యూసెక్కులు, నిజాంసాగర్‌కు 4,690 క్యూసెక్కులు, ఎస్సారెస్పీకి 34,734 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. ఇక రాష్ట్రంలోని ప్రాజెక్టుల కింద ఈ సీజన్‌లో ఇప్పటిదాకా 1793 మిలియన్ యూనిట్ల జలవిద్యుదుత్పత్తి జరిగింది.


నిండుకుండలా మారిన శ్రీశైలం ప్రాజెక్టు

పలు జిల్లాల్లో వానలు..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు సోమవారం పలు జిల్లాల్లో వర్షాలు కురిశాయి. భాగ్యనగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. జిల్లాల్లో చాలా చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా వానలు పడ్డాయి. గద్వాల జిల్లా అలంపూర్‌లో 7.1 సెం.మీ. వర్షం కురిసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భారీ వర్షాలకు ఈసీ, మూసీ వాగులు ఉప్పొంగాయి. హిమాయత్‌సాగర్, గండిపేట జలాశయాల్లోకి భారీగా వరద చేరడంతో కొన్ని గేట్లు ఎత్తారు. హిమాయత్‌సాగర్ 4 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం పొట్టిపల్లిలో భాస్కర్ అనే వ్యక్తి వాగులో దూకడంతో గల్లంతయ్యాడు. వానలకు వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు నీటి మట్టం భారీగా పెరిగింది.

రేపట్నుంచి అతి భారీ వర్షాలు..

రాష్ట్రంలో బుధవారం నుంచి ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ఈనెల 13 నుంచి 17 వరకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశముందని హెచ్చరించింది. ఈ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని తెలిపింది.

రామప్ప విద్యుత్ కాంతులు



వెంకటాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప రామలింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో తిరంగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఆలయం ఆవరణలో 350 లైట్లతో థీమ్ ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రామప్పలో 15వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

హెచ్‌వోడీలు కావలెను

- వైద్య శాఖ విభాగాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన
- రాష్ట్రం వచ్చినప్పటి నుంచీ ఇదే దుస్థితి

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో కీలక విభాగాలకు అధిపతులు లేరు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జ్‌లే దిక్కుగా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య శాఖలో హెచ్‌వోడీ పోస్టులను మంజూరు చేసింది. గత ఆగస్టు 9న జీవో 92 జారీ చేసింది. ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విధాన పరిషత్ కమిషనర్, ఔషధ నియంత్రణ సంచాలకుల పోస్టులను మంజూరు చేస్తూ ఆ జీవో ఇచ్చింది. అయితే, ఏడాది గడుస్తున్నా ఇంత వరకు అతీగతీ లేదు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత కాలం వైద్య ఆరోగ్య శాఖలో కీలక విభాగాలకు హెచ్‌వోడీ పోస్టులను మంజూరు చేయలేదు. ఆ సర్కారు నచ్చిన, మెచ్చిన అధికారులనే కీలక పోస్టుల్లో కూర్చోబెట్టిందన్న విమర్శలున్నాయి. వైద్య శాఖలో ఎంతో కీలకమైన వైద్య విద్య సంచాలకులు, ఆరోగ్య వర్సిటీ వీసీ, ప్రజారోగ్య సంచాలకులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ పోస్టులు విభజన సమయంలో ఏపీకి వెళ్లాయి. నిబంధనల మేరకు ఆ పోస్టులను నిర్ణీత సమయంలోగా మంజూరు చేసుకోవచ్చు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు కీలకమైన ఈ పోస్టులను ఇన్‌చార్జ్‌లతోనే నడిపించింది. తమకు జరుగుతున్న అన్యాయంపై సీనియర్లు కోర్టులను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో తప్పనిసరి పరిస్థితుల్లో 16 మార్చి 2023న ఒక్క డీఎంఈ పోస్టును సర్కారు మంజూరు చేసింది. అయితే తర్వాత కాలంలో ఆ నియామకం కూడా చేపట్టలేదు. అదే ఏడాది డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెగ్యులర్ డీఎంఈని నియమించింది. నిబంధనల మేరకు సీనియారిటీ జాబితాలో ముందున్న డాక్టర్ నరేంద్ర కుమార్ రాష్ట్ర తొలి వైద్య విద్య సంచాలకులుగా నియమితులయ్యారు. ఆ తర్వాత మిగిలిన విభాగాల పోస్టులను సర్కారు మంజూరు చేసింది. హెల్త్ యూనివర్సిటీ వీసీగా డాక్టర్ నందకుమార్‌ను ఈ ఏడాది మార్చిలో నియమించింది. మరి కొన్ని కీలక విభాగాలైన డీహెచ్, టీవీవీపీ పోస్టులను మాత్రం భర్తీ చేయలేదు.

డీహెచ్ కోసం వెతుకులాట..

ప్రజారోగ్య సంచాలకుల ఇన్‌చార్జ్ బాధ్యతలను డాక్టర్ రవీంద్రనాయక్‌కు డిసెంబరు 2023లో ప్రభుత్వం అప్పగించింది. డీహెచ్ పోస్టు కోసం సీనియారిటీ జాబితాను వైద్య శాఖ సిద్ధం చేసింది. అందులో డాక్టర్ అమర్‌సింగ్ నాయక్, డాక్టర్ మోతీరాం నాయక్, డాక్టర్ పద్మజ, డాక్టర్ పుష్ప ఉన్నారు. ఇందులో మోతీరాం ఇటీవల పదవీ విరమణ చేశారు. మిగిలిన వారిలో ఇన్‌చార్జ్ డీహెచ్ రవీంద్రనాయక్, అమర్ సింగ్ నాయక్, పద్మజపై అవినీతి ఆరోపణల కారణంగా చార్జ్ మెమోలు జారీ అయ్యాయి. అవి ఇంత వరకు డ్రాప్ కాలేదు. డీహెచ్ విభాగంలో పనిచేసే ఓ వైద్యుడు ఏకంగా 23ఏళ్ల పాటు ఆచూకీ లేకుండా పోయారు. ఆ డాక్టర్ గతేడాది ప్రజారోగ్య సంచాలకులను కలసి తనకు పోస్టు ఇవ్వాలని అర్జీ పెట్టుకోగా.. వెంటనే పోస్టింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారం వెనక పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపించాయి. దీనిని సర్కారు సీరియస్‌గా తీసుకుంది. అలాగే గతేడాది జరిగిన సాధారణ బదిలీల్లో డీహెచ్ కార్యాలయ అధికారులు పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వినిపించాయి. ఈ రెండు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఇన్‌చార్జ్ డీహెచ్‌తో పాటు ఆ కార్యాలయంలో మరో ఏడుగురికి చార్జ్ మోమో జారీ చేసింది. అది ఇంకా కొలిక్కి రాలేదు. అలాగే డాక్టర్ పద్మజపై కూడా గతంలో అవినీతి ఆరోపణలు రావడంతో చార్జ్ మెమో జారీ అయింది. దీంతో సీనియారిటీ జాబితాలో ఉన్న ముగ్గురిపై చార్జ్ మెమోలు ఉండటంతో వారు హెచ్‌వోడీ పోస్టుకు అనర్హులని వైద్య వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత సీనియారిటీలో డాక్టర్ పుష్ప ఉన్నా.. ఆమె ఆ పోస్టుకు సరిపోరని సర్కారు భావిస్తోంది. దాంతో ఎవర్నీ నియమించకుండానే వైద్యశాఖ కాలం వెల్లదీస్తోంది. గత సర్కారు మాదిరిగానే కీలక విభాగాల బాధ్యతలను ఇన్‌చార్జ్‌ల చేతుల్లో పెట్టింది.

రైతుకు 'బహుళ' కుచ్చుటోపీ!

- మెదక్ జిల్లాలో వేలాది ఎకరాల్లో విత్తన వరి సాగు
- ఎకరాకు రూ.47,500 ఖర్చు
- ఇచ్చేది క్వింటాల్ ధాన్యానికి 9 వేలే
- ఒకవేళ దిగుబడి రాకుంటే రూ.75వేలు ఇస్తామని ఒప్పందం
- కోతలయ్యాక కంపెనీల ఎగనామం

మెదక్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విత్తన పంటలు సాగు చేసే రైతులను బహుళ జాతి (విత్తనోత్పత్తి) సంస్థలు తెలివిగా బురిడీ కొట్టిస్తున్నాయి. సీజన్ ప్రారంభంలోనే గ్రామాలకొచ్చే వివిధ కంపెనీల ప్రతినిధులు.. మేల్, ఫిమేల్ (విత్తన ధాన్యం) వరి సాగుతో మంచి లాభాలుంటాయని నమ్మించి చివర్లో కుచ్చుటోపీ పెడుతున్నారు. తమ విత్తనాలు సాగుచేస్తే, క్వింటాల్ ధాన్యం రూ.9,000లకు కొంటామని, దిగుబడి రాకపోయినా రూ.75,000 పరిహారం చెల్లిస్తామని చెబుతున్నారు. విత్తనాల పంట సాగులో ఎకరాకు 9/10 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. రూ.81,000-రూ.90,000 ఆదాయం ఉంటుంది. కానీ, విత్తన పంట సాగుపై అవగాహన లేక.. కాలం కలిసి రాక అనుకున్న మేరకు దిగుబడి రాని రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఆరేడు విత్తన కంపెనీల ప్రతినిధులు.. మెదక్ జిల్లాలో 5090 ఎకరాల్లో రైతులతో ఒప్పందం చేసుకోగా, మౌఖికంగా మరో 20 వేల ఎకరాల్లో రైతులు విత్తన వరిసాగు చేశారు. విత్తన పంటల సాగు అన్నదాతలకు కాస్త ఖర్చే. ఎకరాకు రూ.47,500లు అన్నదాతలే భరించాలి. కంపెనీ రూ.5,500 (కలుపు తీతకు రూ.3,000, పంట కోతకు ఎకరాకు రూ.2,500) ఇచ్చి చేతులు దులిపేసుకుంటుంది. పంటల నూర్పిడి తర్వాత.. దిగుబడి ఎంతొచ్చినా క్వింటాల్ ధాన్యానికి రూ.9,000మాత్రమే ఇస్తామని ఆయా కంపెనీల ప్రతినిధులు తేల్చేయడంతో అన్నదాతలు ఆందోళన బాట పట్టారు. వ్యవసాయ శాఖ అధికారుల దగ్గరకెళ్తే.. ఇది ప్రైవేటు వ్యవహారమని తప్పుకుంటున్నారు. ఇటీవల చేగుంట మండలం పోలంపల్లి రైతులు.. పురుగు మందు డబ్బాలతో అగ్రిమెంట్లు చేసుకున్న కంపెనీ ప్రతినిధి వద్దకెళ్లి తెచ్చుకుని ఆత్మహత్య చేసుకుంటామంటే.. మరో అవకాశం ఇవ్వండని వారిని బతిమాలుకున్నాడు. చిన్న శంకరంపేటలో మరో సీడ్స్ కంపెనీ ఆర్గనైజర్ మహేష్ గౌడ్‌పై సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంకొక సీడ్స్ సంస్థ ఆర్గనైజర్ వెంకటేశం.. 250 ఎకరాల భూమి గల రైతులతో అగ్రిమెంట్ చేయించాడు. కానీ, కంపెనీ యాజమాన్యం రూ.55 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో ఒప్పందం ప్రకారం రూ.80 వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టిన అన్నదాతలు.. వెంకటేశంపై చిన్నశంకరంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డబ్బులిమ్మంటే వాయిదాలేస్తున్నాడు

'పంట దిగుబడి రాకున్నా ఎకరాకు రూ.75 వేల పరిహారం చెల్లించడానికి ఒక సీడ్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నా. నేను 14 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పంటలను సాగు చేశా. కానీ, అగ్రిమెంట్ ప్రకారం డబ్బు చెల్లించమంటే ఆ సంస్థ ప్రతినిధి వాయిదాలేస్తున్నాడు. అప్పుల భారం మోయలేకపోతున్నా.

- రవి కుమార్, రైతు, మాచవరం, మెదక్ మండలం


మొండి సూక్ష్మజీవుల పని పట్టే ఔషధం

- అభివృద్ధి చేసిన ఐఐటీ రూర్కీ పరిశోధకులు

న్యూఢిల్లీ, ఆగస్టు 11: సూపర్‌బగ్స్‌గా మారిపోయి.. అత్యంత శక్తిమంతమైన యాంటీబయాటిక్ ఔషధాలకు సైతం లొంగని సూక్ష్మజీవుల ఆట కట్టించే సరికొత్త ఔషధాన్ని ఐఐటీ రూర్కీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. మానవాళికి వరంలా అందివచ్చిన యాంటీబయాటిక్ ఔషధాలను.. విచ్చలవిడిగా, విచక్షణ రహితంగా వాడేయడంతో చాలా సూక్ష్మజీవులు వాటికి నిరోధకతను సంతరించుకుంటున్న సంగతి తెలిసిందే. అలాంటి మొండిజీవుల్నే సూపర్‌బగ్స్‌గా వ్యవహరిస్తారు. అవి ఎవరికైనా సోకితే.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న శక్తిమంతమైన యాంటీబయాటిక్స్ కూడా వారికి పనిచేయవు. ఈ ప్రమాదం నుంచి తప్పించి, సూపర్‌బగ్స్ పనిపట్టే ఔషధాల తయారీకి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల శాస్త్రవేత్తలు కొత్తతరం యాంటీబయాటిక్ ఔషధాల తయారీపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఐఐటీ రూర్కీ పరిశోధకులు.. క్లెబ్సియెల్లా న్యూమోనియే' అనే మందులకు లొంగని గ్రామ్‌నెగెటివ్ బ్యాక్టీరియా (సూపర్‌బగ్) ఉత్పత్తి చేసే కేపీసీ-2 అనే ఎంజైమ్‌ని నిరోధించే కొత్త మాలిక్యూల్‌ను అభివృద్ధి చేశారు. దీన్ని మెరోపెనెమ్ అనే యాంటీబయాటిక్‌తో కలిపి ఇస్తే అది కేపీసీ-2ని అడ్డుకుంటుంది. మరోవైపు మెరోపెనెమ్ తనపని తాను చేసుకుపోయి క్లెబ్సియెల్లా న్యూమోనియేను నాశనం చేస్తుంది. ఇది ఎంత ప్రమాదకరమైన సూపర్‌బగ్ అంటే.. ప్రపంచ ఆరోగ్య సంస్థ మానవాళికి పెనుప్రమాదం కలిగించే సూపర్‌బగ్స్‌తో తయారుచేసిన జాబితాలో దీని పేరుంది. అలాంటి బగ్‌కు చెక్‌పెట్టే మందును మన రూర్కీ పరిశోధకులు అభివృద్ధి చేయడం విశేషం. ఈ పరిశోధన ఫలితం మెడిసినల్ కెమిస్ట్రీ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమైంది.

సీఎం రేవంత్‌రెడ్డిపై ఎన్నికల కేసు కొట్టివేత

మరో కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు



హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. హుజూర్‌నగర్ ఉపఎన్నికల సందర్భంగా ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు సోమవారం కొట్టేసింది. ఈ ఉప ఎన్నికల సందర్భంగా అనుమతి లేకుండా పొనుగోడులో ఎన్నికల సభ నిర్వహించారని పేర్కొంటూ అప్పటి కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులపై గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆధారాలులేకుండా తప్పుడు కేసు పెట్టారని, ఏ2గా ఉన్న తనపై కేసు కొట్టేయాలని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా.. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ పెట్టిన సెక్షన్లకు తగిన నేరం జరిగినట్లు నిరూపణలేదని పేర్కొంది. ఈమేరకు రేవంత్‌రెడ్డిపై కేసు కొట్టేస్తూ తీర్పు ఇచ్చింది. కాగా కొవిడ్ నిబంధనలతోపాటు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా 2,500 మంది కార్యకర్తలతో సమావేశం నిర్వహించారని పేర్కొంటూ 2021లో హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో రేవంత్‌రెడ్డికి ఊరట లభించింది. ఈ కేసులో నాంపల్లి ఎంపీ, ఎమ్మెల్యే కేసుల మేజిస్ట్రేట్ కోర్టులో రేవంత్‌రెడ్డికి వ్యక్తిగత హాజరు నుంచి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది.

విలీనమైన బ్యాంకు ఉద్యోగులకు ప్రయోజనాల్లో వ్యత్యాసంపై వివరణ ఇవ్వండి

- ఉద్యోగుల పిటిషన్‌లో ఆర్బీఐకి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఉద్యోగులకు, ఎస్బీఐలో విలీనమైన పలు ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులకు మధ్య రిటైర్‌మెంట్, ఇతర ప్రయోజనాల్లో వ్యత్యాసం ఉండటంపై వివరణ ఇవ్వాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ)కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈమేరకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎస్బీఐలో విలీనమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్బీహెచ్), స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్, మైసూర్, పాటియాలా, ట్రావెన్‌కోర్ తదితర బ్యాంకుల ఉద్యోగులకూ ఎస్బీఐ ఉద్యోగుల తరహాలోనే ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ పలువురు అధికారులతోపాటు ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషనర్లు ఆయా రిటైర్‌మెంట్, ఇతర ప్రయోజనాలకు అర్హులుకారని పేర్కొంటూ సింగిల్ జడ్జి సదరు పిటిషన్‌ను కొట్టేసింది. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్లు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం ఈ అంశంపై వివరణ ఇవ్వాలని ఆర్బీఐకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబరు 10కి వాయిదా పడింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీభత్స నిర్ణయం

గాజాను ఆక్రమించబోవడం లేదు, హమాస్ నుంచి విముక్తి కలిగిస్తున్నామంతే అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ ప్రకటించినప్పటికీ, జరగబోయేదేమిటో అందరికీ తెలుసు. గాజా నగరం స్వాధీనానికి ఇజ్రాయెల్ మంత్రివర్గం తీర్మానించగానే అన్ని దేశాలూ ఆ ప్రతిపాదనమీద మండిపడ్డాయి. ఐక్యరాజ్యసమితి కూడా ఈ నిర్ణయం ప్రమాదకరమైనదంటూ అభ్యంతరం వెలిబుచ్చింది. దీంతో నెతన్యాహూ సామాజిక మాధ్యమాల్లో ఓ చిన్న వివరణ ఇస్తూ, గాజా స్వాధీనం అన్నంత మాత్రాన అది తమదగ్గరే ఉంచేసుకోబోమన్నారు. ఈ ప్రాంతానికి హమాస్ నుంచి స్వేచ్ఛను ప్రసాదిస్తాం, నిస్సైనికీకరణ చేస్తాం, పాలస్తీనా అథారిటీ, హమాస్ సహా మరే ఉగ్రవాద సంస్థ ప్రమేయం లేని శాంతియుత పౌరపాలన నెలకొల్పుతాం అని ప్రకటించారాయన. తన ఈ చర్యలతో హమాస్ దగ్గర ఉన్న ఇజ్రాయెలీ బందీలకు విముక్తి దొరుకుతుందని, ఇజ్రాయెల్‌కు గాజా నుంచి శాశ్వతంగా ముప్పు ఉండదని ఆయన భవిష్యత్ దర్శనం చేశారు. ఇంత చక్కగా చెబుతున్నా కూడా, భద్రతామండలిలో అమెరికా తప్ప, శాశ్వత సభ్య దేశాలన్నీ నెతన్యాహూ నిర్ణయాన్ని తప్పుబట్టాయి. యుద్ధం ఆగాలంటే, హమాస్ అంతం కావాలి, అది జరగాలంటే మొత్తం గాజాను మేము దురాక్రమించాలి అన్నది నెతన్యాహూ వ్యాఖ్యల సారాంశం.

ప్రపంచ దేశాల ఈ ఖండనమండనలు, అభ్యంతరాలు నెతన్యాహూను నిలువరించలేవన్నది నిజం. గాజాను గుప్పిట్లోకి తెచ్చుకొనే ఆ ప్రక్రియ అతి బీభత్సంగా ఉండబోతున్నది. అల్ షిఫా ఆస్పత్రి ప్రధానద్వారం వెలుపల మీడియాకోసం ఉద్దేశించిన టెంట్ మీద ఇజ్రాయెల్ ఆదివారం రాత్రి క్షిపణులు ప్రయోగించి అల్‌జజీరా చానెల్‌కు చెందిన ఐదుగురు పాత్రికేయులను పొట్టనబెట్టుకుంది. ఈ బృందం నాయకుడు హమాస్ ఉగ్రవాది అని ఇజ్రాయెల్ ఆరోపణ. ఖతార్‌కు చెందిన ఈ మీడియా సంస్థమీద నెతన్యాహూ కక్షకట్టి, యుద్ధం ఆరంభమైనప్పటి నుంచీ దానిని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. గత 22 నెలల్లో 200మంది జర్నలిస్టులను చంపి బాహ్యప్రపంచానికి తన నేరాలూఘోరాలూ తెలియనివ్వకుండా చేయాలని ఇజ్రాయెల్ ఎంతో ప్రయత్నిస్తోంది. ఇప్పుడు మరింత భీకరంగా గాజాలోకి చొరబడబోతున్న నేపథ్యంలో, మీడియాపై ఆదివారం నాటి దాడి ఒక బలమైన హెచ్చరిక. క్షేత్రస్థాయి నిజాలు వెలుగుచూడనివ్వకుండా నియంత్రించే ప్రయత్నం.

స్వతంత్ర పాలస్తీనా రాజ్యం ఏర్పాటయ్యేవరకూ ఆయుధాలు వదిలేది లేదనీ, అది ఏర్పడిన తరువాత భవిష్యత్ పాలస్తీనా అథారిటీకి తానే స్వయంగా ఆయుధాలు అప్పగిస్తానని హమాస్ అంటోంది. హమాస్ బాగా దెబ్బతిన్నప్పటికీ, గాజాలో చెప్పుకోదగ్గ ప్రాంతాన్ని అది ఇంకా నియంత్రించగలుగుతున్నందున దానిని ఈ స్థితిలో వదిలివేయడం తమకు ప్రమాదకరమని నెతన్యాహూ భావిస్తున్నారు. ఇటీవల అమెరికా–ఇజ్రాయెల్ కలిసి పన్నెండు రోజులపాటు ఇరాన్‌ను దెబ్బతీసిన కారణంగా అది హమాస్‌కు సహాయపడగల స్థితిలో లేదని ఆయన నమ్మకం. హిజ్బొల్లా వంటి సంస్థలు కూడా బలహీనపడి ఉన్న ఈ దశలోనే హమాస్‌ను సమూలంగా తుడిచేయవచ్చునన్న ఆశతో నెతన్యాహూ ఈ కొత్త దురాక్రమణలో దూకుడుగా ఉన్నారు. హమాస్ తన వద్ద ఉన్న ఆయుధాలను పాలస్తీనా అథారిటీకి అప్పగించి, గాజాపాలన నుంచి తప్పుకోవాలని ఇటీవల ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో న్యూయార్క్‌లో జరిగిన సదస్సులో అరబ్‌దేశాలు కూడా విజ్ఞప్తిచేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 7దాడిని అవి ఖండించడం కూడా ఇదే తొలిసారి. మూడు అరబ్‌దేశాలు, నాలుగు పశ్చిమదేశాలు, రెండు ముస్లిం దేశాలు కలసికట్టుగా చేసిన ఈ ప్రతిపాదనలు అటు హమాస్‌కు, ఇటు ఇజ్రాయెల్‌కు కూడా కాలువెనక్కుతీసుకోవడానికి మంచి మార్గం. కానీ, రెండు స్వతంత్ర, సార్వభౌమ దేశాలుగా ఇజ్రాయెల్, పాలస్తీనా పక్కపక్కనే మనగలగడం నెతన్యాహూ దృష్టిలో అసాధ్యం. ఆయన అధికారంలో ఉన్నంతవరకూ పరిష్కారాలకు దూరంగా కొత్తరూపాల్లో గాజా యుద్ధం కొనసాగుతూనే ఉంటుంది. గాజాను ఆక్రమించబోవడం లేదంటూనే హమాస్ నుంచి దానిని వశపరచుకొనే నెతన్యాహూ కొత్త ఎత్తుగడ 22నెలల యుద్ధాన్ని మరి కొంతకాలం కొనసాగించడానికి ఉపకరిస్తుంది. హమాస్ ఎదురు నిలవగలదా అన్నది ఇక్కడ అప్రస్తుతం. కానీ, మరిన్ని చావులు, మరింత విధ్వంసాన్ని ఈ ప్రపంచం చూడాల్సి వస్తుంది.

మెడికల్ కాలేజీలపై తప్పులెన్నువారు...!

నార్సిస్టిక్ పెర్సనాలిటీ డిజార్డర్ ఉన్నవారు తమను తాము గొప్పవారిగా ఊహించుకుంటూ, అవతలివారి ప్రతి పనినీ తప్పుపడుతూంటారు. బీఆర్ఎస్ నేతలు మెడికల్ కాలేజీల అంశంమీద చేసిన విమర్శలు ఈ కోవలోకే వస్తాయి. ప్రతి జిల్లాకూ ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి, జిల్లా హాస్పిటళ్లను మెడికల్ కాలేజీలుగా మార్చుకోవడానికి రాష్ట్రాలకు నిధులు కేటాయించింది. మూడో దశలో దక్షిణాది రాష్ట్రాలకు అవకాశం ఇచ్చింది. దీనికి ముందే, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఢిల్లీ వెళ్లి ఖమ్మం, కరీంనగర్‌లో మెడికల్ కాలేజీలు ఇవ్వాలని కోరితే, పూర్తి వివరాలతో (డీపీఆర్) మూడోదశలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈటల మంత్రిగా ఉన్నప్పుడు కాలేజీలు ఏర్పడడం ఇష్టంలేక కాబోలు, నాటి రాష్ట్ర ప్రభుత్వం ఈ సూచనను తుంగలో తొక్కింది. దీంతో తెలంగాణ మినహా దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ కేంద్రం నుంచి మెడికల్ కాలేజీలు, నిధులు మంజూరు అయ్యాయి.

తెలంగాణ ప్రభుత్వం కాలేజీల కోసం దరఖాస్తు చేసుకోలేదని కేంద్ర ప్రభుత్వం పలుమార్లు పార్లమెంట్‌లో ప్రకటించడంతో దీనికి కౌంటర్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ తిప్పలు పడింది. అటు కేంద్రంలో బీజేపీ, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ఇరుకున పెడుతుండడంతో 'కేంద్రం ఇచ్చేది ఏంది.. మేమే జిల్లాకో మెడికల్ కాలేజీ పెడతాం' అని ప్రకటించింది. అనుకున్నదే తడువుగా సరిపడా ఫ్యాకల్టీ, కాలేజీల భవనాలు, ల్యాబులు, మౌలిక వసతులు, అనుబంధంగా అవసరమైన బెడ్ స్ట్రెంత్ కలిగిన హాస్పిటళ్లు లేకుండానే 2022లో 8 కాలేజీలు, 2023లో 9 కాలేజీలను ప్రారం భించారు. ఇలా గంప గుత్తగా కాలేజీల ఏర్పాటును నిపుణులు వ్యతిరేకించినప్పటికీ నాటి ప్రభుత్వం లెక్కచేయలేదు. 2021 వరకూ ఉన్న పాత 9 కాలేజీల్లోని ఫ్యాకల్టీనే మొత్తం 17 కాలేజీల్లోకి సర్దుబాటు చేశారు. 2023లో మరో 9 కొత్త కాలేజీలతో మొత్తం ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 26కు చేరింది. దీంతో, టీచింగ్ ఫ్యాకల్టీ కొరత తీవ్రంగా పెరిగింది.



నాడు అధికారంలో ఉండగా సరైన ప్రణాళిక, తగిన వసతులు లేకుండా కాలేజీలు ప్రారంభించి సమస్యలకు బీజం వేసిన గత ప్రభుత్వంలోని వ్యక్తులే, ఇటీవల నేషనల్ మెడికల్ కమిషన్ కాలేజీలకు నోటీసులు ఇవ్వడాన్ని ప్రస్తుత ప్రభుత్వ చేతగానితనంగా చూపి, విమర్శలు గుప్పించారు.

ఒక వంద సీట్లతో మెడికల్ కాలేజీ పెట్టాలంటే, కనీసం 420 బెడ్ల హాస్పిటల్ ఉండాలి. మన దగ్గర 50 బెడ్లు లేదా వంద బెడ్లు ఉన్న హాస్పిటళ్లనే మెడికల్ కాలేజీలకు అనుబంధ హాస్పిటళ్లుగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి చూపించారు. కొత్తగా హాస్పిటల్ బిల్డింగ్స్ నిర్మించలేదు. పాత 50 లేదా 100 బెడ్లు ఉన్న హాస్పిటళ్లలోనే అదనంగా బెడ్లను వేసి సర్దుబాటు చేశారు. ఈ అంశంలో ఎన్ఎంసీ అభ్యంతరాలు లేవనెత్తగా, రెండేళ్లలో కొత్త హాస్పిటళ్లను అందుబాటులోకి తీసుకొస్తామని నాటి ప్రభుత్వం అఫిడవిట్లు ఇచ్చింది.

మరోవైపు, అద్దెకు భవనాలను తీసుకుని, పాత ప్రభుత్వ భవనాలను రిపేర్లు చేసి కాలేజీలుగా మార్చారు. కొన్ని చోట్ల గోదాములను క్లాసు రూములుగా మార్చేశారు. రెండేళ్లలో అన్ని కాలేజీలకు భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామని ఎన్ఎంసీకి అప్పటి ప్రభుత్వం అఫిడవిట్లు ఇచ్చి, పర్మిషన్లు తెచ్చింది. కానీ, 2023 చివరిలో అధికారం నుంచి దిగిపోయే నాటికి కూడా హాస్పిటళ్లను, కాలేజీలను అందుబాటులోకి తీసుకురాలేకపోయింది. చాలా చోట్ల కనీసం భవన నిర్మాణ పనులను కూడా ప్రారంభించలేదు.

మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు అని మూడు కేటగిరీలు ఉంటాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లను మాత్రమే నేరుగా నియమించుకోవడానికి అవకాశం ఉంది. అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లను డైరెక్ట్‌గా రిక్రూట్ చేసుకునే అవకాశం లేదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిక వ్యక్తి కనీసం మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటేనే అసోసియేట్ ప్రొఫెసర్‌గా ప్రమోషన్‌కు అర్హులు అవుతారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా కనీసం నాలుగేళ్ల సర్వీస్ ఉంటేనే ప్రొఫెసర్‌గా ప్రమోషన్‌కు అర్హులు అవుతారు. అంటే, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిన వ్యక్తి, ప్రొఫెసర్ అవ్వాలంటే కనీసం ఏడేళ్ల అనుభవం ఉండాలి. మన మెడికల్ కాలేజీల్లో అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల కొరతకు ఇదే ముఖ్య కారణం. మూడేళ్లలో 25 కొత్త కాలేజీలు ఏర్పడగా, అవసరమైన మేర అర్హత కలిగిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు లేకపోవడం ఇబ్బందిగా మారింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఇందుకు అవసరమైన క్వాలిఫికేషన్, స్పెషలైజేషన్ ఉన్నవాళ్లు ఎక్కువమంది లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో పనిచేయడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి.

సరిపడా ఫ్యాకల్టీ లేకపోవడం, కాలేజీలకు హాస్పిటళ్లకు భవనాలు లేకపోవడంతో 2022–23 నుంచి ఏటా మన రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ నోటీసులు జారీ చేస్తున్నది. ఈ ఏడాది కూడా నోటీసులు జారీ కావడంతో ఇదే అదునుగా నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ బాధితులు రంగంలో దిగారు. నాడు సరైన ప్రణాళిక, తగిన వసతులు లేకుండా కాలేజీలు ప్రారంభించి సమస్యలకు బీజం వేసిన గత ప్రభుత్వంలోని వ్యక్తులే, నేడు ఎన్ఎంసీ నోటీసులు ఇవ్వడాన్ని ప్రస్తుత ప్రభుత్వ చేతగానితనంగా చూపిస్తూ విమర్శలు గుప్పించారు, విద్యార్థులను ఆందోళనకు గురిచేశారు. కానీ, ఇంతలోనే ఆ భ్రమలనూ ఎన్ఎంసీ తొలగింపజేసింది. మెడికల్ కాలేజీల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యలను అభినందిస్తూ, రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలకు అనుమతులను యథావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దెబ్బతో నార్సిస్టిక్ పర్సనాలిటీ డిజార్డర్ వ్యక్తులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుపట్టడానికి మరో అంశాన్ని వెతుక్కొనే పనిలో పడ్డారు.

■ డేగ కుమార్ యాదవ్
జర్నలిస్ట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

అగ్రరాజ్య ఆటలో భారత్ ఒడ్డున పడేనా?

ఆదర్శాలు, ఆర్థిక ప్రయోజనాలు.. ఈ రెండిటినీ విడదీసి చూస్తే అసలు విషయాలు అర్థంకావు. ఆదర్శాలకు అనేక ముసుగులు ఉంటాయి. ఒక్కోదాన్ని తొలగించుకుంటూ వెళ్తే తప్ప అసలు ప్రయోజనాలను పసిగట్టలేం. ఆధిపత్యం చేజారిపోతున్నప్పుడు ముసుగులు తీసేసి ఎట్లా మాట్లాడుతారో తెలుసుకోవాలంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైపే చూడాలి! స్వేచ్ఛా వాణిజ్యం గురించి ప్రపంచానికి ఒకనాడు అమెరికా చెప్పిన ఆదర్శాలు అన్నీఇన్నీ కావు. ఇప్పుడు అవన్నీ పక్కకుబెట్టి అసంబద్ధ ఏకపక్ష సుంకాలతో దేశాలను శాసించటం ట్రంప్‌కు ఒక విధానంగా మారిపోయింది. భారత్ వస్తువులపై 50 శాతం సుంకాలను విధించి తనది అసలుసిసలైన నయాసామ్రాజ్యవాద పోకడగా నిరూపించుకున్నారు. దీన్ని ఎదుర్కోటానికి మోదీ ప్రభుత్వం కిందామీదా పడుతోంది. విదేశాంగ విధానానికి సంబంధించి ఇటీవల కాలంలో ఎన్నడూ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

గడచిన 25 ఏళ్లుగా అమెరికా అండను పొందటమే ప్రధానంగా భారత విదేశాంగ విధానం రూపుదిద్దుకుంది. ఆర్థికంగా, సాంకేతికంగా, సైనికశక్తి పరంగా అనూహ్య వేగంతో దూసుకుపోతున్న చైనాను నిలువరించటానికి అమెరికాకు భారత్ కావాల్సి వచ్చింది. దక్షిణాసియాలో సైతం పెరిగిపోతున్న చైనా ప్రాధాన్యాన్ని నిలువరించటానికి అన్నిరంగాల్లో అమెరికాతో ఇచ్చిపుచ్చుకోవటం భారత్‌కూ వ్యూహాత్మక అవసరమైంది. నిజానికి ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆ అవసరం భారత్‌కు ఇంకా ఎక్కువైంది. కానీ పరిస్థితులు భిన్నంగా, అనూహ్యంగా మారిపోతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సాఫల్య, వైఫల్యాలపై రక్షణ వ్యవహారాల నిపుణులు లోతైన విశ్లేషణలు చేస్తున్నారు. పాకిస్థాన్ ఆయుధ సంపత్తిలో చైనా పాత్ర అందరికీ తెలుసు. కానీ పాక్ యుద్ధ తంత్రమూ, దాని అమలూ కూడా చైనా కనుసన్నల్లో నడుస్తోందన్న విషయం ఆపరేషన్ సిందూర్ సందర్భంగా స్పష్టమైంది. యుద్ధం అన్న తర్వాత నష్టాలు ఉంటాయి. అయితే ఆ నష్టాలు సమానంగానో, ఊహించని రీతిలో కాస్త ఎక్కువగానో ఉంటే సమస్యలు మొదలవుతాయి. చైనా వ్యూహాత్మక మద్దతుతో సాగిన యుద్ధంవల్లే అవి వస్తే మన భవిష్యత్తు అడుగులను తీవ్రంగా ప్రభావితం చేసేవిగా ఉంటాయి. భారత్ చుట్టూ చక్రబంధంలా చైనా మారిపోయిన కఠోర పరిస్థితుల్లో ట్రంప్ చర్యలు ఎంత అవమానకరంగా అనిపించినా తాడోపేడో తేల్చుకోటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. రష్యాతో మైత్రినీ, చమురు కొనుగోళ్లనూ వదులుకోబోమని ఒక వంక చెబుతూనే మరోవైపు చైనాతో కూడా సామరస్యంగా వ్యవహరించటానికే మొగ్గుచూపుతున్నట్లు సంకేతాలు ఇస్తోంది. అందుకే ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనాలో పర్యటించబోతున్నారు. తమకు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఉన్నాయని చెప్పటమే భారత్ తక్షణ లక్ష్యంగా కనపడుతోంది.

ఒకటి మాత్రం నిజం. చైనా, భారత్, రష్యాలు ఆర్థికంగా సహకరించుకుంటే ట్రంప్ అంచనాలన్నీ తారుమారవుతాయి. అమెరికా ఆర్థిక, సైనిక ఆధిపత్యం మరింత దిగజారుతుంది. అమెరికాకు 75 ఏళ్లల్లో ఎన్నడూ చూడని సవాళ్లు ఎదురవుతాయి. ఇదే జరిగితే యూరప్ దేశాలు అమెరికాకు తానాతందాన అనే పరిస్థితి నుంచి బయటపడొచ్చు. లాటిన్ అమెరికాలో కూడా అమెరికా ఆధిపత్యానికి గండిపడుతుంది. ఇప్పటికే బ్రెజిల్ అమెరికాపై చాలా కోపంగా ఉంది. అమెరికాను ఆధిపత్యధోరణుల కట్టడి చేయటానికి చైనా, భారత్‌లు సమష్టిగా అడుగులు వేస్తే చరిత్ర కొత్త మలుపుతిరుతుంది. ఆ మలుపు అంత సులభం కాదు. అభిలాషతో అన్నీ జరగవు. రెండు దేశాల మధ్య ఇప్పటి దాకా జరిగిన పరిణామాలు, పోటీలు, వివాదాలే అందుకు కారణం.



దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా అమెరికా, చైనాల మధ్య సమదూరం పాటించక తప్పనిసరి పరిస్థితి భారత్‌కు ఏర్పడుతోంది. ఒకవైపు మొగ్గితే తీవ్ర ప్రతికూలతలూ ఉన్నాయి. పొరుగునున్న బలమైన దేశాల నుంచి నిరంతరం ఎదురయ్యే ఆర్థిక ఒత్తిళ్లు, సైనిక సవాళ్లు యూరపు చరిత్రలో శాస్త్ర–సాంకేతిక విజ్ఞానాన్ని పరుగులు పెట్టించాయి. అది భారత్ విషయంలో నిజమైతేనే ఎంతోకొంత ఉపశమనం! సమస్త విజ్ఞానానికీ మనమే ఆద్యులమన్న చిత్తభ్రమ నుంచీ, హిందూ ఆధిపత్య భావాల నుంచీ బయటికి వస్తేనే అది సాధ్యమవుతుంది.

భారత–చైనా మధ్య వివాదాలు ఈనాటివి కావు. ఆసియాలో ఆధిపత్యం, నాయకత్వ పాత్రపై రెండు దేశాల మధ్య పెనుగులాటలు 1950ల నుంచే మొదలయ్యాయి. బ్రిటిష్ వలసపాలకులు నిర్ణయించిన సరిహద్దులను అంగీకరించబోమని చైనా, వాటిని యథాతథంగా కొనసాగించాలని భారత్ పట్టుబట్టటంతోనే వివాదం మొదలైంది. 1950ల నాటికే అక్సాయిచిన్ ప్రాంతం చైనా నియంత్రణలో ఉంది. ఉపగ్రహచిత్రాల్లేని ఆ రోజుల్లో అక్సాయిచిన్‌లో జనసంచారం, సైనికుల కదలికల గురించి తెలుసుకునే అవకాశమే లేదు. అందుకే ఆ నియంత్రణ గురించి భారత్‌కు చాలా ఆలస్యంగా తెలిసింది. 1951లో టిబెట్‌ను చైనా స్వాధీనం చేసుకున్న నాటి నుంచే చైనా కదలికలను సునిశితంగా పరిశీలించటం ఎంతో కొంత మొదలైంది. అక్సాయిచిన్ ఎడారి ప్రాంతం. లద్దాఖ్ మహారాజు 1865లో దాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. అంతకుముందు బ్రిటిషు సైన్యం చేతుల్లో సిక్కు రాజ్యం (1846) ఓడిపోయింది. ఆ తర్వాత లద్దాఖ్‌ను లాంఛనంగా స్థానిక మహారాజాకు అప్పగించారు.


■ రాహుల్ కుమార్

లద్దాఖ్ తూర్పు ప్రాంతమైన అక్సాయిచిన్‌కు సంబంధించి సరిహద్దులేవీ అప్పటికి స్పష్టంగా లేవు. అక్సాయిన్ ఎడారికి ఇవతల ఉన్న కారాకోరం పర్వతాలనే లద్దాఖ్‌కు తూర్పు సరిహద్దుగా భావించేవారు. కానీ 1865లో లద్దాఖ్ మహారాజు సర్వే జరిపించి ఈశాన్యంలో పర్వతాలకు అవతలున్న అక్సాయిచిన్ ఎడారి ప్రాంతాన్ని కూడా లద్దాఖ్‌లో కలిపి సర్వేపటాన్ని సిద్ధంచేశారు. సర్వేయర్ జాన్సన్‌కు లంచమిచ్చి పటాన్ని అలా తయారుచేశారన్న ఆరోపణలు అప్పుడే వచ్చాయి. బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం జాన్సన్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది. సరిహద్దును విస్తరించటం బ్రిటిష్ ఇండియా ప్రభుత్వానికి అప్పట్లో ఇష్టంలేదు. జాన్సన్‌కు లద్దాఖ్ మహారాజు తర్వాతి కాలంలో ప్రధానమంత్రి పదవిని కట్టబెట్టారు. రష్యా సామ్రాజ్య విస్తరణను దృష్టిలో పెట్టుకుని కారాకోరం పర్వతశ్రేణిని సరిహద్దుగా నిర్ణయిస్తే బాగుంటుందని భావించిన బ్రిటిషు పాలకులు ఆ మేరకు మాకార్ట్నీ మక్డోనాల్డ్ పేరిట 1890ల్లో సర్వే పటాన్ని తయారుచేసి చైనాకు పంపారు. దానిపై చైనా స్పందించలేదు. స్పందన లేకపోవటాన్ని ఆమోదంగా భావించి 1941 వరకూ దాన్నే సరిహద్దుగా పరిగణించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో సోవియట్ సైనికదళాలు అక్సాయిచిన్ ఉత్తరభాగంలో సంచరిస్తున్నాయని తెలుసుకుని జాన్సన్ ప్రతిపాదించిన మేరకు లద్దాఖ్ సరిహద్దుని మళ్లీ విస్తరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జాన్సన్ సరిహద్దు గురించి చైనాకు అధికారికంగా ఎప్పుడూ తెలపలేదు. లద్దాఖ్ సరిహద్దును తాము ఆమోదించలేదని 1954లో చైనా స్పష్టంచేసింది.

అరుణాచల్ ప్రదేశ్‌పై వివాదానికీ చాలా చరిత్ర ఉంది. 1911లో చైనాలో వచ్చిన విప్లవాన్ని ఆసరాగా తీసుకుని అప్పటి టిబెట్ పాలకుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. చైనా ప్రభుత్వం దాన్ని అంగీకరించలేదు. బ్రిటన్ మాత్రం టిబెట్‌ను బఫర్‌జోన్‌గా ఉపయోగించుకోవాలని భావించింది. చైనా, టిబెట్, బ్రిటిషు ఇండియా ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగాయి. ఏకాభిప్రాయం కుదరలేదు. ఇదే సమయంలో టిబెట్–ఇండియా మధ్య సరిహద్దుని ఉత్తరాన 60 మైళ్ల ముందుకు జరిపి హిమాలయాల హద్దుగా ఒక ప్రతిపాదన చేశారు. బ్రిటిష్ ఇండియా విదేశాంగ మంత్రిగా ఉన్న హెన్రీ మక్‌మాన్ దాన్ని ప్రతిపాదించటం వల్ల అదే పేరుతో ప్రచారమైంది. స్థానిక గిరిజన ప్రాంతాలతో పాటు తవాంగ్‌ను కూడా కొత్త సరిహద్దుల్లో కలిపారు. ఆ ప్రాంతాలకు తర్వాత నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ ఏజన్సీగా పేరుపెట్టారు. చర్చల్లో చైనా ప్రతినిధి కొత్త సరిహద్దులను ఆమోదించారని బ్రిటిష్ ఇండియా పాలకులు ప్రకటించారు. చైనా ప్రభుత్వం దాన్ని అప్పుడే తోసిపుచ్చింది. లండన్‌లోని బ్రిటిషు ప్రభుత్వం మొదట్లో మక్‌మాన్ సరిహద్దుని ఆమోదించలేదు. కొన్ని సవరణలతో తర్వాత దాన్ని ఆమోదించినా అప్పటి నుంచి చైనా వ్యతిరేకిస్తూనే ఉంది. 1960లో చైనా ప్రధాని చౌఎన్‌లై... భారత్ అక్సాయిచిన్‌ను వదులుకుంటే అరుణాచల్ ప్రదేశ్‌పై భారత్ అధికారాన్ని అంగీకరిస్తామని ప్రతిపాదించారు. 1980లో డెంగ్ జియావోపింగ్ దాన్నే పునరుద్ఘాటించారు. అప్పటికే చైనా వ్యతిరేకత రాజకీయ ఆలోచనల్లో బలంగా ఉండటంతో భారత్ వైపునుంచి సానుకూలత వ్యక్తంకాలేదు. వివాదాస్పద ప్రాంతాల్లో పట్టుకోసం చేసే ప్రయత్నాల్లో భాగంగా 1962లో రెండు దేశాల మధ్య యుద్ధమూ జరిగింది. డోక్లాం, గల్వాన్ లోయలో సంఘర్షణలూ ఆ సరిహద్దు వివాదాల కారణంగానే చోటుచేసుకున్నాయి.

చారిత్రక దృష్టితో చూస్తే భారత్–చైనా మధ్య సరిహద్దులు ఇచ్చిపుచ్చుకోవాల్సిన రీతిలో పరిష్కారమవ్వాలి. నిష్పాక్షిక చరిత్ర చెప్పేది అదే. వలసపాలకులు సృష్టించిన సరిహద్దురేఖలు లక్ష్మణరేఖలు కావు. ఒకప్పుడు ఆర్థికంగా, సైనికంగా సమానస్థాయిలో ఉన్న భారత్–చైనాలు 45 ఏళ్లల్లో తీవ్రమైన మార్పులకు లోనయ్యాయి. రెండిటి మధ్యా ఆర్థిక, సైనిక, సాంకేతిక రంగాల్లో అసమానతలు విపరీతంగా పెరిగాయి. 1950ల్లో ఆసియాకు ఎవరు నాయకత్వం వహించాలన్న విషయంలో భారత్–చైనాల మధ్య పోటీ ఉండేది. ఆసియా ఖండానికి తొలి నాగరికతలు అందించిన దేశాలుగా, వేల ఏళ్ల ఆర్థికంగా అగ్రగామి వ్యవస్థలుగా వెలుగొందిన కారణంగా ఆనాడు రెండు దేశాల నేతలను ఆసియా నాయకత్వం పోటీపడేలా చేసింది. ఇప్పుడా పరిస్థితి లేదు. నేటి చైనా స్థాయిని భారత్ అందుకోటానికి మరో ముప్పయేళ్లు పడుతుందనే అంచనాలు ఉన్నాయి. 1987లో ఇరు దేశాల స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ–నామినల్) ఒకేస్థాయిలో ఉండేవి. ఇప్పుడు చైనా జీడీపీ 18 ట్రిలియన్ డాలర్లు ఉంటే భారత్ జీడీపీ 4.2 ట్రిలియన్ డాలర్లు మాత్రమే ఉంది. ఒకవైపు పరిష్కారం కాని సరిహద్దు వివాదం.. మరోవైపు అన్నిరంగాల్లో ఆధిపత్యం దిశగా చైనా పరుగులు.. భారత్‌ను అమెరికాకు దగ్గర చేసింది. ఇక చైనాని నిరోధించటానికి భారత్‌ను చేరువ చేసుకోవాల్సిన అవసరమూ అమెరికాకు ఏర్పడింది. దక్షిణాసియాలో భారత్ ఇప్పటికే వాణిజ్యపరమైన ఆధిక్యతను కోల్పోయింది. మరోవైపు భారత్ దిగుమతుల్లో సైతం చైనా అగ్రస్థానంలో ఉంది. అమెరికా అండలేకుండా చైనాను నిలువరించే పరిస్థితుల్లో భారత్ ఉందని చెప్పలేం. అయితే దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా అమెరికా, చైనాల మధ్య సమదూరం పాటించక తప్పనిసరి పరిస్థితి భారత్‌కు ఏర్పడుతోంది. ఒకవైపు మొగ్గితే తీవ్ర ప్రతికూలతలూ ఉన్నాయి. పొరుగునున్న బలమైన దేశాల నుంచి నిరంతరం ఎదురయ్యే ఆర్థిక ఒత్తిళ్లు, సైనిక సవాళ్లు యూరపు చరిత్రలో శాస్త్ర–సాంకేతిక విజ్ఞానాన్ని పరుగులు పెట్టించాయి. అది భారత్ విషయంలో నిజమైతేనే ఎంతోకొంత ఉపశమనం! సమస్త విజ్ఞానానికీ మనమే ఆద్యులమన్న చిత్తభ్రమ నుంచీ, హిందూ ఆధిపత్య భావాల నుంచీ బయటికి వస్తేనే అది సాధ్యమవుతుంది.

చారిత్రక దృష్టితో చూస్తే భారత్–చైనా మధ్య సరిహద్దులు ఇచ్చిపుచ్చుకోవాల్సిన రీతిలో పరిష్కారమవ్వాలి. నిష్పాక్షిక చరిత్ర చెప్పేది అదే. వలసపాలకులు సృష్టించిన సరిహద్దురేఖలు లక్ష్మణరేఖలు కావు.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఆదివాసీలు ముమ్మాటికీ హిందువులే!

భారతదేశం అనేక సంస్కృతీ సంప్రదాయాలకు నెలవు. భిన్నత్వంలో ఏకత్వం ఈ దేశ ప్రత్యేకత. అయితే మతపరమైన చిచ్చుపెట్టి దేశ సమగ్రతను దెబ్బతీసే కుట్ర జరుగుతున్నది. ఆదివాసీలు హిందువులేనా అనే కుట్ర మొదలైంది (భంగ్యా భూక్యా వ్యాసం: 'ఆదివాసుల మతం ఏమిటి?' జూలై 24, 2025).

ఆదివాసీలు ఎప్పుడూ హిందూ ధర్మానికి వెలుపల లేరు. వేదకాలం నుంచి మధ్యయుగం వరకు వారు హిందూ సామాజిక నిర్మాణంలో అంతర్భాగంగానే ఉన్నారు. వారి ఆచార వ్యవహారాలు, దేవతలు, పండుగలు హిందూ ధర్మంతోనే ముడిపడి ఉన్నాయి. ఆదివాసీ జీవన విధానంలో ప్రకృతి ఆరాధన ప్రధానమైంది. హిందూ ధార్మికతలో పంచభూత ఆరాధన దీన్నే సూచిస్తుంది. నేటికి అనేక ఆదివాసీ తెగలు హిందూ దేవతలను వారి పేర్లతో, రూపాలతోనే కొలుస్తారు. 'ఆదివాసీలకు ప్రత్యేక మతం' అనే భావన బ్రిటిష్ వలసవాదుల 'విభజించి పాలించు' విధానం నుంచి పుట్టింది. దీనికి ప్రధాన లక్ష్యం క్రైస్తవ మత మార్పిడులకు మార్గం సుగమం చేయడమే. ఈ విభజన వాదానికి ఆధునిక రూపం సాంస్కృతిక మార్క్సిజం. ఇది హిందూ మతాన్ని, భారతీయ సంస్కృతిని అణచివేతకు చిహ్నంగా చిత్రీకరించి, ఆదివాసీలను హిందూ సమాజం నుండి వేరు చేయడానికి ప్రయత్నిస్తుంది. విదేశీ నిధులు పొందే కొన్ని ప్రభుత్వేతర సంస్థలు కుట్రపూరితంగా విదేశీ ఎజెండాను మన దేశంలో అమలు చేస్తూ ప్రజల మధ్య చీలికలు సృష్టిస్తున్నాయి. సుప్రీంకోర్టు సైతం హిందూ మతం ఒక జీవన విధానమనీ, అది విభిన్న సంప్రదాయాలు, ఆచారాల కలయిక అని స్పష్టం చేసింది. ఆర్టికల్ 25 ప్రకారం సిక్కులు, బౌద్ధులు, జైనులు కూడా హిందూ మత పరిధిలోకి వస్తారు. కొంతమంది ఆదివాసీ మేధావులు స్వల్ప సంఖ్యలో తమను ప్రత్యేక మతంగా గుర్తించాలని అంటున్నప్పటికీ, ఇది మత మార్పిడుల ద్వారా ప్రభావితమైన ప్రాంతాల నుంచి వస్తున్నది.

పేర్లు, విధానాలు వేరైనా అనేక ఏళ్లుగా ఆదివాసీలు హిందూ పండుగల్లో భాగస్వాములే. దుర్గా పూజ, శివారాధన అనేక ఆదివాసీ తెగల ఆచారాల్లో అంతర్భాగంగానే ఉన్నాయి. ప్రకృతి ఆరాధన, పితృదేవతలను పూజించడం, నదులు, చెట్లను పవిత్రంగా భావించడం వంటివి హిందూ మతం, ఆదివాసీ సంప్రదాయాల్లో ఉమ్మడిగా కనిపిస్తాయి. నాగ ఆరాధన, భూమి పూజ, సూర్య నమస్కారాలు వంటి ఆచారాలు రెండు వర్గాలలోనూ ప్రచారంలో ఉన్నాయి. మహారాష్ట్రలోని వార్లీ, కోక్నా వంటి ఆదివాసీ తెగలు గణేష్ చతుర్థిని తమ సాంప్రదాయ నృత్యాలు, పాటలతో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని ఆదివాసీలు దసరా పండుగను విశేషంగా జరుపుకుంటారు. ముఖ్యంగా బస్తర్ దసరా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇది 15వ శతాబ్దం నుండే వస్తున్న సంప్రదాయం.

'ఆదివాసీలకు ప్రత్యేక మతం' అనే భావన బ్రిటిష్ వలసవాదుల 'విభజించి పాలించు' విధానం నుంచి పుట్టింది. దీని ప్రధాన లక్ష్యం క్రైస్తవ మత మార్పిడులకు మార్గం సుగమం చేయడమే. ఈ విభజన వాదానికి ఆధునిక రూపం సాంస్కృతిక మార్క్సిజం. ఇది హిందూ మతాన్ని, భారతీయ సంస్కృతిని అణచివేతకు చిహ్నంగా చిత్రీకరించి, ఆదివాసీలను హిందూ సమాజం నుండి వేరు చేయడానికి ప్రయత్నిస్తుంది.




రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలలో ఆదివాసీ పాత్రలు హిందూ మత విస్తృత పరిధిలో అంతర్భాగంగా ఉన్నాయి (ఉదాహరణకు – శబరి, నిషాద రాజు, గుహుడు, హిడం). ఈ గ్రంథాలు ఆదివాసీలను సమాజం నుండి వేరుచేయలేదు. మధ్యయుగంలో, అనేక ఆదివాసీ నాయకులు హిందూ రాజులతో సంబంధాలు ఏర్పరచుకోవడమే కాదు, రాజ్యాలను పరిపాలించారు. అనేక ఆదివాసీ రాజ్యాలు హిందూ ధర్మ సూత్రాలను అనుసరించాయి. పూర్వం వేద కాలంలో వేద సాహిత్యంలో అటవీ నివాసులైన 'అరణ్యాని' గురించి ప్రస్తావన ఉంది. క్రీ.పూ. 1500–500 నాటి ఈ సాహిత్యం ఆదివాసీల ఉనికిని, వారి ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని సూచిస్తుంది. మధ్యయుగంలో గోండు రాజులు, భిల్లు రాజులు హిందూ దేవాలయాలను నిర్మించారు, హిందూ సంప్రదాయాలను ప్రోత్సహించారు. ఉదాహరణకు, 17వ శతాబ్దంలో గోండు రాజు హృదయా షా నిర్మించిన దేవాలయాలు దీనికి నిదర్శనం.

బ్రిటిష్ వలస పాలన భారతదేశంలో ఆదివాసీల గుర్తింపుపై తీవ్ర ప్రభావం చూపింది. 'డివైడ్ అండ్ రూల్' (విభజించి పాలించు) పాలసీలో భాగంగాను, ఆదివాసీ ప్రాంతాలలో మిషనరీ కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మత మార్పిడి చేయడంలో భాగంగాను బ్రిటిష్ వారు ఆదివాసీలను హిందూ సమాజం నుంచి వేరు చేయడానికి ప్రయత్నించారు. 19వ శతాబ్దం చివరలో, 20వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన జనాభా గణనలలో ఆదివాసీలను 'అనిమిస్టులు' (ప్రకృతి ఆరాధకులు) లేదా 'ట్రైబల్ రిలీజియన్' (గిరిజన మతం) అనే ప్రత్యేక వర్గంగా గుర్తించడం ప్రారంభించారు. 1935లో భారత ప్రభుత్వ చట్టం ద్వారా ఆదివాసులను షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించడం, వారికి ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించడం కూడా ఈ విభజనకు మరింత ఆజ్యం పోసింది.

ఇక సాంస్కృతిక మార్క్సిజం అనేది కార్ల్ మార్క్స్ ఆర్థిక సిద్ధాంతాలకు భిన్నంగా, సమాజంలోని సంస్కృతి, మతం, కుటుంబం వంటి సామాజిక సంస్థలను విశ్లేషించడానికి, విమర్శించడానికి ఉపయోగించే ఒక సైద్ధాంతిక దృక్పథం. దీని ప్రకారం, సంస్కృతి అనేది అణచివేతకు ఒక సాధనం, ఆధిపత్య వర్గాలు తమ అధికారాన్ని నిలుపుకోవడానికి దీనిని ఉపయోగిస్తాయి. భారతీయ సందర్భంలో, సాంస్కృతిక మార్క్సిస్టు ఆలోచనలు హిందూ మతాన్ని, దాని సంప్రదాయాలను కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి, వివక్షకు మూలంగా చిత్రీకరించడానికి ప్రయత్నించాయి. ఆదివాసీలను హిందూ మతం నుంచి వేరు చేసే ప్రయత్నాలలో ఈ సాంస్కృతిక మార్క్సిస్టు దృక్పథం కూడా భాగమే. ఆదివాసీల ప్రత్యేకతను, వారి స్వయం ప్రతిపత్తిని గౌరవించడం అవసరం అయినప్పటికీ, వారిని హిందూ సమాజం నుండి పూర్తిగా వేరు చేసి, వారిని బలహీనవర్గాలుగా మార్చడం, తద్వారా మత మార్పిడులకు పాల్పడటం అనేది ఒక వ్యూహంగా మారింది.

అయితే, హిందూ సమాజంతో ఆదివాసుల ఏకీకరణను ప్రోత్సహించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి, జరుగుతున్నాయి. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) వంటి సంస్థలు ఆదివాసీలను హిందూ ధర్మంలో అంతర్భాగంగా భావిస్తూ, వారిని తిరిగి ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి కృషి చేశాయి. వనవాసీ కళ్యాణ్ ఆశ్రమం స్థాపన (1952) ఈ దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ఈ సంస్థ ఆదివాసీల సంక్షేమం, సంస్కృతి పరిరక్షణ పేరుతో వారిని హిందూ మతంలో ఏకీకృతం చేయడానికి కృషి చేసింది. హిందూ మతం అనేది ఒక నిర్దిష్ట సిద్ధాంతంగా కాకుండా, వివిధ ఆచారాలను సంప్రదాయాలను కలుపుకొనిపోయే విశాల దృక్పథాన్ని కలిగి ఉంది. ఆదివాసీల సంప్రదాయాలు ఈ విస్తృత హిందూ జీవన విధానంలో అంతర్భాగంగానే ఉన్నాయి. వారి ప్రత్యేక గుర్తింపును గౌరవిస్తూనే వారిని హిందూ సమాజంలో ఒక అంతర్భాగంగా చూడటం సమంజసం. చారిత్రక, సాంస్కృతిక, సామాజిక ఆధారాల ప్రకారం ఆదివాసీలు ముమ్మాటికి హిందువులే!

■ కాయం నవేంద్ర
జాతీయ కన్వీనర్, అఖిల భారతీయ వనవాసి





మంత్రి సురేఖ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు




న్యూ శాయంపేటలో ఇందిరమ్మ ఇల్లు పరిశీలిస్తున్న గౌతమ్

వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- అధికారులకు హౌసింగ్ ఎం.డి. వీపీ గౌతమ్ సూచన
- నగరంలో క్షేత్రస్థాయి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని రాష్ట్ర హౌసింగ్ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి గ్రేటర్ పరిధిలో నిర్మాణం జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 31వ డివిజన్ న్యూశాయంపేట, 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో ఓటీపీ జియో ట్యాగింగ్ ఆశాజనకంగా లేదని వేగం పెంచాలని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పేమెంట్స్ అకౌంట్లలో జమ అవుతున్నాయా ? లేదా ? అని న్యూ శాయంపేట లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ఇంకా కట్టడాలు మొదలు పెట్టనివారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఈఎంఈపై పోర్టల్‌లో ఇండ్లకు సంబంధించిన సమాచారాన్ని జియో కోఆర్డినేటర్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధార్థ నాయక్, కార్పొరేటర్ మామిండ్ల రాజు, డీసీలు రవీందర్, ప్రసన్నరాణి, డీఈ రవీందర్, తహసీల్దార్ బావ్‌సింగ్‌లు పాల్గొన్నారు.



- స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచన
- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి వివాదాస్పద వ్యాఖ్యల ఎపిసోడ్‌కు ముగింపు
- కీలక నేతల మధ్య గ్యాప్ పార్టీకి నష్టమని సర్దిచెప్పిన పార్టీ పెద్దలు
- నామినెటేడ్, పార్టీ పదవులను త్వరగా భర్తీ చేసేందుకు హామీ
- క్రమశిక్షణ సంఘం నిర్ణయంపై స్పందించని ఎమ్మెల్యేలు
- తన రక్తంలోనే కాంగ్రెస్ ఉందన్న కొండా మురళి
- ఉమ్మడి జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారిన కాంగ్రెస్ పాలిటిక్స్

ఐక్యత సాధ్యమేనా?

ఓరుగల్లు కాంగ్రెస్ నేతల్లో విభేదాలపై అధిష్ఠానం ఫోకస్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అధిష్ఠానం ప్రయత్నాలు మొదలు పెట్టింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలవాలంటే నేతల మధ్య గ్యాప్‌ను పూడ్చాలని కాంగ్రెస్ పెద్దలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య జరుగుతున్న వార్‌కు ముగింపు పలికారు. క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి నేతృత్వంలో కొండా మురళితో చర్చించి, పార్టీ లైన్‌లో పని చేస్తానని హామీ తీసుకున్నారు. అయితే ఈ నిర్ణయంపై ఎమ్మెల్యేలు ఎలాంటి కామెంట్స్ చేయకపోవటంతో కాంగ్రెస్‌లో విభేదాల తుఫాను వెనక్కి తగ్గినట్టేననే చర్చ జరుగుతోంది. పార్టీ పదవులతో పాటు నామినెటేడ్ పోస్టులపై త్వరగా నిర్ణయం తీసుకుని, వచ్చే లోకల్ బాడీ ఎన్నికలకు క్యాడర్‌ను సిద్ధం చేసేందుకు కాంగ్రెస్ పెద్దలు కొండా దంపతులకు, ఎమ్మెల్యేలకు సర్ది చెప్పినట్లుగా సమాచారం.

కొండా కామెంట్స్ కలకలం

ఓరుగల్లు రాజకీయాల్లో కొండా దంపతులకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖతో కొంతమంది ఎమ్మెల్యేలకు విభేదాలు ఏర్పడ్డాయి. ప్రధానంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో విభేదాలు రావటం.. అవి రచ్చకెక్కటం జరిగింది. ఈ క్రమంలోనే జూన్ 19న వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో జరిగిన రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కొండా మురళి... సొంత పార్టీ ఎమ్మెల్యేలైన కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డితో పాటు మరికొంత మందిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి.

జూన్ 20వ తేదీన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇంట్లో ఆయనతో పాటు కడియం, రేవూరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు కొండా మురళిపై విమర్శలు చేశారు. జూన్ 22న తేదీన ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌తో పాటు క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు. జూన్ 28న కొండా మురళి వరంగల్ నుంచి భారీ కాన్వాయితో వెళ్లి ఎమ్మెల్యేలపైన క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదులతో ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. జూలై 4వ తేదీన ఏఐసీసీ రాష్ట్ర వ్యహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్‌ను కొండా మురళి కలిసి 16పేజీల నివేదికను అందించారు. దీంతో కాంగ్రెస్‌లో ఉత్కంఠ చోటు చేసుకుంది.

అధిష్ఠానం బుజ్జగింపులు

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు అధిష్ఠానాన్ని కలవర పెట్టాయి. కీలకమైన నేతల మధ్య విభేదాలు పార్టీ పటిష్టతపై ప్రభావం చూపుతాయని నేతలు భావించారు. దీంతో కొండా దంపతులతో పాటు ఎమ్మెల్యేలను కూడా (మిగతా 7లో..)

మంత్రి సురేఖ ఇంటి ఎదుట ఉద్రిక్తత

మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల ఆందోళన

పథకాన్ని ప్రైవేట్ సంస్థకు అప్పగించొద్దని వినతి

వరంగల్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ ఇంటి ఎదుట సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. మధ్యాహ్న భోజనం పథకాన్ని 'అక్షయ పాత్ర' సంస్థకు ఇవ్వొద్దని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి ఇంటిని ముట్టడించారు. ఇంట్లోకి వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు కార్మికుల మధ్య తోపులాట జరిగింది. సీఐ మేకల రంజిత్ ఆధ్వర్యంలో కార్మికులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థకు అప్పగించడం ద్వారా 25సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ పథకం పిల్లల హక్కు అని, ప్రభుత్వమే దీనిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణలో కాకుండా ప్రైవేట్ సంస్థల ద్వారా నిర్వహిస్తే భోజనం నాణ్యత, పారదర్శకత విషయంలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అక్షయపాత్రకు అప్పగించే ఆలోచనను వెంటనే విరమించుకోకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాగా, సీఐటీ యూ నాయకులు, కార్మికులను అరెస్టు చేయడాన్ని హనుమకొండ జిల్లా కార్యదర్శి తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, నా యకులు వాణి, ప్రభాకర్, ఉపేందర్, కార్మికులు సరోజిని, జారతి దేవి, స్వర్ణలత, కవిత, పుష్పలీల, రమ, మల్లికాంబ, రజియా సుల్తానా, జకియాబేగం, ప్రమీల, మంజుల, శ్రావణి, అనసూర్య, ఉమాదేవి, వనజ, రీటా, సరిత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సొత్తును, నిందితులను చూపుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

చోర్ బ్రదర్స్

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న అన్నదమ్ముల ఆటకట్టు 6

- తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు
- 250 కిలోల కాపర్ వైర్ స్వాధీనం
- వచ్చిన సొత్తుతో జల్సాలు
- వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో 59 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు



రవికుమార్, అశోక్

అక్లాండ్‌లో ఒగ్గుడోలు మోత

- 16 నుంచి 18 వరకు ప్రదర్శన
- మాణిక్యాపురానికి చెందిన రవికుమార్, అశోక్ ఎంపిక

లింగాలఘణపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఇండియన్ ఎంబసీ ఆఫ్ న్యూజిలాండ్ సంయుక్త ఆధ్వర్యంలో న్యూజిలాండ్ దేశంలోని అక్లాండ్ వేదికగా నిర్వహించే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తెలంగాణకు చెందిన ఆరుగురు కళాకారులు ఎంపికయ్యారు. ఒగ్గుడోలు, డప్పు, పేరిణి కళారంగాలకు చెందిన కళాకారులను ఎంపిక చేయగా ఒగ్గు కళారంగం నుంచి లింగాలఘణపురం మండలం మాణిక్యాపురంనకు చెందిన ప్రఖ్యాత ఒగ్గు కళాకారుడు చౌదరపల్లి రవికుమార్‌తోపాటు మరికుక్కల అశోక్‌కు ఆహ్వానం అందింది. ఈనెల 16,17,18 తేదీల్లో అక్లాండ్ వేదికగాఇండియన్ కాన్సులేట్ జనరల్ ఎదుట నిర్వహించే ప్రదర్శనలో వీరు పాల్గొంటారు.

ఆయిల్‌పామ్‌తో సిరులపంట

- రాష్ట్రమంతటా పామాయిల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తాం
- మంత్రులు తుమ్మల, సీతక్క
- ఇంచర్లలో ఆయిల్‌పామ్ కర్మగారం ఏర్పాటుకు భూమి పూజ



పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

ములుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్‌తో సిరుల పంటను పండించొచ్చని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాయకష్టం చేసే అన్నదాతలందరూ అదృష్టవంతులేనన్నారు. ములుగు మండలం ఇంచర్లలో ఏర్పాటు చేయనున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతో కలిసి సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. అన్నదాతలు తమకున్న భూమిలో కొంత భాగాన్ని పామాయిల్ పంట సాగుచేసేందుకు వినియోగించాలని సూచించారు. పామాయిల్ మొక్క నాటిన మూడేళ్లలో రైతుల ఇళ్లలో సిరులు కురుపిస్తాయని అన్నారు. పామాయిల్ పంట చేతికి రాగానే కంపెనీ వారు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తారని, 15 రోజుల్లో అందుకు సంబంధించిన డబ్బులు అన్నదాతల ఖాతాల్లో జమచేస్తారని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులను బలోపేతం చేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పామాయిల్ ఫ్యాక్టరీలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు.

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ

ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా స్థిరపడొచ్చని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనరి సీతక్క అన్నారు. ఈ పంటతో నష్టం తక్కువ ఉండి లాభం ఎక్కువ ఉంటుందన్నారు. జిల్లాలో రైతులు గతంలో వరి, పత్తి సాగు చేయడానికి ఆసక్తి చూపేవారని, ప్రస్తుతం పామాయిల్ పంట సాగుచేయడానికి ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. పామాయిల్ సాగుచేయడంతో పచ్చదనంతోపాటు ప్రతి ఏడాది అధిక లాభాలు పొందొచ్చని, అన్నదాతలు ఆర్థికంగా స్థిరపడొచ్చని తెలిపారు రూ. 200కు లభించే ఆయిల్ పామ్ మొక్క కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 25కు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా, కలెక్టర్ దివాకర, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి..

- వారి సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి
- ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్
- నగరంలో పాదయాత్ర.. మార్మోగిన నినాదాలు



ర్యాలీగా వెళ్తున్న ఉద్యమకారులు

వడ్డెపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి రూ. 10 వేల కోట్లు కేటాయించాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్‌చేస్తూ సోమవారం హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు పెద్ద ఎత్తున మహా పాదయాత్రను నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి ఉద్యమకారులంతా పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమగీతాలతో, తెలంగాణ నినాదాలతో అంబేడ్కర్ కూడలి ప్రాంతం మార్మోగింది. మహా పాదయాత్రకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఉద్యమకారులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినప్పటికీ ఉద్యమకారుల ఊసెత్తకపోవడం విడ్డూరమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్, ఉమ్మడి వరంగల్ జిల్లా మీడియా ఇన్‌చార్జి కందగట్ల మోహన్, వరంగల్ పశ్చిమ నియోజక వర్గ కన్వీనర్ అనుముల రమేష్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కందికట్ల జయ, రాష్ట్ర మహిళా కో కన్వీనర్ రెడ్డి సంధ్యారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, శ్యామ్, చల్లా వెంకన్నతో పాటు ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వంగరలో 79 ఫీట్ల జాతీయ జెండా

ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి చొరవతో నిర్మాణం

భీమదేవరపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆయన ఓ పోలీస్ ఆఫీసర్.. దేశభక్తిని చాటేందుకు ఏదో చేయాలనే తపన.. ప్రస్తుతం కాజీపేట ఏసీపీగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి స్వాతంత్ర్యం వచ్చి 78సంవత్సరాలు పూర్తయి 79వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ ఆగస్టు 15న మాజీ ప్రధాని పీవీ గ్రామమైన వంగరలో 79ఫీట్ల ఎత్తులో జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2017లో ఆయన జమ్మికుంట సీఐగా పని చేసినప్పుడు పోలీస్ స్టేషన్ సమీపంలో రైల్వే చౌరస్తా వద్ద నిత్యం జాతీయ గీతాలాపన కార్యక్రమం ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జాతీయ గీతాలాపన ప్రతీరోజు ఉదయం 8గంటలకు కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం వంగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలలో 79ఫీట్ల ఎత్తులో జాతీయ పతాకం రెపరెపలాడించేందుకు తహతహలాడుతున్నారు. 79 ఫీట్ల ఎత్తులో 9ఫీట్ల పొడవు, 12ఫీట్ల వెడల్పులతో జాతీయ జెండాను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వంగరలో జరుగుతున్న 79ఫీట్ల జాతీయ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు.

యూరియా అందించాలని రైతుల ధర్నా



కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తొర్రూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో యూరియా అందించాలని కోరుతూ సోమవారం మానుకోట జిల్లా తొర్రూరులోని పీఏసీఎస్ సొసైటీ కేంద్రం వద్ద రైతులు, రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయశాఖ అధికారులు సీజన్ వారీగా మామూళ్లు తీసుకుంటూ రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలన్నారు. సొసైటీ కేంద్రాల్లో రైతులకు యూరియా అందించినా గుళికలు, ఇతర ఫర్టిలైజర్ కొనాలని నిబంధనలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయించినా పట్టించుకోవడం లేదన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించి యూరియా అందుబాటులోకి తీసుకురావాలని, లేనిచో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి వెంకట్ రెడ్డి, బహుజన సామాజిక కార్యకర్తలు సురేష్, బాలు, బాబు, సంతోష్, యాకన్న, వీరన్న తదితరులు ఉన్నారు.

నేడు కేయూలో అకాడమిక్ స్టాండింగ్ కమిటీ సమావేశం

కేయూ క్యాంపస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కేయూ సెనెట్ అకాడమిక్ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం కేయూలో జరుగనుంది. 2026 ఏడాదిలో కేయూ అకాడమిక్ సెనెట్ సమావేశంలో రెండోది. వర్సిటీ పరిధిలో అకాడమిక్ అంశాలపై సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో జరిగే సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ ఫార్మసీ, ఇంజనీరింగ్, సోషల్‌సైన్స్, ఆర్ట్స్ సైన్స్ లా, కామర్స్ విభాగాల డీన్లు, డీన్ అకాడమిక్ అడిట్, డీన్ సీడీసీలు పాల్గొంటారు.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :మద్యం మత్తులో స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన తూళ్ల ప్రభాకర్ జిల్లా కేంద్రానికి చెందిన సంపత్, శ్రీను ఇద్దరు స్నేహితులు. ఈ నెల 3న రాత్రి సమయంలో మద్యం విషయంలో గొడవ పడ్డారు. అనంతరం తూళ్ల ప్రభాకర్ ఇంటిముందు నిద్రిస్తుండగా కోపొద్రిక్తుడైన శ్రీను అదును చూసి కర్రతో ప్రభాకర్ తల పై కొట్టి చంపినట్లు చెప్పారు. అనంతరం శ్రీను పుష్‌పుల్ ట్రైన్ ఎక్కి ఖమ్మానికి వెళ్లి అక్కడే ఓ మిల్లులో ఏం తెలియనట్లుగా పనిచేసుకుంటున్నాడు. సోమవారం గోల్కొండ రైలు ద్వార మహబూబాబాద్‌కు చేరుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో పోలీసులు పట్టుకుని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న టౌన్ ఇన్‌చార్జి సీఐ సర్వయ్య, ఎస్సైలు ప్రశాంత్‌బాబు, శివ, అశోక్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు రుద్రయ్య, రమేష్ చంద్ర, గౌతమ్, నాగరాజులను జిల్లా ఎస్పీ అభినందించారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

వడ్డెపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆరెపల్లి ప్రాంతంలోని ప్రతిమ ఆస్పత్రిలో ఈనెల 12 నుంచి 14 వరకు క్యాన్సర్ మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ : 9849570399 లో సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో డాక్టర్ తిప్పని అవినాష్, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, రాజేందర్, తిరుమల్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు వారంలోగా పరిష్కరించాలి

బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

91 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్, అధికారులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు వారం లోగా పరిష్కార మార్గం చూపాలని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కారనిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. శానిటేషన్ సమస్యలు 24 గంటల్లోగా పూర్తి చేయాలన్నారు. పలు కాలనీలలో చెత్త కుండీల నుంచి చెత్త తరలించడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, మరోమారు ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగానికి సంబంధించి ఈ వారం అందిన ఫిర్యాదులు వచ్చే వారం వరకు పెండింగ్‌లో ఉండ కుండా చూడాలన్నారు. ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం ఉండడం వల్ల వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయన్నారు. ఖాళీ ప్లాట్ల యజమానులను గుర్తించి ముందస్తుగా సమాచారం ఇవ్వాలని స్పందించని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ నెల 21 వరకు గ్రేటర్ పరిధిలోని పలు కాలనీల్లో బోనాల పండగ జరుగుతున్న నేపథ్యంలో ప్రతీ ఆలయం వద్ద ఎలక్ట్రిక్ సౌకర్యంతో పాటు డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా ఆలయాల పరిసర ప్రాంతాల్లో చెత్త సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. కాగా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 91 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, సీహెచ్‌వో రమేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణితో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ - 23, హెల్త్, శానిటేషన్ - 11, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 9, టౌన్‌ప్లానింగ్ - 44, ఎలక్ట్రికల్ - 2, హార్టికల్చర్ - 2 ఇలా మొత్తం 91 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

- హనుమకొండ 49వ డివిజన్ నాగేంద్ర నగర్‌లో చాలా కాలంగా కాలువల్లో ఉన్న చెత్తను తొలగించక పోవడం వల్ల అక్కడి ప్రజల చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారానికి ఒక్క సారి కూడా కాలువలు, రోడ్లు శుభ్రం చేయడం లేదని స్థానిక బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్, వెంకన్న, సంజీవ, చింటూ ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీ, లేబర్‌కాలనీ, శాలినినగర్, ప్రతాప్‌నగర్‌లతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న కాలనీలలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. పలు కాలనీలలో రోడ్లపై చెత్త, చెదారం తరలించకపోవడం వల్ల సీజన్ వ్యాధులు ప్రభలుతున్నాయని కార్పొరేటర్ వస్కుల బాబు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 66వ డివిజన్ హసన్‌పర్తి పెద్దమ్మ గౌరయ్య ఇంటి నుంచి బిట్ల ఐలయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు లేక పోవడం వల్ల వర్షాకాలంలో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నామని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.
- గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ పోలీసు కాలనీ ఏర్పడి సుమారు 30 సంవత్సరాలు అవుతుంది. గతంలో కేయూ నుంచి వచ్చే మురికి నీరుతో పాటు తమ ఇండ్ల నుంచి వెలువడే నీరు డ్రైనేజీ గుండా సాఫీగా వెళ్లిపోయేది. కానీ ఇటీవల ఓ వ్యక్తి డ్రైనేజీకి అడ్డుగా అక్రమ కట్టడాలు నిర్మించడంతో కేయూతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వెలువడే మురికి నీరు తమ ఇండ్ల మధ్యలో నిలిచి ఉంటుందని కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

సమగ్ర పీహెచ్‌డీ సిద్ధాంతంతో ఉజ్వల భవిష్యత్

కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం

ముగిసిన లా స్కాలర్ల ఓరియంటేషన్ ప్రోగ్రాం



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్రమైన పీహెచ్‌డీ సిద్ధాంతంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం అన్నారు. యూనివర్సిటీ న్యాయ కళాశాల 2024 బ్యాచ్ పీహెచ్‌డీ స్కాలర్ల కోర్సు వర్క్ ఓరియంటేషన్ తరగతులు ముగిశాయి. కేయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆగస్టు 4 నుంచి 11 వరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విషయ పరిజ్ఞానం కల్గిన ప్రొఫెసర్లు విలువైన అంశాలను బోధించారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ జి.రామేశ్వరం మాట్లాడుతూ.. అంకితభావంతో పరిశోధన చేయాలని సూచించారు. లా కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ మాట్లాడుతూ.. పీహెచ్‌డీ స్కాలర్లకు 30 ఏళ్ల పైబడిన అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు మెళకువలు బోధించారని చెప్పారు. కేయూ లా రిటైర్డు డీన్ బి.విజయలక్ష్మి, టి. విజయచంద్ర వారం రోజుల పాటు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ తరగతులను బోధించారని చెప్పారు. రిసెర్చ్ మెథడాలజీకి సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘమైన ఉపన్యాసాలు స్కాలర్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులను స్కాలర్లు సన్మానించారు. సమావేశంలో ఏఆర్ డాక్టర్ కోలశంకర్, అధ్యాపకులు డాక్టర్ హరిప్రసాద్, టీసీ సుజాత, జి.వేదశ్రీ, డాక్టర్ లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్‌పాయింట్ ప్రజంటేషన్

సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన వర్సిటీలో నేషనల్ ఇనిస్టిట్యూషన్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)పై సోమవారం జరిగిన కార్యశాలకు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నేతృత్వంలో జరిగిన కార్యశాలలో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ప్రమాణాలు, విశ్లేషణ విధానాలతో పాటు ఇతర అంశాలపై సమగ్రంగా చర్చించారు. వర్సిటీల్లో ఉన్న స్థితిని మెరుగుపరిచేందుకు కీలక అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో వీసీ మాట్లాడారు. వర్సిటీ పనితీరు, ఖ్యాతి, స్వయం ప్రతిపత్తి ప్రాధాన్యంపై కీలక అంశాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి. బాలకృష్ణారెడ్డి కార్యశాలకు దిశానిర్దేశం చేశారు. కార్యశాల ప్రారంభానికి ముందు ప్రతాప్‌రెడ్డికి కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ వీసీ డి.రాజిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఐక్యూఏసీ డైరెక్టర్ షమిత, డాక్టర్ ఫణీంద్రకుమార్, రాము బన్నుర్కర్ పాల్గొన్నారు.

వరంగల్‌లో ఇ-కామర్స్‌లో శిక్షణ విస్తరించాలి

లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కావ్య విజ్ఞప్తి

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువతకు ఇ-కామర్స్ ఆన్‌లైన్ వ్యాపారంలో శిక్షణను మరింత విస్తరించాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ విషయమైన సోమవారం ఆమె లోక్‌సభలో ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో ఈ-కామర్స్ శిక్షణ మరింత విస్తరింప చేయాలని ఎంపీ కావ్య కోరారు. దీంతో యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామీణ, గిరిజన యువతకు స్థిరమైన ఆదాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇస్తూ 2022-23లో వరంగల్‌లో 170 మంది యువతకు ఆన్‌లైన్ వ్యాపారం, డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణలో 2025 జులై వరకు 23 వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా 1461 మందికి శిక్షణ ఇచ్చి గిరిజన కుటుంబాలల్లో ఆదాయం పెంచామన్నారు. 2025-26లో 30 మందికి సౌర విద్యుత్ వ్యాపారంపై శిక్ష ఇచ్చామన్నారు. మార్కెట్ యాక్సెస్ కోసం 2024 ఆగస్టు 13న ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. అలాగే 2023 సెప్టెంబర్ 4న మెటా సంస్థలో ఒప్పందం కుదుర్చుకుని డిజిటల్ మార్కెటింగ్ శిక్షణను బలోపేతం చేశామని తెలిపారు.

చోర్ బ్రదర్స్

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలకు పాల్పడుతున్న అన్నదమ్ముల ఆటకట్టు

- తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు
- 250 కిలోల కాపర్ వైర్ స్వాధీనం

భీమదేవరపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ స్వయాన సోదరులు.. ట్రాన్స్‌ఫార్మర్ చోరీలలో సిద్ధహస్తులు.. రాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసి అందులో ఉన్న కాపర్, అల్యూమినియం వైర్‌ను అమ్మడం, ఆ సొమ్ముతో వచ్చిన డబ్బుతో జల్సాలు చేయడం అలవాటుగా మారింది. వరంగల్, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్నారు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబుతో పాటు సిబ్బంది చాకచాక్యంగా పట్టుకున్నారు. ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి సీఐ పులి రమేష్, ఎస్ఐలు సాయిబాబు, ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు.

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన బండి కుమార్, సతీష్‌లు సొంత అనదమ్ములు. 2019నుంచి సతీష్ కుమార్‌లు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తూ ఒకసారి పట్టుబడ్డారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని బండి కుమార్‌ను జైలుకు పంపించారు. ఆ తర్వాత మళ్లీ 2023నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం చేస్తూ అందులో ఉన్న కాపర్, అల్యూమినియం వైర్లను అమ్మి వాటితో వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. కరీంనగర్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు వాహనంలో వెళ్తుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనుమానస్పదంగా కనిపించారు. దీంతో ఎస్ఐ వారిని తనిఖీ చేయగా వారి వద్ద పానాలు, స్క్రూల్‌డ్రైవర్లు, చేతి గ్లౌజులు, ఇనుపరాడ్లు కనిపించాయి. వీరిద్దని విచారించగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. తాము చోరీ చేసిన కాపర్, అల్యూమినియం వైర్‌ను ముల్కనూర్‌కు చెందిన రుద్రక్ష తిరుపతికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో కుమార్, సతీష్‌లతో పాటు తిరుపతిని అరెస్టు చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 2.50లక్షల విలువ చేసే 250 కిలోల కాపర్ వైరు, మూడు కరెంటు మోటార్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ నిందితుల ను అరెస్టు చేయడంలో ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబుతో పాటు కానిస్టేబుళ్లు మోహన్‌బాబు, రమేష్, కలీం, సదానందం, నాగేశ్వర్‌రావులను అభినందించారు.

'డబుల్ బెడ్‌రూం' కేటాయించలేదని..

మనస్తాపంతో చిరు వ్యాపారి మృతి



సమ్మక్క (ఫైల్)

కృష్ణకాలనీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరైనా అధికారులు కేటాయించడం లేదనే మనస్తాపంతో ఓ మహిళ అనారోగ్యం బారిన పడి మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. మృతురాలి కుమారుడు అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి పట్టణ పరిధిలోని జవహర్‌నగర్‌కాలనీకి చెందిన తాటికొండ సమ్మక్క (52) ప్రధాన రహదారి వెంట పండ్లు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆమెకు గత ప్రభుత్వం భాస్కరగడ్డ ఏరియాలో డబుల బెడ్‌రూం ఇల్లు మంజూరు చేసింది. ప్రభుత్వం మారిపోవడంతో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో అనేకమార్లు డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం అధికారుల చుట్టూ తిరిగింది. ధర్నాలు, రాస్తారోకోల్లో పాల్గొంది. తనకు మంజూరైన ఇల్లు చేజారిందనే మనస్తాపంతో సమ్మక్క అనారోగ్య బారిన పడిందని, బీపీ, షుగర్ అధికమై ఆస్పత్రిలో చేరిందని ఆమె కుమారుడు తెలిపాడు. వైద్యం అందిస్తున్న క్రమంలోనే తన తల్లి మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమ్మక్కకు సొంత ఇల్లు లేక పోవడంతో గణపురం మండలంలోని పరశురాంపల్లి గ్రామంలో నివాసముంటున్న ఆమె కుమార్తె ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించార. బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నేతలు ఆమె మృతదేహన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కేయూలో ఎన్నికల సందడి

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నామినేషన్లు

కేయూ క్యాంపస్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కేయూలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్నికల సందడి నెలకొంది. సోమవారం కేయూ పరీక్షల విభాగంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్నికలకు ఉద్యోగులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఇతర కీలక పదవులకు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈనెల 22న నిర్వహిస్తారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కట్ల రాజేందర్ వ్యవరిస్తారు. అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, కోశాధికారితో పాటు మరో 8 మంది కార్యవర్గ సభ్యులను ప్రతినిధులుగా ఎన్నిక కానున్నారు. నేటి(మంగళవారం)తో నామినేషన్ల స్వీకరణ ముగుస్తుంది. 13న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు. పోటీలో ఉన్న అభ్యర్థులకు 22న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు, సాయంత్రం 6 గంటలకు ఫలితాలను వెల్లడిసా రు.

తొలిరోజు నామినేషన్లు దాఖలు

అధ్యక్ష పదవికి కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ, జనరల్ సెక్రటరీకి డాక్టర్ పుల్లా శ్రీనివాస్, 2 ఉపాధ్య పదవులకు నమిండ్ల కిరణ్‌కుమార్, పులిశేరు భాస్కర్, ట్రెజరర్ దామెర ఆనందం, ఆర్గనైజన్ సెక్రటరీ భూక్యా రాజు, రీక్రియేషన్ సెక్రటరీ నరేశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సేవియా, వెంకటనర్సయ్య, డాక్టర్ శ్రీకాంత్ నామినేషన్లు దాఖలు చేశారు.

విష జ్వరంతో బాలిక మృతి



మెహరిన్ (ఫైల్)

నెక్కొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ మెహరిన్ (5) విష జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు సోమవారం తెలిపారు. వ్యవసాయ కూలీ కాశీం-మైబుబీ దంపతుల ఏకైక కుమార్తె మెహరిన్ ఈ నెల 7 న తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా, చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లామన్నారు. పాప ఆరోగ్య పరిస్థితి బాగలేదంటూ వరంగల్ తీసుకెళ్లాలని వైద్యులు తెలుపడంతో, వారి సూచన మేరకు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించామన్నారు. ఆస్పత్రిలో పాప చికిత్స పొందుతూ 11వ తేదిన మృతి చెందినట్లు చెప్పారు.

కేఎంసీలో కొండచిలువ



వరంగల్ మెడికల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో కొండచిలువ సంచరిస్తోంది. సోమవారం సాయంత్రం వేళ కేఎంసీ అంతర్గత రహదారిపై కొండచిలువ సంచారాన్ని విద్యార్థులు గమనించారు. వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు సెక్యూరిటీకి సమాచారం అందించారు. కొండచిలువ సంచారంపై వైద్య విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేఎంసీ ఆవరణలో విషపూరితమైన సర్పాలు కూడా సంచరిస్తున్నట్లు గతంలో విద్యార్థులు తెలిపారు. సర్పాల బారి నుంచి వైద్య విద్యార్థులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళ మెడలో నుంచి..

పుస్తెలతాడు అపహరణ

వెంబడించిన పోలీసులు.. పట్టించిన గ్రామస్థులు

తొర్రూరు రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలం వద్ద ఉన్న మహిళ మెడలో నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మూడు తులాల పుస్తెల తాడు అపహరించుకుపోయిన సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మాటేడు గ్రామంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితురాలు కథనం ప్రకారం.. మాటేడు గ్రామానికి చెందిన ముత్యం ప్రేమలీల ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి వెంట ఉన్న పత్తిచేనులోకి కోతులు వస్తుండగా రోడ్డుపై నిలబడి ఉంది. వెనుక నుంచి వచ్చిన ఇద్దరు దొంగలు ఆమె మెడలో నుంచి సుమారు మూడు తులాల బంగారు పుస్తెల తాడు అపహరించుకుపోయారు. వెంటనే స్థానికులకు, పోలీసులకు ఆమె సమాచారం అందించారు. గ్రామస్థులను గమనించిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై దంతాలపల్లి నుంచి సూర్యాపేట వైపు వెళ్తుండగా దంతాలపల్లి, తొర్రూరు పోలీసులు అప్రమత్తమై మద్దిరాల పోలీసు స్టేషన్‌కు గ్రామస్థులు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు, గ్రామస్థులు వెంబడించడంతో మద్దిరాల సమీపంలో బైక్‌ను వదిలేసి పొలాల నుంచి పరిగెడుతుండగా పోలుమల్ల గ్రామస్థులు, రైతులు చుట్టుముట్టి పట్టుకొని తొర్రూరు పోలీసులకు అప్పగించారు. గంట వ్యవధిలోనే దొంగలను పట్టుకున్న పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు. ఈ విషయంపై ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుబడిన ఇద్దరు దొంగలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి రైలు ద్వారా వచ్చి ఖమ్మంలో ఓ బైక్‌ను దొంగతనం చేసి ఆ బైక్ పై వచ్చినట్లు సమాచారం.

కాటారం ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవం



ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం జరిగింది. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును పాలకవర్గం గజమాలతో సన్మానించిన అనంతరం ఓపెన్‌టాప్ జీపులో కల్యాణ మండపం వరకు ర్యాలీగా వెళ్లారు. మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ, అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, ప్రజా ప్రతినిధుల సమక్షంలో చైర్‌పర్సన్‌గా పంతకాని తిర్మలసమ్మయ్య, వైస్ చైర్మన్‌గా చినాల బ్రహ్మారెడ్డి, డైరెక్టర్లుగా రామగుండం శ్రీనివాస్, మహేష్ తిరుపతి రావు, పిల్లమారి రమేష్, ఎం.డి.ఇర్షాద్, ముల్కల్ల శ్రీనివాస్‌రెడ్డి, గోమాస నడువలి, పోత రామకృష్ణ, దాసరి సంతోష్, జాటోత్ రాజరాంనాయక్, పాగె రాజయ్య, ట్రేడర్స్ నుంచి నడిపెల్లి భారతి, ముక్క శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, ఏడీఏ శ్రీపాల్‌లచే డీఎంవో కనకశేఖర్, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్ ప్రమాణస్వీకారం చేశారు.

ఎస్పీఎం ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయలేం

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

చర్చలకు ఆహ్వానించిన ఎన్పీడీసీఎల్ యాజమాన్యం

రాంనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీఎం షెడ్లలో ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు చేయడం తమ వల్ల కాదని, పనులు బంద్ చేస్తామని ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి కాంట్రాక్టర్లు ఈ నెల 1న నోటీసులు ఇచ్చింది. దీంతో యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుసుకున్న కాంట్రాక్టర్లు సోమవారం సమావేశమయ్యారు. పనులు బంద్ చేసేందుకు రంగంలో దిగుతున్న సమయంలో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం చర్చలకు ఆహ్వానించినట్లుగా తెలుస్తోంది. కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారం కోసం కంపెనీ డైరెక్టర్, సీఈలతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నేడు (మంగళవారం) విద్యుత్‌భవన్‌లో కాంట్రాక్టర్లతో సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఆపరేషన్-1 సీజీఎంను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఎంఎస్ ఓబీజీ ఫలితాల్లో డాక్టర్ భావన ప్రతిభ



నర్సంపేట టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇటీవల వెలువడిన ఎంఎస్ ఓబీజీ ఫలితాల్లో నర్సంపేటకు చెందిన వైద్య విద్యార్థి డాక్టర్ పొనుగోటి భావన ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. వివరాలిలావున్నాయి. నర్సంపేట పట్టణానికి చెందిన వైద్యులు పొనుగోటి గోపాల్, భారతిల కూతురు భావన హైదరాబాద్‌లోని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్‌సెంటర్ నాగోల్‌లో ఎంఎస్ ఓబీజీ వైద్య విద్యనభ్యసిస్తున్నది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో భావన కామినేని మెడికల్ కళాశాలలో ఓవరాల్‌గా ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభను చాటుకుంది. ప్రతిభను చాటిన భావనను కామినేని వైద్య కళాశాల యాజమాన్యం, నర్సంపేట పట్టణానికి చెందిన వైద్యులు అభినందించారు.

నిట్‌లో పీజీ విద్యార్థులకు ఓరియంటేషన్

పాల్గొన్న 720 మంది విద్యార్థులు

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్ఐటీ మొదటి సంవత్సరం పీజీ విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం వివిధ ఎంటెక్, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరిన 720 మంది విద్యార్థుల విద్యా ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి విద్యార్థులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. వారు ఇక్కడ గడిపిన కాలం స్ఫూర్తిదాయకంగా, ఫల ప్రదంగా ఉండాలని ఆకాంక్షించారు. వారు కృషి చేసి తమకు, ఎన్ఐటీకి మంచిపేరు తేవాలన్నారు. అకడమిక్స్ డీన్ ప్రొఫెసర్ వెంకటయ్య చౌదరి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె కిరణ్ కుమార్, పీసీ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ భార్గవి, అడ్మిషన్స్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ రాంరెడ్డి, ఇతర డీన్స్, విభాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐక్యత సాధ్యమేనా..?

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ వివాదస్పద వ్యాఖ్యలు చేయవద్దని హుకుం జారీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నేతల మధ్య విభేదాలపై దృష్టి సారించి, ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడినట్లుగా సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాల్సిన సమయంలో కీలక నేతల మధ్య విభేదాలు క్యాడర్ మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయని, కలిసి పనిచేసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో సత్తా చాటాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సైతం అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు, కొండా దంపతుల మధ్య విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరారు.

కీలక నేతలు రంగప్రవేశం చేయటంతో పాటు జూలై 10వ తేదీన క్రమశిక్షణ సంఘం చైర్మన్ పలువురు ఎమ్మెల్యేలు కలిసి చర్చించారు. పార్టీ బలోపేతం దృష్టి కలిసి పని చేయాలని మల్లు రవితో పాటు పలువురు సీనియర్ నేతలు బుజ్జగింపులకు దిగారు. ఈ క్రమంలో ఆదివారం కొండా మురళీధర్‌రావుతో క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవి చర్చించి.. పార్టీ లైన్‌లోనే నేతలందరు పని చేయాలని సూచించారు. దీనికి కొండా మురళీ అంగీకరించటంతో పాటు తమ రక్తంలోనే కాంగ్రెస్ ఉందని, రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తమ లక్ష్యమని ప్రకటించారు. అయితే ఈ విషయమై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ స్పందించలేదు. దీంతో వరంగల్ నేతల మధ్య విభేదాలకు ఫుల్‌స్టాప్ పడిందని అధిష్ఠానం భావిస్తోంది.

చేతులు కలిసేనా..?

ఓరుగల్లు నేతల మధ్య ఐక్యతరాగం కోసం అధిష్ఠానం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. వరంగల్‌కు టెక్స్‌టైల్ పార్కు, ఐటీ సెక్టార్, ఎయిర్ పోర్టు, భూగర్భ డ్రైనేజీ తదితర వాటితో వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తుంటే, నేతల మధ్య గ్యాప్ క్యాడర్‌లో అయోమయానికి గురి చేస్తున్నదని అధిష్ఠానం భావిస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరు జడ్పీ చైర్మన్ స్థానాలతో పాటు మెజార్టీ ఎంపీపీ, జడ్పీటీసీలను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎక్కువ సంఖ్యలో సర్పంచ్‌లను గెలిపించుకోవాలని అధిష్ఠానం వ్యూహరచన చేస్తోంది. ఈక్రమంలో నేతల మధ్య విభేదాలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేసింది.

అంతేకాకుండా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గానికి ఉప ఎన్నిక వచ్చే అవకాశాలు ఉండటంతో నేతల మధ్య వైరం పార్టీకి చేటనే ఆలోచనలో అధిష్ఠానం ఉంది. అయితే ఇప్పటికే మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావులతో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నాలను అధిష్ఠానం చేయాల్సి ఉందని కార్యకర్తలు అభిప్రాయ పడుతున్నారు. అలాగే నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో మొదటి నుంచి కొండా దంపతులకు రాజకీయ విభేదాలు ఉన్నాయి. అలాగే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కూడా విభేదాలు కొనసాగుతున్నాయి.

అలాగే నామినేటెడ్ పదవుల విషయంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య వైరం కొనసాగుతోంది. అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా గుర్తింపు పొందిన ఎనుమాముల మార్కెట్ పాలక మండలిని గత జనవరి నెలలో ప్రకటించారు. కానీ, నేతల మధ్య విభేదాలతో ఇప్పటి వరకు ప్రమాణస్వీకారం కూడా చేయకుండానే రద్దు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. వీటిలో చాలావరకు పాలక మండలిలు లేవు. వ్యవసాయ మార్కెట్‌లకు కూడా ఇదే పరిస్థితి. జిల్లా స్థాయి నామినేటెడ్ భర్తీతో పాటు రాష్ట్ర స్థాయిలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులు దక్కుతాయనే ఆశతో అనేకమంది ద్వితీయ శ్రేణి నేతలు నిరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో అధిష్ఠానం తీసుకుంటున్న చర్యలు ఏ మేరకు ప్రభావం చూపుతాయనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలతో పాటు పార్టీ సీనియర్‌లతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేయకుండా ఐక్యతరాగం ఎలా వినిపిస్తారనే చర్చ జరుగుతోంది.



విముక్తి కష్టమేనా!?

కొత్త జీవోతో క్షమాభిక్షకు ఖైదీలు దూరం

గతం, వర్తమానం

గతంలో సాధారణ జీవిత ఖైదీలకు ఏడేళ్ల శిక్ష మూడేళ్ల రెమిషన్‌లో కలుపుకొని పదేళ్లు, 498(ఏ) డెకాయిటీ, దొంగతనాలు వంటి నేరాలకు 14 ఏళ్ల శిక్ష 6 ఏళ్ల రెమిషన్ కలుపుకొని 20 ఏళ్లు, మహిళలకు 3 ఏళ్ల శిక్ష 2 ఏళ్ల రెమిషన్ కలుపుకొని 5 ఏళ్లు, అలాగే 65 ఏళ్లు దాటిన వాళ్లకు 5 ఏళ్ల శిక్ష 2 ఏళ్ల రెమిషన్‌తో ఏడేళ్ల శిక్ష పూర్తి చేస్తే క్షమా భిక్షకు అర్హత ఉండేది. కానీ ప్రస్తుతం అన్ని జెండర్లకూ ఒకేలా నిబంధనలు ఉన్నాయి. మరణశిక్ష పడినవారికి 14 ఏళ్ల జైలు, 6 ఏళ్ల రెమిషన్ మొత్తంగా 20 ఏళ్ల అనుభవించి ఉండాలి. ఆరేళ్ల రెమిషన్ నమోదు కావాలంటే కనీసం 16 ఏళ్ల పాటు సత్ప్రవర్తనతో జైలు జీవితం గడపాలి. జీవిత ఖైదీలకు 7 ఏడేళ్ల జైలు శిక్ష, 3 ఏళ్ల రెమిషన్ కలుపుకొని 10 సంవత్సరాలు, ఎన్‌డీపీఎస్, ఎస్సీ ఎస్టీ కేసుల్లో, ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం చట్టం 2002 ప్రకారం ఐపీసీ 363ఏ, 364, 364ఏ, 366, 366బీ, 367, 368, 369, 372, 373 ప్రకారం శిక్షపడినవారు క్షమాభిక్షకు అర్హులు కాదు.

- ఆందోళనలో 700 మంది ఖైదీల కుటుంబ సభ్యులు
- క్షమాభిక్షకు కనీస శిక్షకాలం ఏడేళ్లకు బదులు పదేళ్లకు పెంపు
- పాతజీవోనే పరిగణనలోకి తీసుకోవాలంటున్న కుటుంబ సభ్యులు

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నెం. 33 ఏడేళ్ల శిక్షా కాలం పూర్తి చేసుకొని, సత్ప్ర వర్తన కలిగి క్షమాభిక్ష కోసం ఎదురుచూస్తున్న ఖైదీల పరిస్థితిని అగమ్యగోచరంలోకి నెట్టింది. ఖైదీల శిక్షా కాలాన్ని ఏడేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతూ తెచ్చిన ఈ జీవోతో ఖైదీలు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఇంతకు ముందు జీవో ప్రకారం ఏడేళ్ల శిక్షా కాలం పూర్తయి 3 ఏళ్ల రెమిషన్‌తో క్షమాబిక్షపై బయటకు వచ్చే అవకాశం ఇప్పుడు దీని వల్ల లేకుండా పోయింది. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జైళ్లలో విడుదలకు ఎదురు చుస్తున్న సుమారు 700 మంది ఖైదీల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. గత సంవ్సరం జులైలో జారీ అయిన ఈ జీవోను ఉపసంహరించుకొని పూర్వపు జీవో ప్రకారమే సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాబిక్ష ప్రసాదించి విముక్తి కలిగించాలని అభ్యర్థిస్తున్నారు. ఖైదీల కుటుంబ సభ్యులు ఈ మేరకు ఇటీవల ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు.

సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించి వాస్తవంగా ఏడాదికి మూడు సార్లు క్షమాబిక్ష జీవోలను విడుదల చేయాలి. మొదటి విడత జూన్ 1న, రెండో విడత అక్టోబరు 1న మూడవ విడత ఫిబ్రవరి 1న కటాఫ్ తేదీలుగా పరిగణిస్తారు. క్షమాభిక్షకు అర్హులైన ఖైదీలను గుర్తించే ప్రక్రియను నాలుగు విడతల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. మొదటి విడతలో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోగా, రెండవ విడతలో మే 1నుంచి 15లోగా, మూడవ విడత సెప్టెంబరు 1 నుంచి 15 తేదీలోగా గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవాలి. జైలు అధికారులు ప్రిజన్ డైరెక్టర్ జనరల్‌కు సిఫార్సు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వం నిర్ణయం వెలువడాలి. మొదటి విడతకు అక్టోబర్ 1న, రెండవ విడతకు ఫిబ్రవరి 1న మూడవ విడతకు జూన్ 1లోగా ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది. కానీ ఈ మార్గదర్శకాలు ఆచరణకు నోచుకోవడం లేదు. వరుసగా మూడు, నాలుగు సంవత్సరాల వరకు ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించని ఉదంతాలు కూడా ఉన్నాయి.

గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఖైదీలను విడుదల చేసేవి. దీంతో ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా నిబంధనలు ఉండేవి. వీటిపై సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు దేశం మొత్తానికి ఒకే విధమైన మర్గదర్శకాలు విడుదల చేసింది. వీటి ప్రకారం ఆయా రాష్ట్రాలు జీవోలు ఇవ్వాలి. జీవోలు 580 (1984), జీవో నెం. 04 (1995), జీవో నెం 195 (1995), జీవో నెం 193 (1997), జీవో నెం. 18 (2000), ఈవో నెం 196 (2004), జీవో నెం. 415 (2009), జీవో నెం. 28 (2011), జీవో నెం 220 (2013) ప్రకారం ఏడేళ్ల వాస్తవ శిక్ష, మూడేళ్ల రెమిషన్ కలుపుకొని పదేళ్లుగా పరిగణిస్తూ ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించారు. కానీ గత సంవత్సరం జులైలో వాస్తవ శిక్షను పదేళ్లకు పెంచుతూ మూడేళ్ల రెమిషన్‌తో జీవో రావడానికి ఖైదీలు, వారి విడుదలకు కళ్లలో వత్తులేసుకొని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.



27 అడుగులకు పాకాల సరస్సు

వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సులో నీటి మట్టం భారీగా పెరిగింది. గత రబీ సీజన్ అనంతరం ఈ సరస్సులో 30 అడుగుల నీటి మట్టానికి గాను 17 అడుగుల నీటిమట్టం ఉండగా ఇటీవల కురిసిన వర్షాలతో పాటు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులోకి 10 ఫీట్ల నీటిమట్టం చేరుకుంది. మరో 3 ఫీట్లనీరు చేరుకుంటే సరస్సు మత్తడి పోయనుంది. పాకాల కింద వరినాట్ల కార్యక్రమాన్ని రైతులు ముమ్మరం చేశారు.

- ఆంధ్రజ్యోతి, నర్సంపేట

కొనుక్కున్న భూమినీ కొట్టేశారు..

- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులతో కబ్జాదారుల మిలాఖత్
- నిబంధనలను తుంగలో తొక్కిన అక్రమార్కులు
- అన్యాక్రాంతమైన భూమి విలువ కోట్లల్లో..
- న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితుడు
- సబ్‌రిజిస్ట్రార్ సహా కబ్జాదారులపై కేసు నమోదు
- తన భూమి తనకు ఇప్పించాలని బాధితుడి వేడుకోలు

కబ్జాకు గురైన వ్యవసాయ భూమి



హసన్‌పర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారుల ఆగడాలు రోజుకు రోజుకు మితిమీరి పోతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు పాగా వేస్తున్నారు. దీంతో సామాన్యులు న్యాయం కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగక తప్పడం లేదు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్ శివారులో ఓ వ్యక్తి 45 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన వ్యవసాయ భూమి.. అధికారులతో కబ్జాదారులతో మిలాఖతై హాంఫట్ అనిపించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు పాలుపంచుకున్నారని బాధితుడు వాపోతున్నాడు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు సైతం తదుపరి చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని, అలాగే వివాదంలో వున్న భూముల్లో ఇళ్ల నిర్మాణానికి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు అనుమతులు ఇస్తున్నారని ఆయన చెబుతున్నాడు. మొత్తంగా అధికారుల తీరు తమను రోడ్డు పాలు చేస్తోందని వారు ఆవేదన చెందుతున్నాడు.

హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన చింతల అనంతయ్య 'ఆంధ్రజ్యోతి'ని ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయంపై మొర పెట్టుకున్నాడు. తనకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించాడు. ఆయన తెలిపిన వివరాల్లోకి వెళ్లితే... చింతల అనంతయ్య... వంగపహాడ్ రెవెన్యూ శివారు ఔటర్ రింగురోడ్డు సమీపంలో తనకు వారసత్వం ద్వారా వచ్చిన భూమితో పాటు రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో సుమారు 18 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. 1977లో ఇదే గ్రామానికి చెందిన దామెర రాజకొమురయ్య వద్ద సర్వే నెం.639/బిలో గల 0-09 ఎకరాలు, 2004లో బొమ్మగాని ప్రమీల వద్ద సర్వే నెం.639/ఏలో సుమారు 0-09 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. కానీ, ఆయనకు పట్టాపాస్ పుస్తకాలు ఇప్పటి వరకు జారీ కాలేదు. రికార్డులలో ఇంకా అనుభవదారుగానే వస్తోంది. విలీన గ్రామాలకు సాదాబైనామా వర్తించకపోవడం వల్ల అనంతయ్య కొనుగోలు చేసిన వ్యవసాయ భూమికి పట్టా పాస్‌పుస్తకం జారీ కాలేదు. అనంతయ్య ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ అధికారులకు, కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికి ఫలితం లేకపోయింది. ఈ భూమిని గత 35 సంవత్సరాలుగా వంగపహాడ్‌కు చెందిన వెంకట్‌రెడ్డి కౌలుకు చేసుకుంటూ కౌలు చెల్లిస్తున్నాడు. అనంతయ్య వ్యవసాయ భూమి పట్టాదారు పేరు మీద రికార్డులో సోల్డ్ అవుట్ అని ఉండి, ఆ భూమి అనుభవకాలంలో వస్తోంది. ఇది గ్రహించిన కొందరు వ్యక్తులు పట్టాదారు వారసుడికి ఆశలు కల్పించారు. దీంతో అతడు అధికార పార్టీకి చెందిన కబ్జాదారులతో చేతులు కలిపాడు. హసన్‌పర్తి తహసీల్దార్ సహాయంతో వ్యవసాయ భూమికి నాలా అనుమతులు లేకుండా హౌస్ సైట్స్‌గా రెవెన్యూ రికార్డులో నమోదు చేయించుకున్నారు. అనంతరం వాటిని రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ భూమి విలువ ప్రస్తుతం కోట్లల్లో ఉంటుంది.

అప్పుడు హనుమకొండ సబ్ రిజిస్ట్రార్‌గా వున్న అమ్జద్ అలీ ఎలాంటి ఆధారాలు లేకుండానే తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితుడు అనంతయ్య ఆరోపించాడు. నిబంధనల ప్రకారం భూమికి నాలా కన్వర్షన్, లీగల్ హెయిర్, ఫ్యామిలీ మెంబర్ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా అవేమీ లేకుండానే సబ్ రిజిస్ట్రార్ కబ్జాదారులకు పలుమార్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. కోర్టు కేసులో ఉన్న వ్యవసాయ భూమిని అధికారులు కబ్జాదారులతో చేతులు కలిపి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని వాపోయాడు.

సబ్ రిజిస్ట్రార్‌తో పాటు కబ్జాదారులపై కేసు

వంగపహాడ్ రెవెన్యూ శివారులో భూ కబ్జాదారులతో కలిసి అప్పటి సబ్ రిజిస్ట్రార్ అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడినట్టు బాధితుడు అనంతయ్య హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఏసీపీ తిరుమల్, ఇన్‌స్పెక్టర్ సురేష్ విచారణ జరిపి గత ఏప్రిల్ 22న క్రైం నెం.178/2025 కింద సబ్ రిజిస్ట్రార్‌తో పాటు పలువురు కబ్జాదారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపాడు. అయితే నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయకుండా, చార్జిషీటు వేయకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపాడు. కాగా, గ్రేటర్ వరంగల్ మునిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పరిధిలోని తన భూమిలో అధికారులు నాలా కన్వర్షన్ లేకుండా నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని అనంతయ్య తెలిపాడు. ఈ కబ్జా వెనక రాజకీయ పలుకుబడి ఉండడం వల్లే ఆరు నెలల కాలంలోనే అక్రమ నిర్మాణం వెలిసిందని వెల్లడించాడు.

వారసత్వ భూమిని కూడా కబ్జా చేశారు..



నేను 1977లో కొనుగోలు చేసిన భూమితో పాటు తల్లి దండ్రుల వారసత్వంగా వచ్చిన భూమిని కూడా కబ్జాదారులు కబ్జా చేశారు. వ్యవసాయ భూములను తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే ఇండ్ల స్థలాలుగా రెవెన్యూ రికార్డులలో నమోదు చేశారు. దీంతో హనుమకొండ సబ్ రిజిస్ట్రార్ కబ్జాదారులకు రిజిస్ట్రేషన్ చేశారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కబ్జాకు బాధ్యులైన సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్‌తో పాటు భూ కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలి. భూ కబ్జాదారులతో ప్రాణ భయం ఉంది. వారి నుంచి పోలీసు రక్షణ కల్పించాలి.

- చింతల అనంతయ్య, బాధితుడు

40 సంవత్సరాలుగా కౌలు చేస్తున్నా..

అనంతయ్యకు చెందిన వ్యవసాయ భూమిని 40 సంవత్సరాలుగా కౌలుకు చేస్తున్నా. అప్పటి నుంచి ఏ సమస్యలేదు. ఈ మధ్యనే ఔటర్ రింగు రోడ్డు రావడంతో కబ్జాదారులు ఈ భూమిపై కన్నేసారు. భూముల ధర పెరగడంతోనే కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. అక్కడ కబ్జాదారులకు భూమి లేదు.

- కౌలు రైతు వెంకట్‌రెడ్డి

గిరిజన దర్బార్‌లో వినతులు



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఏపీవో వసంతరావు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్‌ను నిర్వహించారు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు వినతులు సమర్పించారు. ఐటీడీఏ ఏపీవో వసంతరావు వాటిని స్వీకరించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 15 మంది గిరిజనులు వినతులు అందించారు. ఏటూరునాగారం, మంగపేట, మహబూబాబాద్, కన్నాయిగూడెం, గోవిందరావుపేట, గూడూరు తదితర మండలాల నుంచి తరలివచ్చారు. ట్రైబల్ రిలీఫ్ ఫండ్, పాఠశాలల్లో సీట్లు, ఉద్యోగావకాశాలు, పోడుభూములకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు, సోలార్ పంపు సెట్ల మంజూరు, పొలాలకు విద్యుత్తు సౌకర్యం తదితర సమస్యలపై గిరిజనులు ఏపీవోకు వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజుకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలపై 175 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గటల వరకు జరిగిన ప్రజావాణిలో బాధితుల నుంచి రెవెన్యూ అధికారి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో హనుమకొండ, పరకాల ఆర్డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


బాధితుల సమస్య తెలుసుకుంటున్న రెవెన్యూ అధికారి వై.వి గణేష్



ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

వరంగల్ మెడికల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. సోమవారం లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ 19 సంవత్సరాలలోపు బాలబాలికలు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మందులు వేసుకోవాలన్నారు. నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 1636 సెంటర్లలో 2,35000 మంది పిల్లలకు మాత్రలు ఇస్తున్నట్లు తెలిపారు. నులి పురుగుల నివారణ మాత్ర తీసుకోవడమే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, డాక్టర్ మహేందర్, డాక్టర్ గీత, వి.అశోక్‌రెడ్డి, ఎంఈవో నెహ్రూ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇక్తదర్ అహ్మద్, డాక్టర్ మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవేంద్రస్వామి మఠంలో వైభవంగా మధ్యారాధన

భక్తుల ప్రత్యేక పూజలు

వడ్డేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డేపల్లి పరిమళ కాలనీ ప్రాంతంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యారాధన అత్యంత వైభవంగా నిర్వహించారు. మఠం విచారణ కర్త, డీవీఎం ప్రభాకర్‌రావు, మేనేజర్ బీఆర్‌వీ మాధవరావు పర్యవేక్షణలో రుత్వికులు స్వామివారికి అష్టోత్తరం, పాదపూజ, కనకాబిషేకం, ఫల పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ, అర్చన నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని జరిపించారు. భక్తుల భజన కీర్తనలతో శ్రీరాఘవేంద్రస్వామి మఠం మార్మోగింది. అనంతరం ఫలమంత్రాక్షత వితరణ గావించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ రిటైర్డ్ పీవో వి. చక్రాధర్‌రావు, ప్రతినిధులు కిరణ్‌కుమార్, అంబదాస్, బీవీ సంజీవరావు, సత్యమోహన్, ఎన్. రవీందర్‌రావుతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాఘవేంద్రస్వామిని కొలిచి ప్రార్థించారు.

రుద్రేశ్వర స్వామివారికి పాశుపతాభిషేకం

హనుమకొండ, ఆగస్టు 11 (ఆం ధ్రజ్యోతి): హనుమకొండ వేయిస్తంబాల గుడిలోని రుద్రేశ్వర స్వామివారికి శివప్రీతికరమైనమూడవ సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, ఉత్తిష్ఠ గణపతికి గోక్షీరాభిషేకం, గరిక పూజ, రుద్రేశ్వరునికి సద్యోజాతాది మూల మంత్రయుక్తంగా 100లీటర్ల ఆవుపాలుతో, 25లీటర్ల పెరుగుతో ప్రముఖ న్యాయవాది రవీందర్‌రావు దంపతులు పాశుపతాభిషేకం నిర్వర్తింపచేశారు. అనంతరం ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు సామూహిక రుద్రాభిషేకాలు జరిగాయి. ఆలయ వైదిక సిబ్బంది ప్రణవ్ శర్మ, సందీప్ శర్మ, మణికంఠ శర్మ అవధాని వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవోడి అనిల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నులిపురుగుల నివారణ మాత్రలు దివ్యౌషదం

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె చంద్రయ్య

మడికొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన(ఆల్బెండజోల్) మాత్రలు అందజేశారు. అయోధ్యాపురం, మడికొండ, కడిపికొండ, రాంపూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అయోధ్యాపురం ప్రాథమిక పాఠశాలలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్య చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈసందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు చిన్నారులకు దివ్యౌషదం అని అన్నారు. పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నపుడే చదువులో, జీవితంలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటికి తండ్లాట

బిందెలతో మోస్తున్న డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

హనుమకొండ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో యేళ్లుగా నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న అంబేద్కర్ నగర్, జితేందర్ సింగ్ నగర్ కాలనీవాసులకు డబుల్ బెడ్ రూమ్‌లు అందించి గృహ ప్రవేశం చేయించారు. కానీ, తాగునీరందక డబుల్ బెడ్‌రూమ్‌లలో నివసిస్తున్న కాలనీవాసులకు తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని డ్రమ్ముల్లో నింపుకొని నాలుగంతస్థుల వరకు బిందెలతో మోస్తూ ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు, లబ్ధిదారులు వాపోతున్నారు. తాగునీటితో పాటు విద్యుత్ కనెక్షన్, డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో ఇళ్లల్లో నివసించే వారికి ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. వెంటనే ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్‌లలో పెండింగ్ పనులను పూర్తి చేసి ఈ సమస్యలను పరిష్కరించాలని బాధితులు వేడుకుంటున్నారు.


నీటి కోసం ఇబ్బందులు పడుతున్న బాధితులు

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచి 2వ పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలనిసీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సుబేదారిలోని ఆర్ట్సకళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు కార్మికులు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బొట్ల చక్రపాణి మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది కార్మికుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో తక్కువ వేతనం ఇస్తూ తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, వీరందరిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి కార్మికులకుందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామన్న, ఐలయ్య, రమేష్, కుమరస్వామితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

టెన్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తా

- ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్
- సందడిగా టెన్నిస్ క్రీడలు ప్రారంభం

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో టెన్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జేఎన్ స్టేడియంలోని టెన్నిస్ కోర్టులో ఒక్క రోజు పాటు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సీనియర్ మెన్ డబుల్స్ టెన్నిస్ పోటీలను అజీజ్‌ఖాన్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టెన్నిస్ కోర్టులో రాత్రి సమయంలో క్రీడలు నిర్వహించడానికి వీలుగా ఉండే విధంగా త్వరలోనే ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. టెన్నిస్ అసోసియేషన్ జిల్లా ప్యాట్రన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈవీ శ్రీనివాస్ మాట్లాడుతూ...జిల్లాలో రోజు రోజుకు విస్తరిస్తున్న టెన్నిస్ క్రీడకు కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఒక్క రోజు పాటు జిల్లా స్థాయి సీనియర్ మెన్ డబుల్స్ టెన్నిస్ టోర్నీ లో 12 జట్లు పాల్గొనగా ఇందులో నాగయ్య (ఏసీపీ), శ్రీధర్ (ఆర్ఐ) జోడి ప్రథమ స్థానంలో నిలువగా, శివరాజ్, రోహిత్‌ల జోడి ద్వితీయ స్థానంలో నిలి చారు. ఈ సందర్భంగా విజేతలకు అతిథులు ట్రోఫీలను, బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నల్ల సురేందర్‌రెడ్డి, కార్యదర్శులు ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అంబటి నర్సయ్య (ఏసీపీ), ఉపాధ్యక్షులు కుంజు బిహారి, కోశాధికారి సిరికొండ సుదర్శన్, సభ్యులు కె. రవిచంద్ర, వెంకట నారాయణ, మల్లారెడ్డి, సాత్విక్, వినీల్, వినయ్‌వర్ధన్‌రెడ్డి డీఎస్ఏ టెన్నిస్ కోచ్ పెరుమాండ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అజీజ్‌ఖాన్

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి

హసన్‌పర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేట గ్రామ జనావాస ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ నడిబొడ్డున సెల్ టవర్ నిర్మాణం వల్ల రేడియేషన్ ప్రభావంతో ప్రజలు, చిన్నపిల్లలు అనారోగ్యానికి గురికావడమే కాకుండా అనేక శారీరక రుగ్మతలు కలుగుతాయని గ్రామస్థులు తెలిపారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా జనావాసాలకు దూరంగా సెల్ టవర్ నిర్మాణాన్ని చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన వారిలో చొక్కం మహెందర్, దుర్గం అశోక్, బొతు కుమార్, తిరుపతి, నేదునూరి సంతోష్, స్వరూప, దుర్గం సాయికిరణ్, గోల్లె రాజయ్య, బాడిష లక్ష్మణ్, అనిల్ ఉన్నారు.


ఏసీపీ నాగయ్య, ఆర్ఐలను అభినందిస్తున్న సీపీ

క్రీడల్లో రాణించే పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహం

సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించే పోలీ స్ సిబ్బంది, అధికారులకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన లాన్‌టెన్నిస్ పోటీల్లో డబుల్స్ విభాగంలో విజేతలుగా నిలిచిన ఏఆర్ ఏసీపీ నాగయ్య, ఆర్ఐ శ్రీధర్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో సీపీ అభినందించారు. విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులకు క్రీడలు ఆటవిడుపుగా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తుందన్నారు. క్రీడల్లో రాణించేవారికి శాఖపరమైన ప్రోత్సాహకాలతో పాటు నగదు రివార్డులను అందజేయడం జరుగుతుందని సీపీ పేర్కొన్నారు.

ఆదివాసీల హక్కులను హరిస్తున్న పాలకులు

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్

వడ్డేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల హక్కులను పాలక ప్రభుత్వాలు హరిస్తున్నాయని, జీవించే హక్కును కాలరాస్తున్నాయని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు వేదిక రాష్ట్ర కన్వీనర్ నక్క నారాయణరావు, వరంగల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ పి. రమేష్‌చందర్, టీపీఎఫ్ రాష్ట్ర నేత జనగాం కుమారస్వామి మాట్లాడారు. బస్తర్‌లో ఏర్పాటు చేసిన సాయుధ బలగాల క్యాంపులను వెంటనే ఎత్తి వేయాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు కొనసాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 1996 పీసా చట్టం, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలుచేయాలని, మధ్య భారతంలో ఆదివాసీల హననానికి వ్యతిరేకంగా ప్రజలు, ప్రజా సంఘాలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్‌లో ఇప్పటికే వందలాది మంది ఆదివాసీలు అసువులు బాశారని ఆవేదన వ్యక్తం చేశారు.



బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

24న భారీ బహిరంగ సభ..

ఆదివాసీల హక్కులు, అణచివేత, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 24న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, మేధావులు, కవులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ సభకు సంబంధించిన కరపత్రాలు , వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర , జిల్లా నాయకులు చంద్రమౌళి, ఆజాద్, కళావతి, శ్రావన్‌కుమార్, చారువాక, బాలరాజు, శాంతక్క, వెంగళ్‌రెడ్డి, ఇంద్రసేన, మహేష్, యాకూబ్, క్రాంతి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని మడిపల్లిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారుల ఇండ్ల ప్రగతిని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ ఎండీ వీవీ.గౌతం, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హులందరికీ ఒకేసారి ఇండ్లు రావని.. దశల వారీగా ఇండ్లు మంజూరు చేయిస్తామని అన్నారు. అనంతరం హసన్‌పర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో విలీన గ్రామాలకు చెందిన 1, 2, 55, 56, 65, 66 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం అట్టడుగు వర్గాలకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 104, 108, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు వంటివి పేదలకు బాసటగా నిలిచాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో రాని ఆలోచన విధానం ఈ రోజు సన్నబియ్యం పథకం ద్వారా ప్రతీ ఇంటికి చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చల్ల ప్రసాద్, ఎంపీడీఓ రవి, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు ఎండీ.రహీం, ఆర్ఐలు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆత్మకూరు వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహెందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పల్లె దయాకర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు రేషన్‌కార్డు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న మంద శ్యాంసుందర్, ఎండీ మసూద్

పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలి

టీజీసీఏ రాష్ట్ర కన్వీనర్ మంద శ్యాంసుందర్

వడ్డేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో డైట్ టెండర్‌ను పాత విధానాన్నే కొనసాగించాలని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (టీజీసీఏ) రాష్ట్ర కన్వీనర్ మంద శ్యాంసుందర్, వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్లు ఎండీ మసూద్, ఇసంపెల్లి సంజీవలు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించిన టీజీసీఏ వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో వారితోపాటు కో కన్వీనర్ పాల కుమారస్వామి, సంతోష్ మాట్లాడారు. 2025- 26విద్యా సంవత్సరానికి కూరగాయలు, పండ్లు సరఫరా చేయుటకు పాత టెండర్ విధానాన్ని మార్చడం వలన టెండర్ దారులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. నాలుగు నెలల నుంచి టెండర్ ధరలకు బిల్లులు అందక ఆర్థికంగా ఎంతో చితికి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీసీఏ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు నారాయణరావు, మధూకర్, ప్రదీప్, సదానందం, సతీష్, వీరన్న, రమేష్, వేణు, రవీందర్, అంబాల చందు, పాపన్న పాల్గొన్నారు.

ఢిల్లీలో నిరసన కార్యక్రమంలో ఎంపీ కావ్య

హనుమకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ క్రమంలో ఢిల్లీ పార్లమెంట్ ముఖద్వారం నుంచి కాంగ్రెస్, విపక్ష ఎంపీలు నిరసన ర్యాలీ చేపట్టారు. బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటింగ్‌లో మోసం జరిగిందని ఆరోపిస్తూ ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు.

వెహికిల్ ట్రాకింగ్‌పై అవగాహన అవసరం

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్


ఐసీసీసీ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వెహికిల్ ట్రాకింగ్ అప్లికేషన్‌పై శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు అవగాహన అవసరమని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవాం గ్రేటర్ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని కమిషనర్ అకస్మికంగా సందర్శించి వాహనాల ట్రాకింగ్ తీరును అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వెహికిల్ ట్రాకింగ్ యాప్‌పై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. నగర పరిధిలో ఉన్న అన్ని శానిటేషన్ వాహనాలను 5 జోన్లుగా విభజించి ఆయా జోన్లకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఆపరేటర్‌ను కేటాయించాలన్నారు. శానిటేషన్ వాహనాల కదలికలపై దృష్టి సారించాలన్నారు. పని చేయని వాహనాలను గుర్తించి కారణాలు తెలుసుకోవాలన్నారు. అన్ని శానిటేషన్ వాహనాల కండిషన్ గుర్తించి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని 24 గంటల్లో సమగ్ర సమాచారంతో కూడిన రిపోర్టును అందజేయాలన్నారు.

వెహికిల్ షెడ్డు అకస్మిక తనిఖీ..

హనుమకొండ బాలసముద్రంలో బల్దియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వెహికిల్ షెడ్డును సోమవారం కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వెహికిల్ షెడ్డు ప్రాంతంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇటీవల డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించిన నేపథ్యంలో ఆ ప్రాంతంలో గుడిసెలు తొలగించిన ప్రాంతంలో శానిటేషన్‌కు సంబంధించిన వాహనాలు పార్కింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు రవికుమార్, మాధవిలత, డీఈలు కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్, ఏఈలు సరిత, ఫణి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

మడికొండ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మడికొండలోని బొడ్రాయి(గ్రామదేవత) 8వ వార్షికోత్సవ వేడుకలు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ, కమిటీ గౌరవ అధ్యక్షుడు తొట్ల రాజుయాదవ్ విఘ్నేశ్వరపూజ, స్వస్తివాచనము, స్థలశుద్ధి, జలాభిషేకం, క్షీరాభిషేకం అనంతరం మహాదాశీర్వచనం గావించారు. కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గ్రామప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా ఆశీర్వదించు తల్లీ అంటూ భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో బైరి కొమురయ్య, పల్లపు రాజేందర్, అల్లం శ్రీనివాసరావు, వస్కుల శంకర్, దువ్వ నవీన్, బొల్లికొండ వినోద్‌కుమార్, పొనగోటి వెంకట్రావు, నర్మెటి బిక్షపతి గాండ్ల, పల్లపు అ ర్జున్, దువ్వ విజయ్, గున్నాల గౌతమ్, జిట్ట చంటి, వస్కుల శ్రీను, దండిగం రాజు, వస్కుల బాబు, ఈదురు అనిల్‌కుమార్, వల్లెపు బాలరాజ్, అ రూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మడికొండలో బొడ్రాయికు పూజలు చేస్తున్న బొడ్రాయి కమిటీ సభ్యులు, ప్రజలు

ఆవిష్కరణ

రోజుకొక నిమ్మపండు

రోజుకొక యాపిల్ తినడం ఆరోగ్యకరం అని అనుకుంటూ ఉంటాం. అలాగే పలు పోషకాలతో కూడిన అరటి పండు కూడా బలవర్థకమే, కాబట్టి రోజుకొక అరటి పండు తినడం మంచిదని కూడా నమ్ముతూ ఉంటాం. కానీ ఈ రెండింటి కంటే నిమ్మ పండు అన్ని విధాలా శ్రేయస్కరమని వైద్యులంటున్నారు. ఇలా ఎందుకంటున్నారో తెలుసుకుందాం!

న్యూజెర్సీకి చెందిన విలియం ప్యాటర్సన్ యూనివర్శిటీ, ప్రతి ఏటా పోషక విలువల ఆధారంగా పండ్లకు ర్యాంకులను కేటాయిస్తూ ఉంటుంది. అలా ఈ ఏడాది పోషక సాంద్రత, యాంటీఆక్సిడెంట్ల పరిమాణం, ఆరోగ్య ప్రయోజనాల ఆధారంగా, 41 రకాల పండ్లను విశ్లేషించి అన్నిటికంటే నిమ్మపండు ఆరోగ్యకరమని తేల్చింది. ఈ పండులో విటమిన్ సితో పాటు, పీచు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు పుష్కలంగా ఉంటాయనీ, జేబులో ఇమిడిపోయే వీలున్న నిమ్మపండు జీర్ణశక్తినీ, రోగనిరోధకశక్తినీ



పెంచుతుందనీ, గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుందనీ పరిశోధకులు పేర్కొంటున్నారు. నిమ్మ పండ్లు పుల్లగా ఉంటాయనే విషయం మనందరికీ తెలుసు. ఇవి ఆమ్ల గుణాన్ని కూడా కలిగి ఉంటాయి కాబట్టి నిమ్మరసాన్ని శరీరం శోషించుకున్నప్పుడు శరీరం మీద క్షార ప్రభావం పడుతుంది. ఫలితంగా శరీరంలోని పిహెచ్ సమతుల్యమై, పేగుల ఆరోగ్యం మెరుగవుతుంది. నిజానికి నిమ్మపండు కలిగి ఉండే ఆమ్లత్వం కూడా మేలు చేస్తుందనీ, వీటి పుల్లదనం వల్ల రోగనిరోధకశక్తి కుదుపుకు గురై అప్రమత్తమవతుఉందని కూడా పరిశోధకులు అంటున్నారు. నిమ్మపండుతో పాటు నిమ్మతొక్కలు కూడా ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. వీటిలోని లైమోనిన్ నూనెలు యాంటీ మైక్రోబియల్, యాంటీ క్యాన్సర్ గుణాలను కలిగి ఉంటాయి. కాబట్టి నిమ్మతొలును తురిమి వంటల్లో వాడుకుంటూ ఉండాలి.

అధ్యయనం

డైట్ సోడాలతో చేటు

క్యాలరీలు లేని డైట్ సోడాలు ఆరోగ్యానికి చేటు కలిగించవని అనుకోవడం పొరపాటు. వాటితో గుండెకూ, మెదడుకూ చేటు కలుగుతుందని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. రోజుకు ఒకటి లేదా రెండు డైట్ సోడాలు తాగే వారికి దాదాపు మూడు రెట్లు గుండెపోటు, అల్జీమర్స్ ముప్పు పొంచి ఉంటుందనే ఒక తాజా అధ్యయనం అమెరికన్ హార్ట్



అసోసియేషన్ జోర్నల్‌లో ప్రచురితమైంది. ఈ అధ్యయనంలో భాగంగా 2,800 మంది, 45 నుంచి 55 ఏళ్ల వయస్కులను పరీక్షించినప్పుడు, వారికి గుండెపోటు, అల్జీమర్స్ ముప్పు 30% కంటే ఎక్కువ ఉన్నట్టు గుర్తించడం జరిగింది. అలాగే డైట్ సోడాలోని ఫాస్ఫరస్ ఎముకల సాంద్రతను సన్నగిల్లేలా చేసి ఎముకలను గుల్లబారుస్తుంది. అలాగే దాన్లోని కృత్రిమ చక్కెరలైన ఆస్పర్టేమ్ లేదా స్టీవియాలు నాడీ క్షీణతను పెంచుతాయి. డైట్ సోడాను విపరీతంగా తాడే వారిలో, మూత్రపిండాల సామర్థ్యం కూడా త్వరితంగా క్షీణిస్తుందని నర్సెస్ హెల్త్ స్టడీకి చెందిన పరిశోధకులు కనిపెట్టారు. దాహార్తిని తీర్చుకోవడం కోసం డైట్ సోడాల మీద ఆధారపడడం వల్ల ఈ పానీయంలోని కెఫీన్ ఫలితంగా దాహార్తి తీరకపోగా, అత్యధిక మూత్రవిసర్జనతో శరీరంలో డీహైడ్రేషన్ పెరుగుతుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు. దీన్లోని కెఫీన్‌తో నిద్రలేమి సమస్య కూడా వేధిస్తుందనీ, అదే పనిగా డైట్ సోడాలు తాగడం వల్ల కాలేయం దెబ్బతింటుందని కూడా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

వానాకాలం వెతలు

వానాకాలం విజృంభించే జ్వరాల గురించి మనందరికీ తెలిసిందే! అయితే మారుతున్న కాలంతో పాటు శరీరంలో చోటుచేసుకునే మార్పులకు తగ్గట్టు ఆహార, జీవనశైలులను మార్చుకోగలిగితే వానాకాలం జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని ఆయుర్వేదం చెప్తోంది.





జలుబు, జ్వరాలకు చెల్లుచీటీ



శరీరంలోని వాత, పిత్త, కఫాల్లోని హెచ్చుతగ్గులతో జ్వరాలు సోకుతూ ఉంటాయి. వాత జ్వరం, పిత్త జ్వరం, కఫ జ్వరంతో పాటు రెండు, మూడు దోషాలు కలిసిన సన్నిపాతిక జ్వరాలు కూడా వానాకాలంలో సోకుతూ ఉంటాయి. అలాగే ఇన్‌ఫెక్షన్లు, దోమ కాట్ల వల్ల సోకే విషమ జ్వరాలు కూడా ఈ కాలంలో వేధిస్తూ ఉంటాయి. సంతత, సతత, అన్యేద్యుష్య, త్రితీయక, చాతుర్థక అనే ఐదు రకాల విషమ జ్వరాలే... మలేరియా, డెంగు, వైరల్ జ్వరాలు. మనమిప్పుడు ఆధునిక వైద్యంలో ఆచరిస్తున్నట్టు, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమలు దరి చేరకుండా జాగ్రత్త పడడం లాంటి ముందస్తు జాగ్రత్తలతో ఈ జ్వరాలను అడ్డుకోవచ్చు. అలాగే ఈ కాలంలో ఆహార కలుషితం వల్ల ఇన్‌ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. కాబట్టి మారే రుతువులకు అనుగుణంగా మన దినచర్య, రుతు చర్య, జీవనశైలులను మలుచుకోవాలి.

జలుబు, జ్వరాలకు అడ్డుకట్ట

ఆయుర్వేదంలో జ్వరాలకు పలు రకాల చికిత్సలున్నప్పటికీ ఇంట్లో స్వయంగా చేసుకోగలిగే కొన్ని స్వల్ప చికిత్సలు కూడా ఉన్నాయి. సాధారణంగా ఈ కాలంలో జలుబుతో కూడిన జ్వరం ఎక్కువ మందిని వేధిస్తుంది. జలుబు జ్వరంగా మారక ముందే మొదలుపెట్టే వీలున్న చికిత్సలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- ఐదు తులసి ఆకులు, ఐదు మిరియాలు దంచి, మూడు పూటలా నమిలి తినాలి. దీంతో ఉన్న జలుబు తగ్గడంతో పాటు రాకుండా రక్షణ కూడా దక్కుతుంది
- అలర్జీ సంబంధిత జలుబుతో ముక్కు నుంచి నీరు కారుతున్నప్పుడు ఇంట్లో దంచుకున్న పసుపు రెండు చిటికెలు తీసుకుని, అరగ్లాసు పాలలో కలుపుకుని తాగాలి. దాంతో రోగనిరోధకశక్తి పెరిగి, అలర్జీ తగ్గిపోతుంది
- జలుబుతో పాటు గొంతు గరగరలాడుతుంటే, మిరియాలు పొడి చేసుకుని, పాలలో కలిపి తాగాలి
- గుడూచి... జ్వరానికి ఉత్తమమైన ఔషధం. జ్వరం మొదలైన వెంటనే మూడు లేదా నాలుగు గుడూచి ఆకులను దంచి, రసాన్ని తాగాలి
- జ్వరం తీవ్రమైనప్పుడు అనుభవం ఉన్న ఆయుర్వేద వైద్యులను సంప్రతించి, ఆనందభైరవ రసం, త్రిభువనకీర్తి రసం తీసుకోవాలి
- ముందస్తుగానే జ్వరాన్ని అడ్డుకోవడం కోసం మాత్రల రూపంలో దొరికే మృత్యుంజయ రసాన్ని తీసుకోవచ్చు. దీన్ని రోజుకు రెండు పూటలా, వారం రోజుల పాటు వాడుకోవాలి
- దగ్గు మొదలైనప్పుడు లవంగాది వటి తీసుకోవచ్చు
- అడ్డసరం రసం తాగినా ఈ కాలంలో వేధించే దగ్గుల నుంచి ఉపశమనం దక్కుతుంది

వానాకాలం ఆహారం

శరీరం మొత్తం వాత, పిత్త, కఫ దోషాలు ఆవరించి ఉంటాయి. ఇవి సమ స్థితిలో ఉన్నప్పుడు ఆరోగ్యం నిక్షేపంగా ఉంటుంది. కానీ ఈ కాలంలో కఫాన్ని పెంచే చల్లని పదార్థాలు, తీపి పదార్థాలు తినడం వల్ల జలుబు, దగ్గు, జ్వరాలు వేధిస్తాయి. అలాగే ఈ కాలంలో జీర్ణశక్తి తగ్గుతుంది. కాబట్టి తేలికగా జీర్ణమయ్యే పదార్థాలు మాత్రమే తీసుకోవాలి. మాంసాహారం, పాలు, వెన్న, మీగడ, తీపి పదార్థాలు మానేయాలి. పెరుగుకు బదులు మజ్జిగ తీసుకోవాలి. అలాగే ఇడ్లీ, దోసెల రూపంలో మినప్పప్పు ఎక్కువగా తింటూ ఉంటాం. కానీ మినప్పప్పు ఎక్కువ సాంద్రతను కలిగి ఉంటుంది కాబట్టి కఫం పెరిగి, బరువు పెరుగుతాం. జలుబు, దగ్గు వేధిస్తాయి. కాబట్టి ఈ కాలంలో మినప్పప్పు వాడకం తగ్గించాలి. కాయగూరలు ఎక్కువగా తినాలి. తినే ఆహారం వేడిగా ఉండేలా చూసుకోవాలి. కడుపును మూడు భాగాలు చేసుకుని, ఒక భాగం ఆహారంతో, రెండో భాగం నీటితో నింపి, మూడో భాగాన్ని ఖాళీగా వదిలేస్తూ ఉండాలి. ఇలాంటి అలవాటుతో జీర్ణశక్తి కుంటుపడకుండా ఉంటుంది. ఇలా ఆయుర్వేద శాస్త్రం సూచించే అలవాట్లను అలవరుచుకోగలిగితే వానాకాలం వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

ఆచారాల్లోనే ఆరోగ్యం

ఈ కాలంలో తినే ఆహారం తాజాగా ఉండాలి. ఏ పూటకాపూట వండుకుని, వేడిగా తినాలి. నిల్వ ఉన్న ఆహారం, నీరు తాగకూడదు. మరీ ముఖ్యంగా వర్షాలు ఉధృతంగా కురుస్తున్నప్పుడు ఆకుకూరలు తినడం మానేయడం మంచిది. నిజానికి వానాకాలం నుంచి రక్షణ కల్పించే అలవాట్లు మన సంప్రదాయాల్లోనే ఉన్నాయి. ఈ కాలంలో మాంసాహారం తేలికగా జీర్ణమవక శరీరంలో ఆమం పెరుగుతుంది. వానాకాలంలో వచ్చే శ్రావణమాసంలో మాంసాహారానికి దూరంగా ఉండడం వెనకున్న కారణం ఇదే! అలాగే చవితి నాటి పత్రికి బ్యాక్టీరియా, వైరస్‌లను తరిమే గుణాలుంటాయి. అలాగే ఆ రోజు తుమ్మి కూర తింటాం. దాంతో వ్యాధినిరోధకశక్తి పెరిగి వానాకాలం వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి. వాకిళ్లకు, పెళ్లిళ్లలో పందిళ్లకు కట్టే మామిడి తోరణాలకు కూడా కొన్ని ప్రయోజనాలున్నాయి. చెట్టు నుంచి కోసిన తర్వాత వారం రోజుల వరకూ కూడా మామిడాకుల నుంచి ఆక్సిజన్ విడుదల అవుతూనే ఉంటుంది. అలాగే ఈ ఆకులు వైరస్, బ్యాక్టీరియాల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఇలా ప్రతి ఆచారం వెనక నిగూఢమైన ఆయుర్వేద శాస్త్రం దాగి ఉంటుంది. కాబట్టి ఆయా ఆయుర్వేద ఆరోగ్య సూత్రాలను అనుసరించగలిగితే, వానాకాలం రుగ్మతల నుంచి ప్రతి ఒక్కరూ సులువుగా బయటపడగలుగుతారు.

డాక్టర్ ఎన్. ఉమా శ్రీనివాస రావు
ప్రొఫెసర్ అండ్ వైస్ ప్రిన్సిపాల్,
డాక్టర్ బి.ఆర్.కె.ఆర్. గవర్నమెంట్
ఆయుర్వేదిక్ కాలేజి, హైదరాబాద్.



పోకడ

జిమ్‌లో గుండెపోట్లు

జిమ్‌లో వ్యాయామం చేస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఇలాంటప్పుడు ఆరోగ్యాన్ని అందించవలసిన వ్యాయామాలు ప్రాణాలనే హరించేస్తున్నాయనే అనుమానాలు, అయోమయాలు తలెత్తడం సహజం. కానీ గుండెపోటుకు గురవడానికి అసలు కారణాలు మన అంతర్గత ఆరోగ్య పరిస్థితులే!

అందరి శరీరాలూ ఒకేలా ఉండవు. శరీరం శక్తిని ఖర్చు చేసుకోగలిగే సామర్థ్యం ప్రతి వ్యక్తికీ వేర్వేరుగా ఉంటుంది. ఆ సామర్థ్యం జిమ్ వ్యాయామాలను భరించే స్థాయిలో ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అలాగే ఇన్సులిన్ రెసిస్టెన్స్, రక్తంలో చక్కెరలు, హార్మోన్ల హెచ్చుతగ్గులు, తీవ్రమైన ఇన్‌ఫ్లమేషన్... ఈ కారణాలన్నీ భౌతిక శ్రమకు లోనైనప్పుడు మరింత తీవ్రమైన సమస్యలకు దారి తీస్తూ ఉంటాయి. 20 ఏళ్ల వయసులో ఎంచుకున్న జీవనశైలి మార్పుల ముప్పు 30, 40 ఏళ్లకు ముంచుకొస్తుంది. కదలకుండా గంటల తరబడి కూర్చోవడం, అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లు, తీవ్ర ఒత్తిడి, అస్తవ్యస్థ నిద్రవేళలు శరీరాన్ని కుంగదీస్తాయి. పైకి చూడడానికి ఆరోగ్యంగా, చలాకీగా కనిపిస్తున్నప్పటికీ, అంతర్గత వ్యవస్థలైన గుండె, అంతఃస్రావ వ్యవస్థలు ఒత్తిడికి లోనై ఉంటాయంటున్నారు బెంగుళూరు, మణిపాల్ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, డాక్టర్ కతేరియా.

వీళ్లు మరింత అప్రమత్తం

రక్తంలో ఏ కాస్త చక్కెర మోతాదు పెరిగినా, రక్తనాళాలు, నాడులు దెబ్బతిని, గుండె జబ్బుకు దారి తీస్తాయి. ఈ కోవకు చెందినవాళ్లు వ్యాయామ సమయంలో శ్రమకు లోనైనప్పుడు, గుండె మీద ఒత్తిడి పెరుగుతుంది. ఆరోగ్యకరమైన వ్యక్తులతో పోలిస్తే, తేలికపాటి వ్యాయామాలు చేసే సమయంలో ఊబకాయుల్లో రక్తపోటు త్వరితంగా పెరిగిపోతూ ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో గుండెకు రక్తప్రవాహం పెరిగి, గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెడుతుంది. నిజానికి వ్యాయామ సమయంలో గుండె కొట్టుకునే వేగాన్ని పర్యవేక్షించడం ఎంతో ముఖ్యం. మరీ ముఖ్యంగా ఊబకాయులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి ఆరోగ్య సమస్యలున్నవాళ్లు ఆరోగ్యానికి చేటు చేయని, సురక్షితమైన వ్యాయామ పద్ధతులను అనుసరించడం కోసం వ్యాయామ సమయంలో గుండె కొట్టుకునే వేగాన్ని పర్యవేక్షించుకోవాలి.

మధుమేహం ముప్పు

మధుమేహం వంశపారంపర్యం. అయినప్పటికీ ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాయామాలతో మధుమేహాన్ని కొంత మేరకు వాయిదా వేయవచ్చు. కానీ తల్లితండ్రుల నుంచి సంక్రమించకుండా అడ్డుకోలేం! సాధారణంగా కొందరు ఆరోగ్యకరమైన ఆహార, జీవనశైలులను అనుసరించినంత కాలం మధుమేహం దరి చేరదు అనే అపోహలో ఉంటూ ఉంటారు. మధుమేహం చాప కింద నీరులా నిశ్శబ్దంగా శరీరాన్ని ఆక్రమిస్తుంది. లక్షణాలు స్పష్టంగా కనిపించవు కాబట్టి స్వల్ప స్థాయి మధుమేహం నిర్లక్ష్యానికి గురవుతూ, దీర్ఘకాలంలో గుండెకు చేటు చేసి, గుండెపోటు రూపంలో కుప్పకూల్చేస్తూ ఉంటుంది. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే వంశపారంగా మధుమేహం సంక్రమించే వీలున్న వారు, క్రమం తప్పక రక్తంలోని చక్కెర మోతాదులను పరీక్షించుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలి. మధుమేహం ఎంత స్వల్పంగా ఉన్నప్పటికీ, వైద్యులు సూచించే మందులు వాడుకోవాలి. అంతే తప్ప వ్యాయామంతో మధుమేహాన్ని తగ్గించుకోగలమని అనుకోకూడదు. అలాగే కొందరు ఆరోగ్యాన్ని అంచనా వేయడం కోసం ఎండ్యురెన్స్ పరీక్ష లేదా స్ట్రెస్ పరీక్షల మీద ఆధారపడుతూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో గుండె రక్తనాళాల్లోని స్వల్ప అవరోధాలు పరీక్షల్లో బయల్పడకపోవచ్చు. ఈ పరీక్షలు పెద్ద పెద్ద అవరోధాలను మాత్రమే



కనిపెట్టగలుగుతాయనే విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలంటున్నారు డాక్టర్ కతేరియా. మధుమేహులు వ్యాయామంలో భాగంగా శరీరాన్ని శ్రమకు లోను చేసినప్పుడు రక్తనాళాల్లోని ఈ మెత్తని అవరోధాలు ఒక్కసారిగా ఊడి, కుప్పగా మారి, రక్తప్రవాహానికి అడ్డుపడతాయని హెచ్చరిస్తున్నారాయన.

మీకు తెలుసా?

మనలో 40% మందికి క్యాన్సర్

మనలో 40% మంది వారి జీవితంలో క్యాన్సర్ బారిన పడుతూ ఉంటారని జాతీయ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన తాజా సర్వేలు సూచిస్తున్నాయి. క్యాన్సర్ ప్రపంచవ్యాప్త ఆరోగ్య సవాళ్లలో ఒకటిగా మారిపోయింది. ఒక్క అమెరికాలో, ఈ ఒక్క ఏడాదిలోనే రెండున్నర లక్షల కొత్త క్యాన్సర్ కేసులు వెలుగులోకొచ్చాయి. ఆరు లక్షల మంది క్యాన్సర్ రోగులు మరణం అంచున ఉన్నారు. మన దేశంలో ప్రస్తుతానికి అత్యధికంగా 15 లక్షల మంది క్యాన్సర్ రోగులున్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, అండాశయాల క్యాన్సర్ సర్వసాధారణమైతే, పురుషుల్లో ఊపిరితిత్తులు, నోరు, నాలుక క్యాన్సర్లు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. అయితే మిగతా దేశాలతో పోలిస్తే, మన దేశంలో క్యాన్సర్లను తొలి దశల్లోనే గుర్తిస్తున్న పరిస్థితి నెలకొని ఉంది. అయితే స్థూలంగా స్త్రీపురుషుల జీవితకాలంలో క్యాన్సర్ ముప్పు 38.9%కి పెరిగింది. ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలతో, సమర్థమైన చికిత్సలతో క్యాన్సర్ మరణాల సంఖ్య క్రమేపీ తగ్గుతున్నప్పటికీ, ఆ వ్యాధి బారిన పడే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఆరోగ్యకరమైన ఆహార, జీవన శైలులను అనుసరించడంతో పాటు, దైనందిన జీవితంలో వ్యాయామానికి స్థానం కల్పించాలి.





మెడికల్ న్యూస్

ఇటీవల కర్నాటకలో ఒక మహిళకు సర్జరీ చేస్తున్న క్రమంలో 'క్రిబ్' అనే ఒక కొత్త రక్త గ్రూపు వెలుగులో కొచ్చింది. ఇలాంటి కొత్త రక్త గ్రూపులు, వాటి పూర్వాపరాల గురించి వైద్యులేమంటున్నారో తెలుసుకుందాం!

కొత్త రక్తం... క్రిబ్

సాధారణంగా ఎవరికైనా ప్రధానంగా ఎ, బి, ఎబి, ఒ (పాజిటివ్ లేదా నెగటివ్) రక్త గ్రూపులుంటాయనే మనందరం అనుకుంటూ ఉంటాం. కానీ రక్త గ్రూపుల్లో 25 భిన్నమైన మైనర్ రకాలు కూడా ఉంటాయి. ప్రధాన గ్రూపు 'ఎ', 'బి', 'ఎబి', 'ఒ'లే అయినా, వాటిలోని యాంటీజెన్లను బట్టి వాటిని భిన్నమైన రక్త గ్రూపులుగా పరిగణిస్తారు. 'ఎ' బ్లడ్ గ్రూపు రక్తకణాలకు 'ఎ' అనే యాంటీజెన్ ఉంటుంది. 'బి' బ్లడ్ గ్రూపు రక్తకణాలకు 'బి' యాంటిజెన్ ఉంటుంది. కాబట్టి ఆయా రక్త గ్రూపులను ఆయా యాంటీజెన్ల పేర్లతో పిలుస్తారు. 'ఒ' బ్లడ్ గ్రూపుకు 'ఎ', 'బి' యాంటిజెన్లు రెండూ ఉండవు. అలాంటి భిన్నమైన మరొక రక్తగ్రూపు బోంబే బ్లడ్ గ్రూపు. దీన్ని ముంబైలో 1950ల్లోనే గుర్తించారు. ఇది చూడడానికి 'ఒ' బ్లడ్ గ్రూపులాగే కనిపించినా, అదే బ్లడ్ గ్రూపుతో సరిపోలదు. బాంబే బ్లడ్ గ్రూపుకు 'ఎ', 'బి'లతో పాటు 'హెచ్' యాంటిజెన్ కూడా ఉండదు. దాంతో ఇది 'ఒ' రక్తగ్రూపును అనుకరిస్తుంది. అలాగని అదే గ్రూపు రక్తంతో సరిపోలదు. కాబట్టి ఈ కోవకు చెందిన వారికి అదే తరహా రక్తం మినహా మరే రక్తమూ మ్యాచ్ కాదు.

అరుదైన రక్త గ్రూపులున్నాయి

సాధారణంగా రక్త మార్పిడి సమయంలో ఒకే గ్రూపుకు చెందిన రక్తాలు మ్యాచ్ కాని సందర్భాల్లో వైద్యులు లోతైన పరీక్షలు చేపడుతూ ఉంటారు. అలాంటి సందర్భాల్లో కొత్త రక్త గ్రూపులు బయల్పడుతూ ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా లక్ష మందిలో ఒకరికి, ప్రతి పది వేల భారతీయుల్లో ఒకరికి బాంబే బ్లడ్ గ్రూపు ఉంటుంది. మెడికల్ టూరిజం ద్వారా ఆఫ్రికా, ఇరాక్.. ఇలా మధ్య ప్రాచ్య దేశాల నుంచి ఎంతో మంది మన దేశానికి వస్తూ ఉంటారు. వీరిలో కొందరు ఆఫ్రికన్లకు ఇతరత్రా జన్యుపరమైన రక్తగ్రూపులున్నాయి కాబట్టి ప్రధాన రక్తగ్రూపు సరిపోలినా, మైనర్ రక్తగ్రూపు సరిపోలదు. మనకు లేని యాంటీజెన్లు వాళ్లకు ఉంటాయి. కాబట్టి ఆ జాతీయుల నుంచే రక్తాన్ని సేకరించి, మ్యాచ్ చేయవలసి వస్తూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో అరుదైన రక్త గ్రూపులు కలిగి ఉన్న వారికి అత్యవసర సమయాల్లో రక్తం దొరక్కపోవచ్చు. భవిష్యత్తులో అలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉండడం కోసం, సదరు వ్యక్తుల నుంచి ముందుగానే రక్తాన్ని సేకరించి, నిల్వ చేసుకునే విధానాన్ని కూడా వైద్యులు అనుసరిస్తూ ఉంటారు. అందుకోసం ఈ కోవకు చెందిన వారికి ఇంజెక్షన్లతో ఎముక మజ్జను ప్రేరేపించి ఎక్కువ రక్తాన్ని వృద్ధి చేయడం ద్వారా అదనపు రక్తాన్ని సేకరిస్తారు.

కారణాలున్నాయి

తాజాగా బయల్పడిన 'క్రిబ్' రక్త గ్రూపు పూర్తిగా కొత్తది. దీనికి క్రోమర్ ఇండియా బెంగళూరు అని పేరు పెట్టారు. ఇలా కొత్త రక్త గ్రూపులు పుట్టుకు రావడానికి కారణాలు లేకపోలేదు. బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జన్యుపరమైన వ్యత్యాసాల వల్ల కొత్త రక్త గ్రూపులు పుట్టుకురావచ్చు. ఇలా కొత్త రక్త గ్రూపులు బయల్పడడం వల్ల కొన్ని ప్రయోజనాలుంటాయి. వీటిని శాస్త్రీయ సాహిత్యంలో చేర్చడం ద్వారా ఎంత మందికి ఈ రక్త గ్రూపు ఉందనే విషయం వెల్లడవుతుంది. అలాగే అత్యవసర పరిస్థితుల్లో రక్త మార్పిడికి వీలుగా ముందస్తుగా రక్తాన్ని సేకరించి నిల్వ చేసుకునే వెసులుబాటు చిక్కుతుంది.

బ్లడ్ జాండిస్

రక్తానికి సంబంధించి ఎంతో మందికి తెలియని అత్యంత ముఖ్యమైన విషయం.. బ్లడ్ జాండిస్. కామెర్ల వ్యాధి కాలేయానికే పరిమితం కాదు. కామెర్లకు రక్తంతో కూడా సంబంధం ఉంటుంది. ఎర్రరక్త కణాలు విచ్ఛిన్నమవుతున్నా కామెర్లు సోకుతాయి. కాలేయం దెబ్బతినే పరిస్థితి, కాంజుగేటెడ్ జాండిస్ అయితే, రక్తకణాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితి... అన్‌కాంజుగేటెడ్ జాండిస్. రక్తపు జాండిస్‌లో కూడా, కాలేయ జాండిస్ లక్షణాలే కనిపిస్తాయి. అదనంగా నీరసం ఆవరించినా, అదంతా పత్యం వల్లే అనుకుంటారు. కానీ అది రక్తపు జాండిస్ కాదని నిర్థారించుకోవడం కోసం 'డైరెక్ట్ కూంబ్స్ టెస్ట్' అనే పరీక్ష చేయించుకోవాలి. ఫలితంలో రక్తపు జాండిస్ ఉందని తేలితే సత్వర చికిత్స మొదలుపెట్టాలి. ఇలాంటి రక్త కామెర్లు సోకిన వాళ్లకు ఎర్ర రక్త కణాల మీద పైపొర ఏర్పడుతుంది. దాంతో రక్తకణాలు పగిలిపోతూ ఉంటాయి. కాబట్టి వైద్యులు స్టిరాయిడ్స్ ఇచ్చి, ఆ పరిస్థితిని సరిదిద్దుతారు.

డాక్టర్ పద్మజ లోకిరెడ్డి
హెమటో ఆంకాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
హైదరాబాద్.



రంగులు మార్చే కార్లు!





దశాబ్దాల క్రితమే ప్రతిపాదనలు.. అప్పట్నుంచీ చర్చ.. బీఎండబ్ల్యూ, నిస్సాన్, ఫోర్డ్ సంస్థల ప్రయోగాలు

- అన్నీ ఇంకా ప్రతిపాదనలు, పరిశోధనల దశలోనే!
- నీతా అంబానీ వద్ద ఈ తరహా ఔడీ కారుందంటూ వైరల్ అవుతున్న వార్తలన్నీ వదంతులే : నిపుణులు

'కారు కొన్నాం'.. అని ఎవరైనా చెప్పగానే సహజంగా అందరూ అడిగేది.. 'కార్ కలర్ ఏంటి?' అని! కారు రంగుకు అంత ప్రత్యేకత ఉంటుంది. కంటికి ఆహ్లాదకరంగా కనిపించడానికే కాదు.. గుర్తింపునకు కారు రంగు ఉపయోగపడుతుంది. ఏదైనా నేరం జరిగినప్పుడు.. నేరగాళ్లు వాడే వాహనం (కారు/వ్యాన్.. ఇలా ఏదైనా) రంగు దర్యాప్తు సంస్థలకు కీలకంగా మారుతుంది. అందుకే కారు రిజిస్ట్రేషన్ సందర్భంగా తప్పనిసరిగా కారు రంగును పేర్కొంటారు. అంత కీలకమైన కారు రంగు.. ఎప్పుడు పడితే అప్పుడు, ఎలా కావాలంటే అలా మారిపోతే? వినడానికే చాలా ఉత్సాహంగా ఉన్న ఈ ఆలోచన కార్ల తయారీదారులు, వినియోగదారులకు చాలా కాలంగానే ఉంది. రిలయన్స్ చీఫ్ ముకేశ్ అంబానీ భార్య నీతా వద్ద రంగులు మార్చే సత్తా ఉన్న ఔడీ-ఏ9 కారు ఉందని.. దాని విలువ రూ.100 కోట్లని.. ప్రపంచం మొత్తమ్మీదా ఇలాంటి కార్లు 11 మాత్రమే ఉన్నాయని.. వాటిలో ఒకటి నీతా వద్ద ఉందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కానీ.. అది వదంతి మాత్రమేనని, అందులో నిజంలేదని ఆటోమొబైల్‌రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ డిజైన్‌ను 2010లో స్పెయిన్‌కు చెందిన డేనియల్ గ్రేసియా అనే డిజైనర్ ప్రతిపాదించాడని వారు తెలిపారు. ఆయన ప్రతిపాదనకు, ఔడీ సంస్థకు ఎలాంటి సంబంధమూలేదని.. అలాంటి ఒక ప్రసిద్ధ కంపెనీ పేరుతో ఈ ఆలోచనను మార్కెట్లోకి తీసుకెళ్తే ఎక్కువ ప్రచారం లభిస్తుందనే ఉద్దేశంతోనే అలా చేశారని సమాచారం. అప్పట్నుంచీ ఇది అడపాదడపా వార్తల్లో కనిపిస్తూనే ఉంది. డేవిడ్ గ్రేషియా ప్రతిపాదన అప్పట్నుంచీ కాన్సెప్ట్ దశలోనే ఉంది తప్ప.. వాస్తవరూపం దాల్చలేదు. ఆయన ప్రతిపాదన ప్రకారం నానో టెక్నాలజీ సాయంతో కారు రంగులు మారేలా చేయొచ్చు. కానీ అది ఖర్చుతో కూడుకున్న పని కావడం, ఔడీ సంస్థకు ఆయనకు ఏ సంబంధమూ లేకపోవడంతో ఆ ప్రాజెక్టు అసలు పట్టాలే ఎక్కలేదు.

ఆటోమొబైల్ పరిశ్రమలో సాంకేతికత ఎప్పటికప్పుడు మారుతూ వస్తోంది. మారనిదల్లా కార్లకు వేస్తున్న రంగులు మాత్రమే. రంగుల టెక్నాలజీలో మార్పులు వచ్చాయిగానీ.. ప్రాథమికంగా చాలా కార్లు తెలుపు, నలుపు, బూడిద, నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లోనే కనిపిస్తాయి. కొన్ని మాత్రమే వీటికి భిన్నమైన రంగుల్లో కనిపిస్తాయి. ఒకే రంగు కాకుండా కావాలనుకున్నప్పుడు కావాలనుకునే రంగులోకి మారే కార్ల తయారీపై ఉత్పత్తి సంస్థలకు చాలాకాలంగా ఆసక్తి ఉంది. ఈక్రమంలోనే బీఎండబ్ల్యూ, లెక్సస్, ఫోర్డ్, నిస్సాన్ వంటి కార్ల కంపెనీలు పలు ప్రయోగాలు చేశాయి. ఈ-ఇంక్ టెక్నాలజీ, కెమెలియన్ ర్యాప్, కెమెలియన్, టెంపరేచర్ సెన్సిటివ్ పెయింట్‌వంటి పరిజ్ఞానాలతో కార్ల రంగులు మార్చే ప్రయత్నాలు చేశాయి.

ఈ-ఇంక్ టెక్నాలజీ: బీఎండబ్ల్యూ 2022లో జరిగిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో (సీఈఎస్)లో తొలిసారి ఒక కలర్ చేజింగ్ కార్‌ను ప్రదర్శనకు పెట్టింది. ఇంద్రధనుస్సులో ఉండే అన్ని రంగులూ కనిపించే కారు కాదది. కేవలం నలుపు, తెలుపు, బూడిదరంగుల్లోని రకరకాల షేడ్స్‌లోకి మారుతుందది. ఎలక్ట్రో ఫోరేటిక్ ఇంక్ (ఈ-ఇంక్) ప్యానెల్స్ ద్వారా ఆ కారు రంగులు మారుస్తుంది. దీన్ని మరింత ఆధునీకరించి.. నలుపు, తెలుపు, బూడిదరంగుల్లోని 32 షేడ్స్‌లోకి మారేలా చేశారు. 2023 సీఈఎస్‌లో దాన్ని 'బీఎండబ్ల్యూ ఐ విజన్ డీ' పేరుతో ప్రదర్శించారు. ఈ రెండు కార్లూ ఇంకా ప్రోటోటైప్ దశలోనే ఉన్నాయి. మార్కెట్లోకి రాలేదు.

కెమెలియన్ రాప్: కారుపై పెయింట్‌కు బదులు పల్చటి, బలమైన వినైల్ షీట్‌ను అతికిస్తారు. ఆ షీట్‌లో కలర్ షిఫ్ట్ పిగ్మెంట్లు ఉండటం వల్ల కారును మనం ఒక్కో కోణంలో చూస్తే ఒక్కో రంగులో కనిపిస్తుంది. 2010-2012 మధ్య లెక్సస్ తయారుచేసిన ఎల్ఎఫ్ఏ మోడల్ కార్లను కొన్న సంపన్నులు.. వినైల్ షీట్లను అతికించి హల్‌చల్ చేశారు. 2012 తర్వాత ఈ మోడల్ కార్ల తయారీని లెక్సస్ నిలిపేసింది.

కెమెలియన్ పెయింట్ : నిస్సాన్ కెమెలియన్ పెయింట్‌పై ప్రయోగాలు చేసింది. ఇందులో భాగంగా వాడే 'ఎలక్ట్రోక్రోమిక్ పెయింట్'లోని మాలిక్యూల్స్ రంగు.. ఓల్టేజ్‌ను బట్టి మారుతుంది. కారులోని డ్రైవర్ చిన్న బటన్ నొక్కి, ఓల్టేజీలో మార్పులతో కారు కలర్ మారేలా చేయొచ్చు. కారును పగలు తెల్లగా.. రాత్రిపూట నల్లగా మార్చుకోవచ్చు. కానీ, ఇదింకా పరిశోధన దశలోనే ఉంది.

టెంపరేచర్ సెన్సిటివ్ పెయింట్

అమెరికాకు చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోర్డ్.. టెంపరేచర్ సెన్సిటివ్ (థెర్మోక్రోమిక్) పెయింట్‌పై విస్తృత పరిశోధనలు చేసింది. ఈ పెయింట్ వేసిన కారు వేడి తగిలితే ఒక రంగులోకి, చల్లగా ఉన్నప్పుడు మరో రంగులోకి మారిపోతుంది (ఫోర్డ్ ఒక డెమోలో భాగంగా.. కారుపై వేడినీరు పోసినప్పుడు బాడీ కలర్ మారింది). కానీ ఇది కాన్సెప్ట్ దశలోనే ఆగిపోయింది. కారుపై ఈ పెయింట్ వేస్తే వాతావరణ ప్రభావానికి సులభంగా దెబ్బతింటుంది. మన్నిక తక్కువ. నిర్వహణ ఖర్చు ఎక్కువ. అందుకే దీని ఉత్పత్తి ప్రారంభించలేదు.

చివరాఖరు: నీతాఅంబానీ వద్ద రంగులు మార్చే రూ.100కోట్ల కారు లేదుగానీ.. ఆమె వాడే అత్యంత ఖరీదైన కారు.. 'రోల్స్‌రాయిస్ ఫాంట్ 8 ఈడబ్ల్యూబీ' మోడల్. అది బేసిక్ మోడలే రూ.12కోట్ల దాకా ఉంటుందని అంచనా. దానికి నీతా కోరిన మరిన్ని హంగులతో అందించేందుకు ఇంకా భారీగానే ఖర్చయి ఉంటుందని చెబుతారు.

\- సెంట్రల్ డెస్క్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బ్యాచిలర్ పెళ్లి కష్టాలు



నారా రోహిత్ కథానాయకుడిగా నూతన దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రం 'సుందరకాండ'. సందీప్ పిక్చర్ ప్యాలెస్ బేనర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి. తాజాగా చిత్ర ట్రైలర్‌ను హీరో ప్రభాస్ లాంచ్ చేశారు. హీరో పెళ్లి కష్టాలు ప్రధానంగా తీర్చిదిద్దిన ట్రైలర్ నవ్వులు పూయించింది. ఓ మధ్య తరగతి బ్యాచిలర్ తనకు కాబోయే భాగస్వామిలో ఐదు మంచి లక్షణాలను వెతకడం చుట్టూ కథ సాగుతుంది. నారా రోహిత్ కామెడీ టైమింగ్ అదిరిపోయింది. ఆయనకు తోడు నరేశ్, సత్య, వీటీవీ గణేశ్, అభినవ్ గోమటం తెరపై వినోదాన్ని పుష్కలంగా పండించారు. ఈ చిత్రానికి డీవోపీ: ప్రదీప్ ఎం వర్మ, సంగీతం: లియోన్ జేమ్స్

అణ్వాయుధం కన్నా ప్రమాదకరం

\-ఆర్. నారాయణమూర్తి




అణ్వాయుధాలతో దాడికన్నా పరీక్షల్లో కాపీయింగ్ మన దేశానికి అత్యంత ప్రమాదకరమని ఆర్. నారాయణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు చదువును ఆస్తిగా ఇవ్వడానికి తల్లిదండ్రులు సర్వస్వాన్ని విద్యాలయాల ఫీజులకే ధారపోస్తున్న దయనీయ స్థితి ఒకవైపు, పేపర్‌లీకేజీలు మరొకవైపు, ప్రైవేటు విద్యాసంస్థల మాఫియా ఇంకోవైపు... ఈ సమస్యలపై తాను ఓ సామాజిక సైనికుడిగా స్పందించి 'యూనివర్సిటీ-పేపర్‌లీకేజీ' సినిమా తీసినట్లు నారాయణమూర్తి వెల్లడించారు. విద్య, వైద్యరంగాలను జాతీయం చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యా సంస్థలను బలోపేతం చేయాలన్న డిమాండ్‌ను ఈ సినిమా బలపరుస్తుందని వివరించారు. ఇదే సినిమాకు మద్దతుగా సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీమ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో సినిమా భావజాలాన్ని సమాజంలోకి తీసుకెళుతున్న ప్రజానటుడు నారాయణమూర్తి అని వక్తలు కొనియాడారు.

పల్లె అందాలతో కన్యాకుమారి




దర్శకరత్న దాసరి నారాయణరావు 1977లో 'కన్యాకుమారి' పేరుతో ఓ చిత్రం రూపొందించారు. అందులో కన్యగా జయమాలిని, కుమారిగా శ్రీవిద్య నటించారు. నాటి ప్రేక్షకులను ఆ చిత్రం ఆకట్టుకుంది. చాన్నాళ్ల తర్వాత ఇప్పుడు అదే టైటిల్‌తో మరో సినిమా వస్తోంది. నటి మధుశాలిని ఈ చిత్రానికి సమర్పకురాలు కావడం విశేషం. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ నటించిన ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో సృజన్ అట్టాడ నిర్మించారు. ఈ నెల 27న వినాయకచవితి సందర్భంగా 'కన్యాకుమారి' చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. 'అన్ ఆర్గానిక్ ప్రేమ కథ' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా టీజర్ ఇప్పటికే ఆకట్టుకుంది. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో పల్లె అందాలు, ఆకట్టుకునే ప్రేమ కథతో ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలిగిస్తుందని దర్శక నిర్మాత చెప్పారు.

నాకంటూ ఓ చరిత్ర ఉంది..



రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సినిమా ఈనెల 27న విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన గ్లింప్స్, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్ విడుదలైంది. రవితేజ పోలీస్ పాత్రలో 'నాకంటూ ఓ చరిత్ర ఉంది'.. అంటూ మాస్ డైలాగులతో అదరగొట్టారు. మాస్ ప్రేక్షకులు మెచ్చే అంశాలతో పాటు వినోదాన్ని మేళవిస్తూ టీజర్‌ను మలిచిన తీరు ఆకట్టుకుంది. శ్రీలీల మరోసారి బలమైన పాత్రలో మెరిసిపోయారు. టీజర్‌లో రవితేజ, శ్రీలీల జోడీ మరోసారి మాయచేసింది.

విచ్చుకత్తుల మధ్య ఒకే ఒక్కడు



నాని హీరోగా నటిస్తున్న యాక్షన్ మూవీ 'ద ప్యారడైజ్'. తను ఇంతకుముందెన్నడూ చేయని పాత్రను ఇందులో నాని పోషిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చెరుకూరి సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' పేరుతో సోమవారం గ్లింప్స్ విడుదల చేశారు. జైలు బ్యాక్ డ్రాప్‌లో సాగే 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' వీడియోలో రామోజీ ఫిల్మ్ సిటీలో 15 రోజుల పాటు షూట్ చేసిన పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ గ్లింప్స్ కనిపించాయి. కత్తులు పట్టుకున్న ఖైదీలు చుట్టుముట్టినప్పటికీ నాని చేతిలో ఎటువంటి ఆయుధం లేకుండా సీట్లో కూర్చుని వారికి సవాల్ విసరడం ఆసక్తికరం. బలమైన క్యారెక్టర్స్ కలిగిన కథతో, అద్భుతమైన విజువల్స్‌తో రూపుదిద్దుకుంటున్న 'ద ప్యారడైజ్' చిత్రం 2026 మార్చి 26న విడుదల కానుంది. మొత్తం ఎనిమిది భాషల్లో చాలా గ్రాండ్‌గా చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

ఎనిమిది పాత్రలతో సైఫై యాక్షన్ థ్రిల్లర్



సీనియర్ నటుడు మురళీమోహన్ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'సుప్రీమ్ వారియర్స్' చిత్రం షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హరిచందన్ దర్శకత్వంలో పెదపూడి బాబూరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో ఓ కీలక పాత్ర కూడా పోషిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు దవళ సత్యం, మురళీమోహన్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ 'ఎన్నారై అయిన బాబూరావు సినిమాల మీద ప్యాషన్‌తో ఇండస్ట్రీలోకి వచ్చారు. ఇందులో నటుడిగానూ ఆకట్టుకోబోతున్నారు. ఆయన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. నిర్మాత బాబూరావు మాట్లాడుతూ 'రెండేళ్ల నుంచి ఈ కథ మీద వర్క్ చేస్తున్నాం. సైఫై యాక్షన్ థ్రిల్లర్‌గా చిత్రం రూపుదిద్దుకుంటుంది. పేరున్న హీరోలు ఇందులో నటిస్తారు. అందరినీ ఆశ్చర్యపరిచేలా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఎనిమిది పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. మిలటరీ, ఆర్మీకుటుంబాల ఎమోషన్స్ ఎక్కువగా ఉంటాయి. రెండున్నర ఏళ్లుగా స్క్రిప్ట్ మీద పని చేస్తున్నాం' అని చెప్పారు దర్శకుడు హరిచందన్.

నేటితో సమ్మెకు ముగింపు?

తెలుగు చిత్ర పరిశ్రమలో సోమవారం పూర్తిస్థాయి బంద్ జరిగింది. ఇప్పటి వరకు 30 శాతం వేతనాలు పెంచుతామన్న నిర్మాతల షూటింగ్‌లు జరగగా.. సోమవారం నుంచి అవి కూడా నిలిచిపోయాయి. కాగా, కొందరు నిర్మాతలు ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను కలిశారు. మరోవైపు హైదరాబాద్‌లో తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రితో ఫెడరేషన్ సభ్యులు సమావేశమయ్యారు.

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సమస్యల పరిష్కారానికి కమిటీ



సినిమా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఒక కమిటీని ఏర్పాటుచేయనున్నామని, ఈ కమిటీ అన్ని పక్షాలతో, అందరితో చర్చించేలా చర్యలు తీసుకుంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో నిర్మాతలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినీ కార్మికుల సమ్మెతో షూటింగ్‌లు నిలిచిపోయాయని, సమస్యల పరిష్కారానికి సమ్మె సరైన మార్గంకాదని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం నుంచి షూటింగ్స్ పునఃప్రారంభమవుతాయంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందని, అదే సమయంలో పరిశ్రమలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనలో ఉందన్నారు. సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు, హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా పాల్గొన్నారు.

అన్ని వివరాలు మంత్రికి చెప్పాం: ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు

తమ సమస్యలు, పరిష్కారానికి సంబంధించిన విషయాలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వివరించామని ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు తెలిపారు. మంగళవారం భేటీలో అంతిమ నిర్ణయం వెలువడుతుందన్నారు. సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వస్తానని చెప్పారని అన్నారు. తమ తరపున కమిటీ సభ్యులు హాజరవుతారని చెప్పారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

త్వరలో నూతన ఫిల్మ్ పాలసీ



రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం త్వరలో నూతన ఫిల్మ్ పాలసీని తెస్తున్నామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. ఈ ఏడాది నంది అవార్డులిస్తామని ప్రకటించారు. సోమవారం అమరావతి సచివాలయంలో పలువురు తెలుగు సినీ నిర్మాతలు ఆయనతో భేటీ అయ్యారు. సినిమా రంగ సమస్యలపై రూపొందించిన డాక్యుమెంట్‌ను మంత్రికి అందజేశారు. సినీ పరిశ్రమకు సంబంధించిన 24 విభాగాల అభివృద్ధిపై చర్చించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. వారిద్దరి అపాయింట్‌మెంట్లు ఇప్పించాలని కోరుతూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, గౌరవ కార్యదర్శి దామోదర ప్రసాద్ మంత్రికి విజ్ఞాపన అందజేశారు. రాష్ట్రంలో సినిమా షూటింగులు, కొత్త సినిమాల విడుదల, నూతన ఫిల్మ్ పాలసీ తదితర అంశాలపై నిర్మాతలతో మంత్రి చర్చించారు. సెప్టెంబరు మొదటి పక్షంలో సీఎం, డిప్యూటీ సీఎంతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

నిర్మాతలెవరూ సంతోషంగా లేరు



నిర్మాతలెవరూ సంతోషంగా లేరని, తాము బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుందని అన్నారు పలువురు చిన్న నిర్మాతలు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నిర్మాతలు ఎస్‌కేఎన్, ధీరజ్, రాజేశ్ దండా, ప్రైమ్‌షో చైతన్య, ఛాయ్ బిస్కట్ శరత్, అనురాగ్, మధుర శ్రీధర్, మహేశ్వర్‌రెడ్డి, రాకేశ్ వర్రె తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్ దండా మాట్లాడుతూ 'చిన్న నిర్మాతలు బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న మాకు వేతనాలు పెంచాలంటూ కార్మికులు చేస్తున్న సమ్మె మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. మా సినిమా దీపావళికి విడుదల చేయాలనుకున్నాం. ఇప్పుడు బంద్ వల్ల షూటింగ్ ఆపేయాల్సి వచ్చింది' అని అన్నారు. మధుర శ్రీధర్ మాట్లాడుతూ 'ఒక సీన్ చిత్రీకరణకు జనరేటర్ పెట్టాలన్నా యూనియన్ అనుమతి కావాలి. హీరో, ఫ్రెండ్ సీన్ కోసం మేకప్, కాస్ట్యూమ్స్ వాళ్లకు వడ్డించే ప్రొడక్షన్... ఇలా 80 మందిని పెట్టుకోవాలి. చిన్న నిర్మాతలకు ఇది పెనుభారం' అని అన్నారు.





ఈక్విటీ ఫండ్లలోకి నిధుల వరద



జూలైలో రూ.42,702 కోట్ల రాక .. జూన్‌తో పోలిస్తే 81 శాతం వృద్ధి

- సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి ఇది
- రూ.28,464 కోట్లతో సిప్ రికార్డ్
- రూ.75 లక్షల కోట్లు దాటిన మొత్తం ఫండ్ల ఆస్తుల విలువ

న్యూఢిల్లీ: జూలై నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాల్లో నికర పెట్టుబడులు సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.42,702 కోట్లకు పెరిగాయి. ఈ జూన్‌లో నమోదైన రూ.23,578 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఏకంగా 81 శాతం వృద్ధి నమోదైంది. గత నెలలో ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులకు లోనైన తరుణంలోనూ ఈ విభాగ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి రికార్డు స్థాయిలో కొత్త పెట్టుబడులు రావడం గమనార్హం. థీమాటిక్, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలో పెట్టుబడులు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. కాగా, ఈక్విటీ ఫండ్ పథకాల్లోకి నికర పెట్టుబడులు రావడం వరుసగా ఇది 53వ నెల అని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) సోమవారం తన నివేదికలో వెల్లడించింది. "సుంకాల పోరు నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు పెరిగినప్పటికీ, భారత వృద్ధికి ఢోకా లేదనడానికి ఈక్విటీల్లోకి పెరిగిన నిధుల వరదే నిదర్శనం. దిగివచ్చిన ధరలు (ద్రవ్యోల్బణం), మెరుగైన ద్రవ్య లభ్యత, పెరిగిన కుటుంబ ఆదా వంటి అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయ"ని యాంఫీ సీఈఓ వెంకట్ ఎన్ చలసాని అన్నారు. మరిన్ని విషయాలు..

- మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి క్రమానుగత పెట్టుబడులూ (సిప్) సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. గత నెలలో ఫండ్ మదుపరులు రూ.28,464 కోట్లు సిప్ చేశారు. అంతక్రితం నెలలో నమోదైన రూ.27,269 కోట్ల సిప్‌లతో పోలిస్తే 4 శాతం అధికం ఇది.
- ఈ జూన్‌లో డెట్ ఫండ్ల నుంచి నికరంగా రూ.1,711 కోట్లు వెనక్కి తీసుకున్న ఇన్వెస్టర్లు.. జూలైలో ఏకంగా రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. లో డ్యూరేషన్, మనీ మార్కెట్ ఫండ్లతో పాటు లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్లలో భారీగా కొత్త పెట్టుబడులు రావడం ఇందుకు తోడ్పడింది.
- గత నెలలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి నికరంగా రూ.1,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం నెలలో వచ్చిన రూ.2,081 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే మాత్రం గణనీయంగా తగ్గాయి. అయితే, వీటిల్లోకి నికర పెట్టుబడులు రావడం వరుసగా ఇది మూడో నెల.
- మొత్తంగా జూలైలో ఎంఎఫ్ ఇండస్ట్రీలోకి రూ.1.8 లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు వచ్చాయి. జూన్‌తో పోలిస్తే 49,000 కోట్లు, మే నెలలో వచ్చిన దానికంటే రూ.29,000 కోట్లు అధికం. తత్ఫలితంగా దేశంలోని మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) జూలైలో 1.3% పెరిగి రూ.75.36 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇండస్ట్రీ ఏయూఎం రూ.75 లక్షల కోట్ల మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. జూన్‌లో ఇది రూ.74.4 లక్షల కోట్లుగా నమోదైంది.

కనీస నిల్వ నిర్ణయం.. బ్యాంకుల ఇష్టం

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



గొజారియా (గుజరాత్): బ్యాంకులకు పొదుపు ఖాతాల కనీస నగదు నిల్వ పరిమితిని నిర్ణయించే స్వేచ్ఛ ఉందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఇది ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో రెండో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ తన పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిని 10,000 నుంచి ఏకంగా రూ.50,000కు పెంచడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గుజరాత్‌లోని గొజారియా గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఓ ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మల్హోత్రాను మీడియా వర్గాలు ఇదే విషయంపై ప్రశ్నించాయి. "పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిపై నిర్ణయాన్ని ఆర్‌బీఐ ఆయా బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు కనీస నిల్వను రూ.10,000గా నిర్ణయించగా.. మరికొన్ని రూ.2,000కు పరిమితం చేశాయి. ఈ మధ్యనే కొన్ని బ్యాంకులు పరిమితిని పూర్తిగా ఎత్తివేశాయి. ఇది ఆర్‌బీఐ నియంత్రణలో లేని అంశ"మని మల్హోత్రా సమాధానమిచ్చారు.

ఆర్థిక శాఖకు లేఖ రాసిన బీబీడీబీఎం: ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నిర్ణయాన్ని బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్ (బీబీడీబీఎం) తప్పుపట్టింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ కేంద్ర ఆర్థిక శాఖకు ఈ సంస్థ లేఖ కూడా రాసింది. ఈ అన్యాయమైన, తిరోగమన నిర్ణయం బ్యాంకింగ్ సేవల సమ్మిళితం, వృద్ధి లక్ష్యాలకు విఘాతమని లేఖలో పేర్కొంది.

ప్రభుత్వ బ్యాంకుల్లో కనీస నిల్వ పరిమితి ఎత్తివేత: ఎస్‌బీఐ సహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ).. పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిని ఎత్తివేశాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు వెల్లడించారు. దేశంలో ఆర్థిక సేవలను అందరికీ అందుబాటులో తేవాలన్న లక్ష్యాన్ని ప్రోత్సహించేందుకు కొన్ని పీఎస్‌బీలు ఈ పరిమితిని తగ్గించాయని లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

హైదరాబాద్‌లో జెడ్ఎస్ కార్యాలయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, టెక్నాలజీ సంస్థ జెడ్ఎస్ హైదరాబాద్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించింది. హైటెక్ సిటీలోని రహేజా ఐటీ పార్క్‌లో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో 500-600 మంది ఉద్యోగులు పని చేయవచ్చని జెడ్ఎస్ వెల్లడించింది. దేశంలోని హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ జీసీసీల కోసం తన సర్వీస్ సామర్థ్యాలు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపింది. హైదరాబాద్‌లో తాము కార్యకలాపాలు ప్రారంభించిన ఏడాది లోగానే ఈ వ్యూహాత్మక విస్తరణ కూడా చేపట్టినట్టు కంపెనీ రీజినల్ మేనేజింగ్ ప్రిన్సిపల్ మోహిత్ సూద్ తెలిపారు. అమెరికాలోని ఇవాన్‌స్టన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జెడ్ఎస్ ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న 35 కార్యాలయాల్లో 13,000 మంది పని చేస్తున్నారు. భారత్‌లోని పుణె, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, నోయిడా కార్యాలయాల్లో 10,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	520
వరంగల్	482	గోదావరి	510
చిత్తూరు	543	విశాఖపట్నం	515
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	109
వరంగల్	100	గుంటూరు	114
కరీంనగర్	100	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	90
కర్నూలు	100	నెల్లూరు	95
విశాఖపట్నం	104	అనంతపురం	95
గోదావరి	109		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,280 ▼	93,750 ▼	1,27,000 ▲
విజయవాడ	1,03,000 ▼	97,000 ▼	1,16,900 ▼
విశాఖపట్నం	1,02,900 ▼	93,750 ▼	1,27,000 ▲
రాజమండ్రి	1,02,200 ▼	93,750 ▼	1,17,900 ▼
ప్రొద్దుటూరు	1,00,700 ▼	92,640 ▼	1,17,100 ▼
ముంబై	99,957 ▼	91,561 ▼	1,13,501 ▼

కేజీ బేసిన్‌లో ఓఎన్‌జీసీ రూ. 4,600 కోట్ల పెట్టుబడి

10 బావుల అభివృద్ధి, ఆఫ్‌షోర్ పైప్‌లైన్ ఏర్పాటు

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లో చేపడుతున్న పలు ప్రాజెక్టులపై రూ.4,600 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 10 బావులు తవ్వడంతో పాటు రెండు అన్‌మ్యాన్డ్ ప్లాట్‌ఫారాలు, ఒక ఆఫ్‌షోర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయనుంది. దీనికి తోడు ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాలో ఒక ఆన్‌షోర్ గ్యాస్ ప్రాసెసింగ్ యూనిట్ కూడా ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టులకు తాజాగా పర్యావరణపరమైన అనుమతులివ్వాలని పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖను ఓఎన్‌జీసీ కోరింది. ఈ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పని చేస్తున్న నిపుణుల అప్రైజల్ కమిటీ (ఈఏసీ) జూలై 24వ తేదీన నిర్వహించిన సమావేశం తీర్మానాల్లో ఈ అంశాలున్నాయి. తూర్పు కోస్తాలో 697 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల కేజీ/ఓఎస్‌డీఎస్ఎఫ్/చంద్రిక/2021 (చంద్రిక), 148 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల కేజీ/ఓఎస్‌డీఎస్ఎఫ్/జీఎస్49 /2021 ఆఫ్‌షోర్ ఆయిల్ అండ్ గ్యాస్ కాంట్రాక్ట్ ప్రాంతాలకు 2022 సెప్టెంబరులో డీఎస్ఎఫ్-3 (కనుగొన్న చిన్న క్షేత్రం-3) కింద డైరెక్టర్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ఓఏ) జారీ చేశారు. ఈ ప్రాజెక్టుకు 26.3 హెక్టార్ల (ఓడల రేవు టెర్మినల్) భూమి అవసరమవుతుందని, అందులో 8.7 హెక్టార్లలో (మొత్తం ప్రాజెక్టు ప్రదేశంలో 33%) హరిత ప్రాంతాలను అభివృద్ధి చేస్తారని ఈఏసీ తెలిపింది. పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ) పెట్టుబడి వ్యయం రూ.14 కోట్లు కాగా దీనిపై ఏడాదికి రూ.3 కోట్ల ఈఎంపీ వ్యయం కూడా భరించాల్సి ఉంటుంది. వాణిజ్యపరంగా లాభదాయకమైన నిల్వలున్నట్టు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే ఈ బావులు తవ్వారు. ఈ ప్రాజెక్టు ద్వారా 150 మందికి ప్రత్యక్ష ఉపాధి, 310 మందికి పరోక్ష ఉపాధి లభించనుంది.

మార్కెట్లో ఊరట ర్యాలీ

- 746 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- రూ.3.50 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: వరుసగా ఆరు వారాలుగా నష్టపోతూ మూడు నెలల కనిష్ఠానికి జారుకున్న ఈక్విటీ సూచీలకు సోమవారం కాస్త ఊరట లభించింది. ఇంధన, వాహన, బ్యాంకింగ్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు వాల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో మార్కెట్ మళ్లీ లాభాల్లో పయనించింది. సెన్సెక్స్ 746.29 పాయింట్ల వృద్ధితో 80,636.05 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 221.75 పాయింట్ల లాభంతో 24,585.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.5 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.444.13 లక్షల కోట్లకు చేరుకుంది. అమెరికా మార్కెట్ల సానుకూల సంకేతాలు, వరుసగా అమ్మకాలకు పాల్పడుతూ వచ్చిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మళ్లీ మన మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలపరిచిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నెల 15న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగిసేందుకు ఈ సమావేశం బాటలు వేయనుందన్న అంచనాలూ మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి.

అఫర్డబుల్ ఇళ్ల అమ్మకాలకు ట్రంప్ గ్రహణం

న్యూఢిల్లీ: భారతీయ ఉత్పత్తులపై అమెరికా భారీ సుంకాలు విధించిన నేపథ్యంలో దేశంలో అఫర్డబుల్ ఇళ్ల అమ్మకాలు తగ్గే అవకాశం కనిపిస్తోంది. అమెరికా సుంకాలతో చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు (ఎంఎస్ఎంఈ), వాటి సిబ్బంది ఆదాయాలు క్షీణించి అఫర్డబుల్ రియల్టీపై ప్రభావం పడుతుందని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. రూ.45 లక్షల లోపు విలువ గల ఇళ్ల కొనుగోలుదారుల్లో అధిక శాతం మంది ఎంఎస్ఎంఈ ఉద్యోగులు, చిన్న వ్యాపారాలు చేసే వారే కావడం ఇందుకు కారణం. అమెరికాకు వస్తు ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈ ఉత్పత్తులే అధికంగా ఉంటాయి. వీటిపై అధిక సుంకాలు విధిస్తే మార్కెట్లో వాటి పోటీ సామర్థ్యం తగ్గుతుంది. ఫలితంగా వ్యాపార ఆర్డర్లు తగ్గి ఆయా కంపెనీల్లో పని చేసే సిబ్బంది ప్రతికూలంగా ప్రభావితం అవుతారని అనరాక్ రీసెర్చ్ అండ్ అడ్వైజరీ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ ఠాకూర్ అన్నారు. వాస్తవానికి కొవిడ్-19 తర్వాత అఫర్డబుల్ ఇళ్ల అమ్మకాలు, కొత్త ప్రాజెక్టులు కూడా తగ్గిపోయాయి. 2025 ప్రథమార్థంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 1.9 లక్షల ఇళ్లు అమ్ముడుపోగా వాటిలో అఫర్డబుల్ ఇళ్లు 34,565 మాత్రమే ఉన్నాయి.

- *హైదరాబాద్‌కు చెందిన క్లైమెట్ టెక్ స్టార్టప్ సా అండ్ రీప్ ఆగ్రో.. వరి సాగులో వినూత్నమైన పద్ధతులను అవలంబించినందుకు గాను గోల్డ్ స్టాండర్డ్ నుంచి కార్బన్ క్రెడిట్స్‌ను అందుకుంది. వరి సాగులో కార్బన్ క్రెడిట్స్‌ను అందుకున్న తొలి భారతీయ కంపెనీ ఇదే కావటం విశేషం. కోషెర్ క్లైమెట్ భాగస్వామ్యంలో ఆల్టర్నేటివ్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ (ఏడబ్ల్యూడీ) విధానంలో చేపట్టిన 'వారీ' ప్రాజెక్ట్ 37,405 కార్బన్ క్రెడిట్స్‌ను కంపెనీ దక్కించుకుంది. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో లక్ష ఎకరాల్లో వరి సాగు చేస్తున్న 35,000 మంది రైతులు కంపెనీకి చెందిన వారీ ప్రాజెక్టులో ఉన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులు.. వరి సాగులో నీరు, ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గిచటంతో పాటు పంట దిగుబడిని పెంచుకోవటమే కాకుండా కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించగలిగారని సా అండ్ రీప్ ఆగ్రో వెల్లడించింది.*

స్పోర్ట్స్

అడ్డంకులను అధిగమిస్తాం

మహిళల వన్డే వరల్డ్‌కప్‌పై హర్మన్‌ప్రీత్



'యువరాజ్‌ను చూసి నేనెంతో ప్రేరణ పొందుతా' అని హర్మన్ తెలిపింది.

ముంబై: ఈ ఏడాది భారత్, శ్రీలంకల్లో ప్రతిష్ఠాత్మక మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగబోతోంది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు జరిగే ఈ టోర్నీ 50 రోజుల కౌంట్‌డౌన్‌తో పాటు ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఇందులో ఐసీసీ అధ్యక్షుడు జైషా, సీఈవో సంజోగ్ గుప్తా, బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, మిథాలీ రాజ్‌తో పాటు భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ పాల్గొన్నారు. అయితే 1973 నుంచి జరుగుతున్న ఈ మెగా టోర్నీలో భారత జట్టు విజేతగా నిలువలేకపోయింది. 2005, 2017లో మాత్రం రన్నరప్‌గా నిలిచింది. అందుకే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కప్‌పై ధీమాను వ్యక్తపరుస్తోంది. 'ఈసారి మాత్రం అన్ని అడ్డంకులను అధిగమించి, భారత అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న కప్‌ను సాధిస్తాం. దేశం కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటాం. అలాగే

దేశం కోసం...: యువీ

దేశం కోసం మ్యాచ్‌లను గెలవాలనే కసి ప్రతీ ప్లేయర్‌లో ఉండాలని మాజీ ఆటగాడు యువరాజ్ సింగ్ సూచించాడు. 'చరిత్ర సృష్టించేందుకు మీకిదే అద్భుత అవకాశం. కానీ ఆరంభం నుంచే అంచనాలు పెట్టుకోకుండా పరిస్థితులకు తగ్గట్టు ఆడండి. ఫలితాలు అవే వస్తాయి. మీ అనుభవంపై నమ్మకం పెట్టుకోండి. ఎలాంటి స్థితిలోనైనా దేశం కోసం గెలవాలనే తపనను వీడకండి' అని మహిళా జట్టుకు ఉద్బోధించాడు.

బెంగళూరు మ్యాచ్‌లపై అస్పష్టత

వరల్డ్‌కప్‌లో ఐదు మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సిన బెంగళూరు చిన్నస్వామి స్టేడియంపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. జూన్ 4న అక్కడ జరిగిన తొక్కిసలాట కారణంగా స్టేడియంలో మ్యాచ్‌లపై కర్ణాటక ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే అనుమతి కోసం కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందనలేదు. ఒకవేళ అక్కడ మ్యాచ్‌లు జరుగకపోతే వైజాగ్, గువాహటిలకు తరలించే చాన్సుంది. అయితే పాకిస్థాన్‌తో పాటు కొన్ని ఇతర జట్ల మ్యాచ్‌లకు శ్రీలంక కూడా ఆతిథ్యం ఇవ్వనుంది.

క్రీడా బిల్లుకు గ్రీన్ సిగ్నల్

లోక్‌సభ ఆమోదం

- దేశ క్రీడా రంగంలో అతిపెద్ద సంస్కరణ
- మంత్రి మన్‌సుఖ్ మాండవ్య
- డోపింగ్ నిరోధక సవరణ బిల్లుకూ ఓకే



న్యూఢిల్లీ : జాతీయ క్రీడా పరిపాలన బిల్లు (ఎన్ఎస్‌జీబీ)ను లోక్‌సభ సోమవారం ఆమోదించింది. స్వాతంత్ర్యం తర్వాత దేశ క్రీడా రంగంలో తీసుకొచ్చిన ఏకైక అతి పెద్ద సంస్కరణగా ఈ బిల్లును కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య అభివర్ణించారు. బిహార్‌లో ఎన్నికల జాబితాలో సవరణలపై ప్రతిపక్షం వ్యక్తంజేస్తున్న నిరసనల మధ్యే క్రీడా బిల్లును సభ ఆమోదించడం గమనార్హం. అలాగే జాతీయ డోపింగ్ నిరోధక (ఎన్‌ఏడీ) సవరణ బిల్లుకూ లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 'స్వాతంత్ర్యం వచ్చాక క్రీడల్లో చేపట్టిన అతి పెద్ద సంస్కరణ ఈ బిల్లు. క్రీడా సమాఖ్యలలో జవాబుదారీతనం, అథ్లెట్లకు న్యాయం చేకూర్చడంతో పాటు ఉత్తమ పరిపాలనను ఈ బిల్లు అందిస్తుంది' అని విపక్ష సభ్యుల నినాదాల మధ్య మాండవ్య ప్రకటించారు. బిహార్ ఎన్నికల జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం ముట్టడికి వెళ్లిన నేపథ్యంలో.. లోక్‌సభలో క్రీడా బిల్లు ఆమోదం సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతలెవరూ లేరు. అయితే తర్వాత ఇద్దరు విపక్ష ఎంపీలు బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొంటూ తమ మద్దతు తెలిపారు. నిరసన కార్యక్రమం తర్వాత సభలో ప్రవేశించిన విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్యనే 'వాయిస్ ఓటు'తో క్రీడా బిల్లును సభ ఆమోదించింది.

ప్యానెల్‌కు నివేదించాలి: దిగ్విజయ్ సింగ్

అంతకుముందు..క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ చైర్మన్ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ క్రీడా పరిపాలన బిల్లును పార్లమెంటరీ ప్యానెల్‌కు పంపాలని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాను కోరారు. ఈ బిల్లును ప్యానెల్ కూలంకషంగా పరిశీలించడంతోపాటు చర్చించిన అనంతరమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డారు. అయితే దేశ క్రీడా రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతోపాటు 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రయత్నిస్తున్న తరుణంలో ప్రపంచ స్థాయి క్రీడా సంస్కృతిని ప్రవేశపెట్టేందుకు ఈ రెండు బిల్లులు ఎంతో కీలకమైనవని మాండవ్య చెప్పారు. 'దేశ క్రీడా రంగంలో సంస్కరణలకోసం 1975 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1985లో మేం తొలి ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టాం. కానీ వ్యక్తిగత లబ్ధి కోసం క్రీడలను కూడా రాజకీయం చేశారు. ఈ బిల్లును ముందుకు తెచ్చేందుకు గతంలో క్రీడా మంత్రులు ప్రయత్నించారు. కానీ సఫలం కాలేకపోయారు' అని మాండవ్య వివరించారు.

బిల్లులోని ముఖ్యాంశాలు..

- సివిల్ కోర్టు అధికారాలతో నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్ (ఎన్ఎస్‌టీ) ఏర్పాటు చేస్తారు.
- నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్ఎస్‌బీ) ఏర్పాటు కానుంది.
- ఎన్నికలు నిర్వహించని జాతీయ క్రీడా సమాఖ్యల గుర్తింపును రద్దు చేసే అధికారాన్ని ఎన్ఎస్‌బీ కలిగి ఉంటుంది.
- నేషనల్ స్పోర్ట్స్ ఎలక్షన్ ప్యానెల్ ఏర్పాటు కానుంది.
- బీసీసీఐ మినహా గుర్తింపు పొందిన అన్ని క్రీడా సమాఖ్యలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి రానున్నాయి.


ఐఓసీతో నిరంతర చర్చలు

2036 ఒలింపిక్స్ నిర్వహణ బిడ్డింగ్‌కు సంబంధించి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) 'ఫ్యూచర్ హోస్ట్ కమిటీ'తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు మంత్రి మాండవ్య తెలిపారు. ఆప్ సభ్యుడు గుర్మీత్‌సింగ్ లోక్‌సభలో సోమవారం అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

నేను హైదరాబాదీనే

ఇక్కడ ఇల్లు కూడా ఉంది

'ఆంధ్రజ్యోతి'తో దిగ్గజ వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణీ



తాను హైదరాబాదీనేనని, తనకు నగరంలో ఇల్లు కూడా ఉందని టీమిండియా దిగ్గజ వికెట్‌కీపర్, 1983 వరల్డ్‌కప్ హీరోల్లో ఒకరైన సయ్యద్ కిర్మాణీ తెలిపాడు. క్రికెట్‌లో తన అనుభవం, నైపుణ్యాలను ఉపయోగించుకోవాలని భావిస్తే, తనకు అంతకంటే సంతోషం ఇంకేముంటుందన్న ఆయన.. తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్నాడు. 'ఆంధ్రజ్యోతి'తో కిర్మాణీ చెప్పిన మరిన్ని విశేషాలు ఆయన మాటల్లోనే..

మా విజయం చిరస్మరణీయం

1983లో మేం వన్డే వరల్డ్‌కప్ గెలుస్తామని కలలో కూడా అనుకోలేదు. ఆ విశ్వకప్ భారత క్రికెట్‌కు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులకు గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆ విజయం దేశంలో క్రికెట్ రూపురేఖలను సమూలంగా మార్చేసింది. అప్పటివరకు క్రికెట్‌ను ఒక ఆటగానే చూసిన భారతీయులు వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత క్రికెట్‌ను ఒక మతంగా ఆరాధించడం ప్రారంభించారు.

సరైన హెల్మెట్లు లేకుండానే..

సరైన హెల్మెట్లు, రక్షక కవచాలు లేకుండానే ప్రపంచంలోని మేటి పేస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. మాల్కం మార్షల్, మైకేల్ హోల్డింగ్, ఆండీ రాబర్ట్స్ బంతులు బుల్లెట్లలా దూసుకొచ్చేవి. వారి బౌలింగ్‌లో ఆడడాన్ని ఆస్వాదించేవాడిని కానీ భయపడే వాడిని కాదు. ఎందుకంటే జీవితంలో దేనికి భయపడినా మనం ఓడిపోయినట్టే. యువ క్రికెటర్లకు కూడా నేనిచ్చే సలహా ఒక్కటే. భయం లేకుండా తెగువతో స్వేచ్ఛగా ఆడితే తప్పకుండా కెరీర్‌లో విజయం సాధిస్తారు.

నగరంతో అనుబంధం.. ప్రత్యేకం

నా ప్రాథమిక విద్యాభ్యాసం హైదరాబాద్‌లోనే జరిగింది. ఆల్ సెయింట్స్ స్కూల్‌లో నాలుగో తరగతి వరకు చదివా. ఇప్పటికీ మల్లేపల్లిలో మాకు ఇల్లు ఉంది. మా నాన్నగారు అప్పటి నిజాం ప్రభుత్వ సచివాలయంలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసేవారు. 1955లో నాన్న ఉద్యోగ రీత్యా మా కుటుంబం మైసూర్ వెళ్లింది. మా కిర్మాణీ వంశీయులు, బంధువులు ఇక్కడే ఉండడంతో హైదరాబాద్‌కు తరచూ వస్తుంటాం. నన్ను నేను హైదరాబాదీగానే భావిస్తా.

తెలంగాణ కోసం సిద్ధం..

గతంలో బెంగుళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో పనిచేశా. కర్ణాటక క్రికెట్ బోర్డులోనూ సేవలందించా. నా అనుభవం, నైపుణ్యాలు తెలంగాణ క్రికెట్‌కు పనికొస్తాయని అనుకుంటే, మెంటార్‌గా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నా.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

స్నేహిత్‌కు కాంస్యం



వడోదర: జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్ టోర్నీలో ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్ పతకం దక్కించుకున్నాడు. సోమవారం జరిగిన సింగిల్స్ సెమీస్‌లో స్నేహిత్ 9-11, 12-14, 12-10, 10-12, 9-11తో రోనిత్ చేతిలో ఓటమిపాలై కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. కాగా సింగిల్స్ టైటిల్‌ను మానుష్ షా గెలిచాడు.

అర్జున్‌కు డ్రా

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీలో అర్జున్ ఇరిగేసికి మరో డ్రా ఎదురైంది. సోమవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో సహచరుడు ప్రణవ్‌తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 78 ఎత్తుల అనంతరం ప్రణవ్‌తో డ్రాకు అంగీకరించాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో కార్తికేయన్ మురళి, అవోండర్ లియాంగ్ (అమెరికా)తో నిహాల్ సరీన్ తన గేమ్‌లను డ్రా చేసుకొన్నారు. కాగా, చాలెంజర్స్‌లో ద్రోణవల్లి హారికకు నాలుగో ఓటమి ఎదురైంది. అభిమన్యు పురానిక్ చేతిలో హారిక, హర్షవర్ధన్ చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.

సిరాజ్ ఏం తింటాడో?

డేవిడ్ గోవర్ ఆసక్తి





లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల్లోనూ పూర్తి ఫిట్‌నెస్‌తో బరిలోకి దిగడమే కాకుండా.. వికెట్ల వేటలోనూ అదరగొట్టిన భారత పేసర్ మహ్మద్ సిరాజ్‌పై ఆ దేశ మాజీ కెప్టెన్ డేవిడ్ గోవర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ముఖ్యంగా అతని ఫిట్‌నెస్ అబ్బురపరిచిందని తెలిపాడు. 'సిరాజ్ అసలు ఏం తింటాడు? ఏం తాగుతాడనే విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నా. ఎందుకంటే వాటిని ఇంగ్లండ్ బౌలర్లకు అందివ్వాలి. సిరీస్‌లో ఏ టెస్టునూ వదలకుండా అన్నింట్లో బరిలోకి దిగాడు. చివరి టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో 30 ఓవర్లకు పైగా బౌలింగ్ చేసినా అతనిలో అలసటనేదే కనిపించలేదు. గెలిచి తీరాలన్న కసితో పాటు ఫిట్‌నెస్‌లోనూ ఆదర్శంగా నిలిచాడు. మా ఇంగ్లండ్ బౌలర్లు మాత్రం కొంతకాలంగా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నారు' అని గోవర్ వివరించాడు.

రితికకు స్వర్ణం

ఆసియా బాక్సింగ్



బ్యాంకాక్: ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్ అండర్-22 విభాగంలో చివరి రోజు భారత్ స్వర్ణ పతకం అందుకుంది. సోమవారం జరిగిన మహిళల 80+ కిలోల ఫైనల్లో కజకిస్థాన్ బాక్సర్ అసెల్ టొక్టాసిన్‌ను ఓడించిన రితిక విజేతగా నిలిచింది. యాత్రీ పటేల్ (57 కిలోలు), ప్రియ (60 కిలోలు) తుదిపోరులో ఓటమితో రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. అలాగే ఫైనల్లో ఓడిన నీరజ్ (75 కిలోలు), ఇషాన్ (90+ కిలోలు) కూడా రజత పతకాలతో వెనుదిరిగారు.

ఫోన్‌ట్యాపింగ్ చేసిన వారికి శిక్ష తప్పదు

» విచారణలో రాజకీయ జోక్యం ఉండదు

» మీడియాతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కరీంనగర్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్‌తో చాలా పెద్ద తప్పు చేసిందని, దీనిపై తమ ప్రభుత్వం విచారణ జరిపిస్తున్నదని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. విచారణల్లో అన్ని విషయాలు పూర్తి స్థాయిలో వెల్లడవుతాయని, ఇందులో రాజకీయ జోక్యం ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుపుతున్న అధికారుల బృందం ఎవరిని విచారించాలనేది నిర్ణయిస్తుందని చెప్పారు. సోమవారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించి డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. రైతులకు న్యాయం చేసే విషయంలో తాము వెనుకడుగువేయబోమన్నారు. బీసీల రిజర్వేషన్ల బిల్లుపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు ఢిల్లీ ధర్నాలో ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం బిల్లు పార్లమెంట్‌లో 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అతి త్వరలో కార్యాచరణ ఉంటుందన్నారు. పారిశ్రామిక కారిడార్‌కు కేంద్రం ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు ప్రకటించిందని, దానికి అనుకూలంగా హైదరాబాద్, కరీంనగర్‌లో రాజీవరహదారి నుంచి రెండు గంటల్లో హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకునే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

14న నెక్లెస్ రోడ్డులో భారీ తిరంగా ర్యాలీ

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు



హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 14న ఉదయం 10 గంటలకు నెక్లెస్ రోడ్డులో కళాశాల విద్యార్థులతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. పార్టీలకు అతీతంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు గడచిన ఐదేళ్లుగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీపరంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి. మనోహర్‌రెడ్డి చైర్మన్‌గా, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, అధికార ప్రతినిధి రాణి రుద్రమ, బీజేవైఎం అధ్యక్షులు చేవెళ్ల మహేందర్ సభ్యులుగా ఏర్పాటయిన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగాలో భాగంగా 40 లక్షల ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేస్తామన్నారు. విభజన సందర్భంగా చోటు చేసుకున్న విషాద ఘట్టాలను తెలియజేసేందుకు 14న విభజన దినంగా పరిగణిస్తామని, ఈ సందర్భంగా మౌన ర్యాలీలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు వివరించారు.

ఉప ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

» అధిష్ఠానం నాకిచ్చిన హామీని ప్రజలకు వివరించారు

» ప్రజలకిచ్చిన హామీలను సర్కారు అమలు చేయాలి

» ఎక్స్ వేదికగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తానన్న హామీని మీడియా ద్వారా ప్రజలకు వివరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా తన వ్యాఖ్యలను పోస్ట్ చేశారు. "కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నాకు మంత్రి పదవి ఇస్తామన్న హామీని అమలు చేయకుండా రాష్ట్ర ముఖ్య నేతలు అడ్డుకుంటూ, అవమానిస్తున్న విషయాన్ని మీడియా ద్వారా ప్రజలకు వివరించిన మీకు ధన్యవాదాలు. నాకు మంత్రి పదవి ముఖ్యం కాదు.. ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలి. అవినీతి రహిత పాలన అందించాలి. తెలంగాణ సమాజ ఆకాంక్షలను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉండాలని ఆశిస్తున్నాను" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. తన వ్యాఖ్యలకు సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన భట్టి విక్రమార్క క్లిప్పింగ్‌ను కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జతచేశారు.

ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత కన్నుమూత

» ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలుగా సేవలు

» కాకతీయ మెడికల్ కాలేజీకి నేడు భౌతికకాయం అప్పగింత



హైదరాబాద్ సిటీ, వరంగల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత(67) ఇకలేరు. అవివాహిత అయిన ఆమె హనుమకొండలోని ఓ వసతి గృహంలో నివసిస్తూ సోమవారం తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలోనే తుదిశ్వాస విడిచారు. హనుమకొండలో ఆమె పుట్టి పెరిగారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ రాజనీతి శాస్త్రం అభ్యసించారు. అదే వర్సిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందారు. కాళోజీ స్ఫూర్తితో 1973లో చైతన్యం పడగెత్తింది రచనతో సాహిత్య సృజన ప్రారంభించారు. కవిత్వం, కథ, వ్యాస, గేయ ప్రక్రియల్లో పలు రచనలు చేశారు. తన అర్థశతాబ్దపు ప్రయాణంలో దాశరథి, కాళోజీ, సి.నారాయణ రెడ్డి లాంటి ప్రముఖుల ప్రశంసలు అందుకొని కవయిత్రిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించారు. ఇప్పటి వరకు 13 పుస్తకాలను ముద్రింప చేశారు. తెలంగాణ మలిదశ పోరాటంలో ప్రొఫెసర్ జయశంకర్ మార్గనిర్దేశకత్వంలో ఆమె చురుగ్గా పని చేశారు. 2017లో తెలంగాణ ప్రభుత్వం రజితను విశిష్ట మహిళా పురస్కారంతో సత్కరించింది. రజిత భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం మంగళవారం ఉదయం వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాలకు అప్పగించనున్నారు.

ఎయిరిండియా విమానానికి తప్పిన ముప్పు..!

తిరువనంతపురం-ఢిల్లీ విమానంలో సాంకేతిక సమస్య

చెన్నైలో అత్యవసర ల్యాండింగ్..

ఆ సమయంలో రన్‌వేపై మరో విమానం

ప్రమాదం అంచుల వరకూ వెళ్లొచ్చాం: కాంగ్రెస్ ఎంపీ వేణుగోపాల్

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ సహా పలువురు ఎంపీలతో పాటు 150 మందితో ఆదివారం రాత్రి కేరళలోని తిరువనంతపురం నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పైలెట్ ఆ విమానాన్ని చెన్నై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులందరినీ కిందకు దింపి వారికి తాత్కాలిక బస ఏర్పాటు చేశారు. అనంతరం వారిని వేరొక విమానంలో ఢిల్లీకి పంపించారు. ఈ ఘనటపై కాంగ్రెస్ ఎంపీ వేణుగోపాల్ స్పందిస్తూ.. 'ప్రమాదపు అంచుల వరకూ వెళ్లొచ్చాం' అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. తాము ప్రయాణించిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో చెన్నై విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయిందని చెప్పారు. అయితే ఈ విమానం ఆదివారం రాత్రి పది గంటలకే ఇక్కడ ల్యాండ్ కావాల్సి ఉండగా.. కంట్రోల్ రూమ్ అధికారులు వెంటనే అనుమతి జారీ చేయకపోవడం వల్ల చెన్నై గగనతలంలోనే గంటసేపు చక్కర్లు కొట్టాల్సి వచ్చిందన్నారు. ఇక ల్యాండింగ్ కోసం తమ విమానం రన్‌వేపై దిగుతుండగా అడ్డంగా మరో విమానం ఉందని, పైలెట్ ఆ విమానానికి అతి సమీప ఎత్తు నుంచి ల్యాండ్ చేయడంతో పెను ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. అయితే చెన్నై ఎయిర్‌పోర్ట్ అధికారులు ఈ ఆరోపణలను ఖండించారు. దీనిపై వేణుగోపాల్ స్పందిస్తూ తానేమీ అబద్ధం చెప్పలేదని, రన్‌వేకు అడ్డంగా విమానం కనిపించిందని, వెంటనే తమ విమానాన్ని కాస్త ఎత్తు పెంచి నడిపినట్లు పైలెటే తెలిపారని వివరించారు.

కేసీఆర్, కేటీఆర్ కన్నా జగదీశ్ రెడ్డే ఎక్కువ సంపాదించారు

(మొదటిపేజీ తరువాయి)



ఆరోపించారు. ఈ విషయంలో ఆయన గురువును మించిన శిష్యుడన్నారు. కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర ఎకరం రూ.50లక్షలు ఉంటే, జగదీశ్‌రెడ్డి ఫాంహౌస్ దగ్గర రూ.40కోట్లు అని వివరించారు. సోమవారం వెంకటరెడ్డి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీర్ల దగ్గర రూ.60వేల కోట్లు ఉన్నాయని, ఏ అధికారి దగ్గర సోదాలు చేసినా వందల, వేల కోట్ల రూపాయలు బయటపడుతున్నాయని చెప్పారు. అధికారుల దగ్గరే ఇంత డబ్బుంటే లీడర్ల దగ్గర ఇంకెంత ఉంటుందోనని అనుమానం వ్యక్తం చేశారు. శ్రీశైలం ఎడమ కాలువ(ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌పై కేసీఆర్ క్షుద్రపూజలు చేసినట్టున్నారని, అందుకే అది కూలిపోయిందని వెంకటరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంగారు తెలంగాణ అంటూ కేసీఆర్ తెలంగాణను బిచ్చగాళ్ల రాష్ట్రంగా మార్చారని, బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం దివాలా తీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే కుదుటపడుతోందని ఆయన తెలిపారు.

రాజకీయ కక్ష సాధింపుల్లేవు

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలుపు కాంగ్రెస్‌దేనని వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. విలన్లది కొద్ది రోజులే నడుస్తదని, సీఎం రేవంత్, తమ పార్టీ నేతలు ఎవర్‌గ్రీన్ హీరోలని ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో ఏ విషయంలోనూ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏపీలో మాదిరి అరెస్టులు ఉంటాయని అనుకోవద్దని, ఏపీ, తెలంగాణ రాజకీయాలు వేర్వేరని అన్నారు. సినిమాల్లో విలన్లను క్లైమాక్స్‌లోనే అరెస్టు చేస్తారంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. కాగా హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్ హోటల్ ముందున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి తరహాలాంటిదానిని నల్గొండలోనూ నిర్మిస్తున్నట్టు వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు భూసేకరణకు రూ.6వేల కోట్లు ఖర్చవుతుందని, ఇప్పటివరకు 96% భూసేకరణ పూర్తయిందని ఆయన వెల్లడించారు.

గాంధీలో ఎక్స్‌రే రంధి!

పెద్దాస్పత్రిల్లో పాడైపోయిన ఎక్స్‌రే యంత్రాలు.. 10 యంత్రాల్లో పనిచేస్తోంది రెండంటే రెండే

» వాటిల్లోనూ ఫిల్మ్ రాదు.. ఫోన్లోనే ఫొటోలు

» రోగుల క్యూ.. పడిగాపులతో తీవ్ర ఇబ్బందులు

అడ్డగుట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చీలమండకు గాయమైౖ.. ఉబ్బితే అది బెణికిందో.. విరిగిందో అని తెలుసుకోవడం క్షణాల్లో పని! ఎక్స్‌రే తీస్తే తెలిసిపోతుంది. ఈ సమస్యతోనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి వెళితే గనక అక్కడ ఎక్స్‌రే కోసం కొన్ని గంటలు పట్టొచ్చు.. లేదా, ఆ రోజు ఎక్స్‌రే తీయడమే సాధ్యపడకపోవొచ్చు. ఎందుకంటే.. రాష్ట్రంలోనే పెద్దాస్పత్రి అయిన గాంధీలో ప్రస్తుతం రెండంటే రెండు ఎక్స్‌రే యంత్రాలే పనిచేస్తున్నాయి. రోజుకు 1800 దాకా ఔట్ పేషంట్లు వచ్చే ఆ దవాఖానాలో ఎక్స్‌రే కోసం చాంతాడంత క్యూ ఉంటోంది. ఫలితంగా దూరప్రాంతాల నుంచి చికిత్స కోసం ఆస్పత్రికి వస్తున్న నిరుపేద రోగులు ఎక్స్‌రే కోసం గంటలతరబడి పడిగాపులు పడుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఎక్స్‌రే యంత్రాలు గత రెండేళ్లుగా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. ఆస్పత్రిలో మొత్తంగా 10 ఎక్స్‌రే యంత్రాలున్నాయి. సెల్లార్‌లోని రేడియాలజీ విభాగంలో ఎనిమిది యంత్రాలు ఉంటే, ఓపీ విభాగంలో రెండున్నాయి. వీటిలో.. రేడియాలజీ విభాగంలో ఏడు యంత్రాలు, ఓపీ విభాగంలో ఒకటి పనిచేయడం లేదు. ప్రస్తుతం రెండు యంత్రాలే పనిచేస్తున్నాయి.

స్మార్ట్ ఫోన్ ఉంటేనే రిపోర్టులు

గాంధీ ఆస్పత్రిలో యంత్రాల కొరతతో ఎక్స్‌రే కోసం అవస్థలు పడుతున్న రోగులకు వచ్చిన మరో ఇబ్బంది ఏమిటంటే పరీక్ష అయ్యాక అక్కడి టెక్నీషియన్లు ఎక్స్‌రే ఫిల్మ్ ఇవ్వడం లేదు. ఎక్స్‌రే తీశాక స్మార్ట్‌ఫోన్ ఉందా? అని అడుగుతున్నారు. వారి నుంచి ఫోను తీసుకొని.. ఎక్స్‌రే రిపోర్టు ఫొటో, వీడియో తీసి ఇస్తున్నారు. అంటే.. సదరు రోగులు ఆ స్మార్ట్‌లోని ఫొటో, వీడియోను వైద్యులకు చూయించి చికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గాంధీకి వచ్చేది నిరుపేద రోగులే కావడం, వారిలో చాలామంది వద్ద మామూలు ఫోన్లే ఉండటంతో రిపోర్టు ఇవ్వలేం అంటూ టెక్నీషియన్లు చేతులెత్తేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో రెండేళ్లుగా ఎక్స్‌రే ఫిల్మ్‌లు అందుబాటులో లేవని తెలుస్తోంది. మూలన పడిన ఎక్స్‌రే యంత్రాలను బాగు చేయించి.. ఫిల్మ్‌లు అందుబాటులో ఉంచాలని రోగులు, సహాయకులు కోరుతున్నారు. ఎక్స్‌రే యంత్రాల విషయంలో గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ కుమార్ మరో విధంగా స్పందించారు. ఆస్పత్రిలో మొత్తం 12 ఎక్స్‌రే యంత్రాలు ఉన్నాయని, వీటిలో రెండు మాత్రమే రిపేరుకు ఉన్నాయని, మిగతావన్నీ పనిచేస్తున్నాయని చెప్పారు. రిపేరులో ఉన్న యంత్రాలను బాగు చేయడానికి ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.



ఎక్స్‌రే కోసం 10 గంటలు

నా భర్త మాణిక్‌రావు వారం క్రితం భవనంపై నుంచి కిందపడ్డాడు. నడుము విరిగింది. చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొచ్చాం. నడుము విరగడంతో 6న సాయంత్రం ఎక్స్‌రే తీయించేందుకు ఆయన్ను రేడియాలజీ విభాగానికి స్ట్రెచర్‌పై తీసుకొచ్చాను. అక్కడ ఒకటే యంత్రం పనిచేస్తోంది. చాలాసేపటికి ఎక్స్‌రేకు అవకాశం వచ్చింది. ఫోన్‌లో ఫొటో తీసుకొని పైకి తీసుకెళితే.. వైద్యులు సరిగా రాలేదని, మళ్లీ ఎక్స్‌రే తీసుకొని రావాలని చెప్పారు. రెండోసారి ఆయన్ను తీసుకొని వెళ్లినా అదీ సరిగా రాలేదన్నారు. మర్నాడు అంటే.. ఏడో తేదిన మూడోసారి ఎక్స్‌రే తీయించుకొని వెళితే ఓకే చేశారు. ఇలా ఎక్స్‌రే తీయించడానికే 10 గంటలకు పైగా సమయం పట్టింది.

- పద్మ, మక్తల్

మరమ్మతుల కోసం డబ్బులు చెల్లించాం

రేడియాలజీ విభాగంలో కొన్ని ఎక్స్‌రే, సీటీస్కాన్ యంత్రాలు పనిచేయడంలేదు. వీటికి మరమ్మతులు చేయడానికి హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ కంపెనీకి గతంలోనే డబ్బులు చెల్లించాం. కానీ ఆ కంపెనీ నుంచి టెక్నీషియన్లు రాకపోవడంతో మరమ్మతులకు జాప్యం అవుతుంది. ఈ విషయాన్ని తీవ్రంగా పరగణిస్తున్నాం. పాడైన ఎక్స్‌రే యంత్రాలను వెంటనే బాగు చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. - డాక్టర్ శేషాద్రి



ఎల్ఏసీ సమీపం నుంచి చైనా భారీ రైల్వే లైన్!

(మొదటిపేజీ తరువాయి)

అనుసంధానించేందుకు.. సుమారు రూ.4 లక్షల కోట్ల (45 బిలియన్ డాలర్లు) వ్యయంతో 5 వేల కిలోమీటర్ల పొడవునా చైనా చేపట్టిన నాలుగు రైల్వే మార్గాల్లో ఇది ఒకటని తెలిపింది. హిమాలయాల్లోని కారకోరం, కైలాష్, కున్‌లున్ పర్వత శ్రేణుల మీదుగా ఈ మార్గం సాగుతుందని పేర్కొంది.

భారత్‌కు ఆందోళనకరం..

చైనాతో భారత్‌కు సరిహద్దు వివాదాలు ఉన్న నేపథ్యంలో ఆ దేశం చేపడుతున్న ప్రాజెక్టులు ఆందోళన రేపుతున్నాయి. ఇప్పటికే తన ఆక్రమణలో ఉన్న అక్సాయ్‌చిన్ ప్రాంతం మీదుగా చైనా భారీ హైవేను నిర్మించింది. దానికి తోడు ఇప్పుడు ఎల్ఏసీకి సమీపం నుంచి రైల్వే మార్గాన్ని చేపడుతోంది. భారత్‌కు రక్షణపరంగా ఇది చికాకుపరిచేదేనని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఉద్రిక్త పరిస్థితులే వైనా తలెత్తితే.. ఎల్ఏసీ సమీపంలోకి భారీగా, వేగంగా సైన్యాన్ని, ఆయుధ సామగ్రిని తరలించేందుకు చైనాకు ఈ రైల్వే మార్గం ఉపకరిస్తుందని పేర్కొంటున్నారు. మరోవైపు సరిహద్దులకు అతి సమీపంలో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అత్యంత భారీ డ్యామ్ నిర్మాణ పనులను చైనా ఇటీవలే ప్రారంభించింది. ఆ డ్యామ్ పూర్తయితే భారత్‌పై 'జల ఖడ్గం'లా మారుతుందనే ఆందోళన నెలకొంది.

'అణు'బూచి పాక్‌కు మామూలే

» పాక్ ఆర్మీ చీఫ్ బెదిరింపులపై భారత్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: అణ్వస్త్ర బెదిరింపులు పాకిస్థాన్‌కు మామూలేనని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. అమెరికా పర్యటన సందర్భంగా పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. "మా ఉనికికే ప్రమాదం ఏర్పడితే.. భారత్‌పై అణుదాడి చేస్తాం. మేం మునిగిపోతూ.. సగం ప్రపంచాన్ని వెంట తీసుకెళ్తాం" అంటూ మునీర్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే..! స్నేహపూర్వక దేశమైన అమెరికా గడ్డ పైనుంచి మునీర్ వ్యాఖ్యలు రావడం విచారకరమని భారత విదేశాంగ శాఖ తెలిపింది. "పాక్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యల ద్వారా ఆ దేశంలో అణ్వస్త్రాల నియంత్రణ, కమాండ్ వ్యవస్థ నైతికతపై ఉన్న అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఉగ్రవాద గ్రూపులతో పాక్ సైన్యం కలిపి పనిచేస్తోందన్న వాస్తవం మరోసారి స్పష్టమవుతోంది. అణ్వస్త్ర బ్లాక్ మెయిల్‌కి భారత్ తలొగ్గదు. అదే సమయంలో.. జాతీయ భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది" అని స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వ వర్గాలు కూడా మునీర్ వ్యాఖ్యలు బాధ్యతారహితానికి నిదర్శనమని పేర్కొన్నట్లు పీటీఐ తెలిపింది. పాక్ సైన్యానికి అమెరికా మద్దతిస్తే.. పాక్ తన అసలు స్వరూపాన్ని, దూకుడును బయటపెడుతోందని పేర్కొంది.

ఏపీలో మద్యం నోట్‌ఫైల్స్ ధ్వంసం!

సరఫరా ఆర్డర్ల వివరాలు మాయం

ఫైళ్ల నాశనం వెనుక ఐపీఎస్ పీఎస్ఆర్!

ఏసీబీ కోర్టులో సిట్ రెండో చార్జిషీట్ దాఖలు


ఫోరెన్సిక్ సైన్స్ నివేదిక కూడా సమర్పణ

వైసీపీ లిక్కర్ గ్యాంగ్‌పై సిట్‌కు ఆధారాలు

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన భారీ మద్యం స్కామ్ దర్యాప్తులో 'సిట్' సంచలనాలు నమోదు చేస్తోంది. ఐదేళ్ల పాటు అత్యంత నాసిరకం మద్యం ఏపీ ప్రజలకు పోసి వైసీపీ లిక్కర్ గ్యాంగ్ రూ. వేలకోట్లు దండుకుంది. ఈ గ్యాంగ్‌లో కీలకమైన ముగ్గురు నిందితుల పాత్రను సోమవారం విజయవాడ ఏసీబీ కోర్టుకు సమర్పించిన అనుబంధ చార్జిషీట్‌లో స్పష్టం చేసినట్టు తెలిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరా ఆర్డర్ల నోట్ ఫైళ్లన్నీ నిందితులు, గత ప్రభుత్వ ముఖ్యులు ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అరెస్టై జైల్లో ఉన్న నిందితులతో పాటు మరికొందరు పాత్రధారులకు డీజీ ర్యాంకు సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు దిశానిర్దేశం చేసినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. నిందితులతో ఆయన జరిపిన సమావేశాలు, చర్చలు, చేసిన సూచనలు, కాల్ డేటా వివరాలు తదితర ఫోరెన్సిక్ ఆధారాలు దర్యాప్తు బృందం కోర్టుకు సమర్పించినట్లు తెలిసింది. తాజా చార్జిషీట్‌లో ముఖ్యంగా ముగ్గురి పాత్రపై వివరించినట్లు సమాచారం. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు అన్నీ తానై వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, వైఎస్ కుటుంబంతో నమ్మకస్తుడిగా ఉంటూ చాలా కాలంగా జగన్ వద్ద ఓఎస్‌డీగా పని చేసిన కృష్ణమోహన్ రెడ్డి, మాజీ సీఎం కుటుంబానికి చెందిన భారతీ సిమెంట్స్‌లో శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప పాత్రపై చార్జిషీట్‌లో ప్రస్తావించినట్లు తెలిసింది.

ఓఆర్ఆర్‌పై పనిచేస్తున్న కూలీలను ఢీకొట్టిన ట్రాలీ

(మొదటిపేజీ తరువాయి)



వాహనం అదుపు తప్పి ముగ్గురు కార్మికులను బలంగా ఢీకొట్టింది. కళ్లెదుటే తమ వారు మృత్యువాత పడటంతో తోటి కార్మికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిద్ర మత్తులో వాహనం నడపటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపటంతోనే ప్రమాదం జరిగిందని మృతుల బంధువులు ఆరోపించారు. బాధ్యుడిపై తగిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో

» పలు చోట్ల బారులు తీరిన రైతులు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం నర్సింగాపూర్‌లో యూరియా కోసం రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వరి నాట్లు ఊపందుకున్నాయి. దీంతో రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. సరఫరా పరిమితంగా ఉండడంతో సహకార సంఘాల వద్దకు సోమవారం ఉదయమే వచ్చి చెప్పులు, ఇతర వస్తువులను వరుసలో పెట్టి యూరియా కోసం ఎదురు చూశారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో రైతులు యూరియా కోసం కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సైదాపూర్ మండలం ఆకునూర్ గ్రామంలోని ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజర్ వద్ద కొందరు రైతులకు యూరియా అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్ గ్రామాల్లోని గోదాంల వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఎదురు చూశారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయం, పెద్దలింగాపూర్, ముస్కానిపేట, పొత్తూరు గ్రామాల్లో విక్రయ కేంద్రాల వద్ద యూరియా బస్తాలు తక్కువగా ఉండటం.. రైతులు ఎక్కువ మంది రావడంతో నిర్వాహకులు ఇబ్బంది పడ్డారు. చందుర్తి, ననుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎదుట యూరియా కోసం రైతులు సోమవారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్, పాలకుర్తి మండలం పుట్నూర్‌లో రైతులు యూరియా కోసం బారులు తీరారు. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం ప్రాథమిక సహకార సంఘానికి ఒక లోడు యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడటంతో కాసేపు తోపులాట చోటు చేసుకుంది. పాలకుర్తి మండలం పుట్నూర్ కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు.

అప్పుపై కాంగ్రెస్‌వి పచ్చి అబద్ధాలు

» ఇదే విషయం పార్లమెంట్ సాక్షిగా తేలిపోయింది

» బీఆర్ఎస్ హయాంలో అప్పు 8 లక్షల కోట్లు కాదు.. 3.5 లక్షల కోట్లే

» మేం అప్పులు చేసి ఆస్తులు సృష్టిస్తే.. ఆర్థిక వ్యవస్థను కాంగ్రెస్ ఖతం చేసింది

» కాగ్ నివేదికతో రాష్ట్ర ఆర్థికస్థితి తలకిందులైందని స్పష్టీకరణ

» అప్పులతో ఏం చేస్తున్నారు? ? కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన బృందం చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలు అనే సంగతి పార్లమెంటులో తేలిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు కాంగ్రెస్, బీజేపీలు ఆరోపిస్తున్నట్టుగా తమ హయాంలో రాష్ట్ర అప్పు రూ.8 లక్షల కోట్ల కాదని, రూ.3.5 లక్షల కోట్లు మాత్రమే అన్న నిజాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఒప్పుకొందన్నారు. ఈ మేరకు కేటీఆర్ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి రూ. 8 లక్షల కోట్ల అప్పులంటూ నిరాధార ప్రచారానికి దిగిన రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ముఖం ఎక్కడ పెట్టుకుంటారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే ఆస్తుల సృష్టి కోసమే తెచ్చిన అప్పులను తాము ఉపయోగించామని చెప్పారు. మిషన్ భగిరథ, మిషన్ కాకతీయ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆ నిధులను ఖర్చు చేశామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ అప్పులు రూ. 3,50,520.39 కోట్లు అయితే, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల విలువ రూ. 4,15,099.69 కోట్లుగా ఉందన్నారు. అంటే, అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 64,579 కోట్లు ఎక్కువగా ఉందని తెలిపారు. తమ హయాంలో చివరి ఆరు ఆర్థిక సంవత్సరాల్లో ఏటా రాష్ట్ర అప్పుల కంటే ఆస్తుల విలువ రూ. 50 వేల కోట్లకు పైగా పెరిగిందన్నారు. రేవంత్ రెడ్డి, తాను సీఎం అయినప్పటి నుంచి విపరీతంగా అప్పులు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. 2023 డిసెంబరు నుంచి వివిధ మార్గాల ద్వారా రూ. 1.5 లక్షల కోట్లకు మించి అప్పులు చేసినట్లు స్వయంగా రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అంగీకరించారని పేర్కొన్నారు. రేవంత్ ప్రభుత్వ అనాలోచిత, అస్తవ్యస్త ఆర్థిక నిర్వహణ ఫలితంగానే తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలు సంగతేమో కానీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ఖతం చేసిందని మండిపడ్డారు. కంప్ట్రో అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం పడిపోవడంతో పాటు అప్పులు భారీగా పెరిగాయన్నారు. మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైన తెలంగాణ, ఇప్పుడు 10,583 కోట్ల రెవెన్యూ లోటును ఎదుర్కోవడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనం అని మండిపడ్డారు. పన్నేతర ఆదాయం కూడా దారుణంగా పడిపోయిందని, బడ్జెట్‌లో అంచనా వేసిన దానిలో కేవలం 3.37 శాతం మాత్రమే వసూలైందని తెలిపారు. కొత్తగా ఏ రోడ్డూ వేయకుండా, ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభించకుండా, విద్యార్థులకు కనీసం మంచి భోజనమైనా పెట్టకుండా తెచ్చిన అప్పులను ఏం చేస్తున్నారు? ఆ నిధులు ఎటు వెళుతున్నాయి? అని నిలదీశారు.

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రపతి వద్దకు!

(మొదటిపేజీ తరువాయి)

వైఖరిని ప్రజలకు తెలియజేయాలని.. అవసరమైతే ఈ రెండు అంశాలపై సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై పరిశీలించాలని చెప్పినట్లు సమాచారం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. నెల రోజుల క్రితం యశోద ఆస్పత్రితో పాటు ఏఐజీలో చికిత్స పొందిన ఆయనకు తాజాగా మళ్లీ జ్వరం వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో మరోసారి ఆస్పత్రిలో చేరి, చికిత్స తీసుకోనున్నట్లు తెలిసింది. అక్కడి నుంచే కేసీఆర్ కరీంనగర్ బీసీ సభకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీసీ సభ ఏర్పాట్లపై ఎంపీ వినోద్‌కు పలు సూచనలు చేసినట్లు తెలిసింది.

'జన్ విశ్వాస్ బిల్లు'పై వివరాలు సేకరిస్తున్నాం

» కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి సీఎస్ రామకృష్ణారావు వివరణ



హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సులభతర వాణిజ్య విధానాన్ని (ఈఓడీబీ) ప్రోత్సహించడం, చిన్న చిన్న నేరాలకు శిక్షలు తగ్గించడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'జన్ విశ్వాస్ బిల్లు'లో రాష్ట్రం నుంచి చేర్చాల్సిన అంశాల గురించి వివరాలు సేకరిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సచివాలయం నుంచి పాల్గొన్న సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ శాఖల చట్టాల్లో ఉన్న నేర సంబంధ నియమ నిబంధనలను పరిశీలించామని, వీటిని ఆ శాఖలకు పంపించామని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి వివరించారు. వ్యాపారాల వృద్ధి కోసం, ఈవోడీబీని ప్రోత్సహించడంలో భాగంగా చిన్న నేరాలకు శిక్షలు తగ్గించి, వాటి స్థానంలో అపరాధ రుసుముల విధింపు వంటి సరళీకృత ప్రక్రియల అమలుపై ఆ శాఖల నుంచి వివరాలు కోరామని వివరించారు. ఆ వివరాలు రాగానే జన్ విశ్వాస్ బిల్లులో చేర్చడానికిగాను కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతామని సీఎస్ రామకృష్ణారావు చెప్పారు.

'హ్యామ్' రోడ్లపై నేడు అవగాహన సదస్సు

» హైటెక్‌సిటీలోని న్యాక్ కార్యాలయంలో కార్యక్రమం

» నిర్వహించనున్న ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖలు

» పాల్గొననున్న బ్యాంకర్లు, కాంట్రాక్టర్లు, వర్క్ ఏజెన్సీలు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌శాఖల పరిధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హ్యామ్)లో రోడ్ల నిర్మాణం, విస్తరణ చేపట్టిన ప్రభుత్వం ఈ విధానంపై అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. హ్యామ్ విధానం ఎలా ఉంటుంది, పనుల గుర్తింపు, నిర్మాణం, టెండర్ల ఆహ్వానం, బిల్లుల చెల్లింపుపై బ్యాంకర్లు, కాంట్రాక్టర్లు, వర్క్ ఏజెన్సీలకు అవగాహన ('హ్యామ్ ప్రాజెక్ట్ రోడ్ షో') కల్పించనున్నారు. మంగళవారం హైటెక్‌సిటీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో జరిగే కార్యక్రమంలో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి, సీతక్కతో పాటు ఉన్నతాధికారులు, నిపుణులు పాల్గొంటారు. హ్యామ్ విధానంలో రహదారుల నిర్మాణానికి సంబంధించిన ప్రభుత్వ విజన్, ప్రాజెక్టు విధి విధానాలు, ప్రత్యేకతలు, పని ప్రణాళికలు, నిర్మాణ కాలం, అర్హతలు, ఎంపిక విధానంపై వివరిస్తారు. ఈ విధానంలో ప్రభుత్వం 40% ఖర్చుగా మిగిలిన 60% నిధులను కాంట్రాక్టర్లు రుణం ద్వారా వెచ్చిస్తారు. మొదటిసారి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు హ్యామ్‌ను తీసుకువచ్చింది. ఈ విధానంలో రహదారులను అభివృద్ధి చేసినా ప్రజలపై టోల్ భారం లేకుండా రూపొందించారు.

తెల్లాపూర్‌లో అమరుల స్మృతి వనం

» పటేకరాల్లో ఏర్పాటుకు హెచ్ఎండీఏ ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోరాటంలో ఉవ్వెత్తున ఎగిసిన మెతుకు సీమ ఉమ్మడి మెదక్ జిల్లాలోని తెల్లాపూర్‌లో అమరుల స్మృతి వనం ఏర్పాటు చేయనున్నారు. ఉద్యమ స్ఫూర్తిని చాటే విధంగా పది ఎకరాల్లో ఈ స్మారకాన్ని ఏర్పాటు చేయడానికి ఇప్పటికే హెచ్ఎండీఏ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే సుమారు రూ.50 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మునిసిపాలిటీలో ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలోనే సమీపంలో గల హెచ్ఎండీఏ స్థలంలో అమరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని డిమాండ్లు వచ్చాయి. గద్దర్ విగ్రహం నెలకొల్పిన స్థలానికి ఆనుకుని హెచ్ఎండీఏ భూములున్నాయి. అందులో ఖాళీగా ఉన్న పది ఎకరాల్లో అమరుల స్మృతి వనం ఏర్పాటు చేయనున్నారు. అక్కడ ఉద్యమ స్ఫూర్తిని రగిలించే వివిధ రకాల కళా ఖండాలు, మెదక్ జిల్లా విశిష్టతను చెప్పే అంశాలు, పచ్చిక బయళ్లు, ఆకట్టుకునే మొక్కలు, వాకింగ్ ట్రాక్ ఉండనున్నాయి.

ఎఫ్‌సీడీఏ, ఎన్ఐయూఎం కార్యాలయాల కోసం

మీర్‌ఖాన్‌పేటలో భూముల పరిశీలన

కందుకూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఫ్యూచర్ సిటీలో భాగంగా అక్కడే మరో రెండు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అధికారులు భూములను పరిశీలించారు. ఇప్పటికే అక్కడ యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం తాజాగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం), ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయాల నిర్మాణాల కోసం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం తెలంగాణ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టీకే శ్రీదేవి, ఫ్యూచర్‌సిటీ కమిషనర్ శశాంక, ఎండీహెచ్‌యూఎస్ కార్యదర్శి కె.శ్రీనివాస్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌లతో కలిసి మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ పరిధిలోని 112 సర్వే నంబర్‌లోని భూములను, ఎన్ఐయూఎం కార్యాలయానికి 20 ఎకరాలు, ఎఫ్‌సీడీఏ కార్యాలయానికి 7 నుంచి 20ఎకరాల భూములను పరిశీలించారు. మీర్‌ఖాన్‌పేట-యాచారం రోడ్డు సమీపంలో ఆ భూములను పరిశీలించారు.

జీపీవోల నియామకాలు ఉన్నట్టా లేనట్టా?

» గందరగోళంలో రెవెన్యూ సిబ్బంది

» ఆగస్టు 15న కార్యక్రమం లేదని సీసీఎల్ఏ స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గ్రామపాలనాధికారుల(జీపీవో) నియామకాలపై గందరగోళం నెలకొంది. ఆగస్టు 15న 5 వేల మంది జీపీవోలకు నియామక పత్రాలు ఇవ్వనుందున ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లో అందుబాటులో ఉండాలని సీసీఎల్ఏ కార్యదర్శి మకరందు అదనపు కలెక్టర్లను(రెవెన్యూ) ఆదేశించారు. జిల్లాల నుంచి బస్సుల్లో జీపీవోలను తరలించాలని, వారితోపాటు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఆర్‌ఐలు కూడా హైదరాబాద్ రావాలని సూచించారు. అయితే వర్షాలు ఉన్నందున రెవెన్యూ సిబ్బంది అంతా జిల్లాలు వదిలి వస్తే ఇబ్బందులు ఉంటాయని కొంత మంది అదనపు కలెక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ తరుణంలో పంద్రాగస్టున ఈ కార్యక్రమం ఉండే లేదా అనే అయోమయం ఏర్పడింది. దీనిపై సీసీఎల్ఏ అధికారులను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ఆగస్టు 15న కార్యక్రమం లేదని స్పష్టం చేశారు.

గింజ కూడా వదలం

(మొదటిపేజీ తరువాయి)

చేశాం. రెవెన్యూ రికవరీ యాక్టు నమోదు చేశాం. ధాన్యం అమ్ముకున్న రైస్ మిల్లర్ల తమ ఆస్తులను బదిలీ చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. బ్యాంకు ఖాతాలను కూడా నిలిపి వేశాం. మిగిలిన 11.29 లక్షల టన్నుల ధాన్యం మిల్లర్ల వద్ద ఉంది. దీనిని మళ్లీ వేలం వేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. 2023-24 ఖరీఫ్, యాసంగికి సంబంధించి 5.06 లక్షల టన్నుల ధాన్యం బకాయిలు ఉన్నాయి. వీటికి సీఎంఆర్ డెలివరీ గడువు పూర్తయినందున 125 శాతం రికవరీ (25 శాతం జరిమానా), 12 శాతం వార్షిక వడ్డీ లెక్కన రైస్ మిల్లర్ల నుంచి వసూలు చేస్తాం. 2024-25 వానాకాలంలో 17.31 లక్షల టన్నుల ధాన్యం బకాయిలున్నాయి. మే 31వ తేదీకి సీఎంఆర్ డెలివరీ గడువు ముగిసిపోయింది. పొడిగింపునకు కేంద్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నాం. కేంద్రం నుంచి అనుమతి వస్తే 17.31 లక్షల టన్నుల మరాడించి బియ్యం ఎఫ్‌సీఐకి 'పెడతాం'. 2024- 25 యాసంగి సీజన్లో 51.99 లక్షల టన్నుల ధాన్యం సేకరణ జరిపితే మిల్లర్లకు పంపించాం, సీఎంఆర్ డెలివరీ పురోగతిలో ఉందని తెలిపారు. నిర్ణీత వ్యవధిలో బియ్యం రికవరీ చేస్తామని, గడువు దాటితే జరిమానా, వడ్డీతో సహా వసూలు చేస్తామని పేర్కొన్నారు.

ఏం చేద్దాం!?



(మొదటిపేజీ తరువాయి)

వెల్లాల్సిందనిపై సమాలోచనలు జరిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు, పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ తెచ్చిన ఆర్డినెన్సు రెండూ కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశం చర్చకు వచ్చింది. ఈ విషయాన్ని కోర్టుకు నివేదించి, స్థానిక ఎన్నికల నిర్వహణకు మరికొంత గడువు కోరితే ఎలా ఉంటుందన్న విషయంపై నేతలిద్దరూ చర్చించారు. కోర్టు అనుమతిస్తే కేంద్రంపై మరోమారు ఒత్తిడి కార్యాచరణ చేపట్టవచ్చని భావిస్తున్నారు. అలా కాకుండా స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా 42% రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లుగా ప్రకటించి, ఎన్నికలకు వెళ్లడంపైనా చర్చించారు. పీసీసీ సమావేశం తర్వాతే స్థానిక ఎన్నికల నిర్వహణపై స్పష్టత రానుంది. పార్టీ పరంగా బీసీలకు 42% రిజర్వేషన్ ప్రకటించి, ముందుకు వెళ్లాలని పీఏసీలో నిర్ణయం తీసుకుంటే.. సెప్టెంబరు 10 తర్వాత స్థానిక ఎన్నికలు ఉండొచ్చని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ లోపే ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది.

వారంలో నామినేటెడ్ పదవుల భర్తీ?

పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మహేశ్‌గౌడ్ నిర్ణయించినట్లు తెలిసింది. జిల్లా, లోక్‌సభ నియోజకవర్గ స్థాయి పదవులకు.. నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి నియోజకవర్గానికి రెండు పేర్లతో ఇచ్చిన ప్రతిపాదనలు సీఎం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక ఎన్నికల ముందే ఆ పోస్టులను భర్తీ చేసి, కార్యకర్తల్లో కదలిక తీసుకురావాలన్న ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నారు.

జూబ్లీహిల్స్ అభ్యర్థిపై మరో సర్వే!

గెలుపే ప్రాతిపదికగా, సర్వేల ఆధారంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని నిర్ణయించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో కీలకమైన ఈ ఉప ఎన్నికలో అభ్యర్థిపై ఎలాంటి ఒత్తిడికీ తావు లేకుండా.. సర్వేల ఆధారంగానే నిర్ణయానికి రావాలని అనుకుంటున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీల వారీగా జరిగిన సర్వేలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వం కోసం ప్రస్తుతం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత నవీన్ యాదవ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డిలు ప్రధానంగా పోటీ పడుతున్నారు. వీరి అభ్యర్థిత్వాలపై పార్టీ సర్వే జరుగుతోంది. ఇదిలా ఉండగా.. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రిత్వ శాఖల వారీగా సమీక్షించారు. జనహిత పాదయాత్ర ద్వారా వీటిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నేతలిద్దరూ నిర్ణయించారు. ఈ నెల 23 నుంచి పాదయాత్రను పునఃప్రారంభిస్తున్నామని, యాత్రలో ఒక రోజు పాల్గొనాలని సీఎం రేవంత్‌ను మహేశ్‌గౌడ్ కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

ప్రజల గుండెల్లో నిలిచిపోవాలి

ఆ విధంగా పనులు చేయాలి.. ఎస్ఆర్ శంకరన్‌లాగా పేరు తెచ్చుకోవాలి

» ఎక్కడ.. ఏ హోదాలో ఉన్నా రాష్ట్రానికి సహకారం అందించాలి: డిప్యూటీ సీఎం భట్టి

» యూపీఎస్సీ మెయిన్స్‌కు ఎంపికైన 178 మందికి 'అభయహస్తం' ఉపకార వేతనాలు



యూపీఎస్సీ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థికి చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం

హైదరాబాద్/కొత్తగూడెం టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): 'ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా పనులు చేయాలి. మానవీయ కోణంతో ప్రతి పనిని, బాధ్యతను ప్రభావవంతంగా నిర్వర్తించాలి. సబ్బాను స్వీకరిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలి' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. సోమవారం ప్రజాభవన్‌లో రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ఉపకార వేతనాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ పథకాన్ని సింగరేణి కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. కార్యక్రమంలో భట్టి మాట్లాడుతూ.. దేశ అత్యున్నత సర్వీసులైన యూపీఎస్సీకి సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎంతో కొంత సహాయం చేయాలని రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని తెచ్చామని చెప్పారు. మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూలకు హాజరుకానున్న అభ్యర్థులకు మరో రూ.లక్ష ఉపకార వేతనం ఇవ్వనున్నామన్నారు. తొలివిడతలో ఈ పథకాన్ని తెచ్చిన ఏడాదిలో 148 మంది ఎంపికైతే.. వారికి ఉపకార వేతనం ఇవ్వగా.. వారిలో 10 మంది సివిల్స్‌కు ఎంపికయ్యారని గుర్తు చేశారు. ప్రస్తుతం 178 మందికి ఉపకార వేతనం ఇస్తున్నామని, ఈ దఫా యూపీఎస్సీకి ఎంపికయ్యే వారి సంఖ్య గణనీయంగా పెరగాలని కోరుకుంటున్నామన్నారు. ఎంపికైన వారు ఏ రాష్ట్రంలో, ఏ హోదాలో ఉన్నా.. రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దేశంలో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థుల ఎంపిక జరగాలని ఆకాంక్షించారు. 'ఎందరో ఐఏఎస్‌లు ఉంటున్నారు. కొందరు మాత్రమే చిరస్థాయిగా ప్రజల్లో గుండెల్లో నిలిచిపోతారు. వారిలో ఎస్ఆర్ శంకరన్, పార్థసారథి, మాధవరావు వంటి వారికి అరుదుగా ఉంటుంది. వారు అనుసరించిన విధానాల వల్ల.. నేటికీ వారికి ఆదరణ లభిస్తోంది. లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా.. అమలు చేయాలనే తపన ఉండాలి. ఎస్ఆర్ శంకరన్ ఎన్నో శాఖల్లో పనిచేసినా ఆయనకు పేరు ప్రతిష్ఠలు తెచ్చింది సంక్షేమశాఖనే..' అని చెప్పారు.

నా ఢిల్లీ ఫ్లాట్‌లో 6 బెడ్రూంలు అభ్యర్థులకే: కోమటిరెడ్డి

'నాకు ఢిల్లీలో ఏడు బెడ్రూంల ఫ్లాట్ ఉంటే.. అందులో ఆరింటిని సివిల్స్ శిక్షణ, ఇంటర్వ్యూలకు వచ్చే వారికి ఇచ్చి నిరంతరం టీ, టిఫిన్‌లు అందించే ఏర్పాట్లు కూడా చేశాను' అని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. 35 ఏళ్ల పాటు సర్వీసులో ఉండాల్సిన వారు సమాజానికి మెరుగైన సేవలందించాలన్నారు. సింగరేణి చరిత్రలో ఉపకారవేతనాలిచ్చే కార్యక్రమాలు ఎప్పుడూ జరగలేదని చెప్పారు. 'రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. 65 కేంద్రాల్లో మైక్రోసాఫ్ట్ ద్వారా శిక్షణ ఇస్తున్నాం. ఉద్యోగాల కోసం వచ్చే వేలాది మందికి అపాయింట్‌మెంట్ ఇప్పిస్తున్నా చాలామంది ఇంటర్వ్యూల్లో రాణించలేకపోతున్నారు' అని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల విద్యాలయాల ఏర్పాటు చేస్తున్నామని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉన్నా విద్యా రంగానికి 22 శాతం బడ్జెట్‌ను కేటాయించామని వెల్లడించారు. సివిల్స్ కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు తెలిపారు. తెలంగాణ అభ్యర్థులు దేశ అత్యున్నత స్థాయి చేరుకోవాలని ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా తొలి ఏడాది ఉపకార వేతనాలు అందుకొని.. యూపీఎస్సీకి ఎంపికైన 10 మంది అభ్యర్థులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఆ తర్వాత తాజా మెయిన్స్‌కు అర్హత సాధించిన 178 మందికి రూ.లక్ష చొప్పున ఉపకార వేతనాల చెక్కులను అందజేశారు.

పార్లమెంట్ సమావేశాలు మధ్యలోనే ముగించే యత్నం!

» కేంద్రం తప్పించుకోవాలనుకుంటోంది

» తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాలను మధ్యలోనే ముగించాలని కేంద్రం చూస్తోందని కాంగ్రెస్ ఎంపీల ఫోరం తెలంగాణ కన్వీనర్ మల్లు రవి చెప్పారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21 వరకు పార్లమెంట్ సమావేశాలు జరగాల్సి ఉన్నా మంగళవారం సమావేశాలు ముగిసే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కమిషన్, ఎస్ఐఆర్ తదితర అంశాలపై చర్చించకుండా కేంద్రం తప్పించుకునేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఇండియా కూటమి ఎంపీలు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే అరెస్టు చేయడం అప్రజాస్వామికమని చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అక్రమ మార్గాలతో బీజేపీ గెలిచిందని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఆరోపించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో నిజంగానే ఓటరు దొంగ ఓట్లతోనే గెలిచారా అనే సందేహం కలుగుతుందని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. ఇండియా కూటమి ఎంపీలు బయట ఆందోళన చేస్తుంటే, ఇదే అదునుగా భావించి సభలో బిల్లులను ఆమోదించారని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ చెప్పారు.

విచారణ జరిపించాలి: మహేశ్ గౌడ్

ఓట్ చోరీపైన సమగ్ర విచారణ జరిపించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆందోళన చేస్తున్న ఎంపీలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాహుల్ గాంధీ వాస్తవాలు మాట్లాడితే జీర్ణించుకోలేక, నిరసన తెలిపే హక్కునూ బీజేపీ కాలరాస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఇండియా కూటమి నేతల అరెస్టు నేపథ్యంలో బ్లాక్ డేగా పరిగణించాలని ట్రైబల్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ చెప్పారు. ఎన్నికల సంఘాన్ని రాహుల్ ప్రశ్నిస్తుంటే బీజేపీ ఎందుకు ఉలిక్కి పడుతోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు.



చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మంత్రి దామోదర

తొలిరోజే 89% మంది చిన్నారులకు

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 85,58,366 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఆరోగ్యశాఖ ప్రకటించింది. మొత్తం 96 లక్షల మందికి మాత్రలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా తొలిరోజే 89% మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 9,87,042 మంది చిన్నారులకు పంపిణీ చేయగా, అతి తక్కువగా ములుగులో 67,535 మందికి పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు స్కూళ్లు, కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్లలో మాత్రం ట్యాబ్లెట్ల పంపిణీ కొనసాగనున్నది. ఇక ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, తొలిరోజే 85.58 లక్షల మంది చిన్నారులకు ఆల్బెండజోల్ పంపిణీ చేసిన ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. మిగిలిన పిల్లలు కూడా తప్పనిసరిగా మాత్ర తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సూచించారు. 1-19 ఏండ్ల పిల్లలు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర వేయించాలని మరోసారి ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

పాక్‌కు ట్రమడోల్ డ్రగ్స్..

లుసెంట్‌పై ఈడీ చార్జిషీట్

పాకిస్థాన్, మరికొన్ని దేశాలకు ఎలాంటి అనుమతి లేకుండా ట్రమడోల్ ట్యాబ్లెట్లను ఎగుమతి చేసిన కేసులో.. లుసెంట్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లా వీరనామాతో లుసెంట్ కంపెనీ ఆయా దేశాలకు మత్తుమందును ఎగుమతి చేసింది. గతంలో ఈ సంస్థకు బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్ అనుమతులుండేవి. నిబంధనలకు విరుద్ధంగా పాకిస్థాన్‌కు ఎగుమతి చేయడంతో.. ఆ అనుమతులను రద్దు చేశారు. అయినా.. పాకిస్థాన్, మరికొన్ని దేశాలకు ఎగుమతులను కొనసాగించడంతో.. నార్కోటిక్స్ బ్యూరో అధికారులు ఈడీకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన ఈడీ.. ఫిబ్రవరిలో లుసెంట్‌కు చెందిన రూ.5.67 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది.

1.40 లక్షల టన్నుల దొడ్డు బియ్యం వేలం

గోదాములు, రేషన్ షాపుల్లో ఉన్నదంతా అమ్మకం.. క్వింటా రూ.2,250 కంటే ఎక్కువకు అమ్మాలని నిర్ణయం

» 2,3 రోజుల్లో నోటిఫికేషన్‌కు అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గోదాములు, రేషన్ షాపుల్లో మిగిలిపోయిన 1.40 లక్షల టన్నుల దొడ్డు బియ్యాన్ని వేలం పాటలో విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, మంత్రివర్గ ఉపసంఘ సభ్యులు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. బఫర్ గోదాముల్లో లక్ష టన్నులు, మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలో 13 వేల టన్నులు, రేషన్ షాపుల్లో 27 వేల టన్నుల దొడ్డు బియ్యం నిల్వలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభించింది. దొడ్డు బియ్యం అవసరం లేకుండాపోయింది. దీంతో, దొడ్డు బియ్యం విక్రయానికి టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిజానికి, ఎఫ్‌సీఐ తన వద్ద ఉన్న బియ్యం నిల్వలను క్వింటాలుకు రూ.2,250 చొప్పున విక్రయించాలని నిర్ణయించింది. అయితే, ఎఫ్‌సీఐ



ప్రొవిజనల్ కాస్టింగ్ షీట్ ప్రకారం.. బియ్యం ధర క్వింటాలుకు రూ.3,600 ఉంటుంది. కానీ, ఎఫ్‌సీఐ మాత్రం రూ.2,250 చొప్పున విక్రయాలు చేపడుతోంది. అయితే, ఈ ధరకు బియ్యం అప్పగించటానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలిసింది. ఆ లెక్క ప్రకారం బియ్యం విక్రయిస్తే నష్టపోవాల్సి వస్తుందని, ఎఫ్‌సీఐ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధర వస్తేనే బియ్యం విక్రయాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిసింది. నిజానికి, ఇతర రాష్ట్రాల్లో ఆహార అవసరాలకు దొడ్డు బియ్యం విక్రయించాలని ఇప్పటికే ప్రయత్నాలు చేసింది. పౌర సరఫరాల శాఖ అధికారులు కర్ణాటక వెళ్లి వచ్చారు. కానీ, స్పందన లేదు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ సహా ఎఫ్‌సీఐ ద్వారా తెలంగాణ బియ్యం వెళ్లే 8 రాష్ట్రాలకు ఎగుమతి చేయటానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలోనే, గ్లోబల్ టెండర్లు పిలిచి దొడ్డు బియ్యం విక్రయించి, వీలైనంత ఎక్కువ ధరను సొమ్ము చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రెండు, మూడు రోజుల్లో టెండర్ నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. అయితే, కొన్నిచోట్ల రేషన్ షాపుల్లో ఉన్న బియ్యాన్ని డీలర్లు అమ్ముకున్నారని, మరి కొన్ని చోట్ల ముక్కిపోయాయని ఫిర్యాదులు వచ్చాయి. దాంతో, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా 1.40 లక్షల టన్నులకు టెండర్లు పిలుస్తామని, ఒక్క గింజ తేడా లేకుండా రేషన్ షాపుల్లో, ఎంఎల్ఎస్ పాయింట్లు, బఫర్ గోదాముల్లో బియ్యం నిల్వలు ఉంచి వేలం వేస్తామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రోడ్డు కింద చెరువులు

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించిన అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు.. భూగర్భ సంపుల నిర్మాణం చేపట్టారు. హైదరాబాద్ నగరంలో భారీగా వరద నిలిచే ప్రాంతాలు 144 ఉన్నాయి. అందులో 50చోట్ల సమస్య ఎక్కువగా ఉంది. సమీపంలో నాలాలు, డ్రెయిన్లు ఉన్నచోట నీటిని మళ్లించే చర్యలు చేపడుతున్నారు. నాలాలు, డ్రెయిన్లు లేనిచోట భూగర్భంలోనే వరద నీరు నిల్వ చేసేలా సంపుల నిర్మిస్తున్నారు. మొదటి విడతగా 23 ప్రాంతాల్లో సంపుల నిర్మాణం చేపట్టాలని భావించారు. రూ.13.99 కోట్లతో 11 చోట్ల పనులు ప్రారంభించారు. 10 చోట్ల నిర్మాణం పూర్తికాగా.. మరోచోట తుది దశలో ఉన్నాయి. మిగతా 12 ప్రాంతాల్లో స్థలం అనువుగా లేకపోవడం, భూగర్భంలో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్లు, కేబుళ్లు ఉండటంతో సంపుల నిర్మాణం సాధ్యం కాదని తేల్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లో వరద నీరు నిల్వకుండా భూగర్భ సంపుల నిర్మాణానికి అనువుగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

ఒక్క దెబ్బకు రెండు పరిష్కారాలు..!

భూగర్భ సంపుల నిర్మాణం బహుళ ప్రయోజనకరంగా నిలుస్తోంది. రోడ్లపై నీరు సంపుల్లోకి వెళ్లిపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య ఉండదు. మరోవైపు సంపుల్లో నిలిచేనీరు ఇంకిపోయి భూగర్భ జలాలు పెరిగేందుకు దోహదపడుతుంది. కనీసం 2.65 లక్షల లీటర్ల నుంచి 10.4 లక్షల లీటర్ల నీళ్ల పట్టేలా ఈ సంపులు నిర్మిస్తున్నారు. 15 నుంచి 20 అడుగుల లోతుతో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి విస్తీర్ణం ఉంటోంది. సంపులో రెండు నుంచి ఆరు వరకు ఇంజక్షన్ బోర్లు వేస్తున్నారు. 60 నుంచి 120 అడుగుల లోతు ఉండే ఈ ఇంజక్షన్ బోర్లతో నీరంతా భూగర్భంలోకి ఇంకిపోతుంది. ఈ సంపులకు నలువైపులా కాంక్రీట్ గోడలు, పైనా వాహనాల రాకపోకలకు అనుగుణంగా బలమైన శ్లాబ్ నిర్మిస్తున్నారు. నీరు సంపులోకి వెళ్లేందుకు వీలుగా శ్లాబ్ మధ్య ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. వీలైన చోట సంపుల నుంచి సమీపంలోని చెరువులు, నాలాల్లోకి నీరు వెళ్లేలా భూగర్భ పైపులైన్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. సంపులో నీళ్లు నిర్దిష్ట స్థాయిలో నిండగానే అందులోని మోటార్లు ఆటోమేటిక్‌గా ఆన్ అయి నీటిని చెరువులు, నాలాల్లోకి పంప్ చేస్తాయి.

వాన పడినా హాయిగా ప్రయాణం..

వానపడినప్పుడల్లా సచివాలయం ఎదురుగా ఉన్న బస్టాప్ వద్ద నీరు నిలిచి ట్రాఫిక్ జామ్‌కు కారణమయ్యేది. భూగర్భ సంప నిర్మించాక సమస్య చాలా వరకు తగ్గింది. సోమాజిగూడ కేసీపీ జంక్షన్ వద్ద, రాజ్‌భవన్ సమీపంలోని లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద, పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 264 ప్రాంతంలో రెండు, మూడు అడుగుల మేర వరద నిలిచి తీవ్ర ఇబ్బంది ఎదురయ్యేది. ఇప్పుడు సమస్య దాదాపుగా పరిష్కారమైందని స్థానికులు చెబుతున్నారు.



మార్షల్స్‌తో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

వేతనాల తగ్గింపుపై మార్షల్స్ సామూహిక రాజీనామా!

» వెంటనే స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

» పూర్తి వేతనాలు ఇస్తామని స్పష్టీకరణ

హైదరాబాద్ సిటీ/ రాంగోపాల్‌పేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీతాల తగ్గింపును నిరసనగా హైడ్రాలో అసెట్ ప్రొటెక్టింగ్ విధానంలో మార్షల్స్‌గా విధులు నిర్వహిస్తోన్న మాజీ ఆర్మీ, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు సోమవారం సామూహికంగా రాజీనామా చేశారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు పీవీ మార్గ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యాలయం నుంచి బుద్ధభవన్ వద్ద గల హైడ్రా కార్యాలయం వరకు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వచ్చి హైడ్రా కమిషనర్‌కు రాజీనామాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం తమ జీతాన్ని రూ. 29,250 నుంచి రూ.22750కు తగ్గించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయంపై రంగనాథ్ వెంటనే స్పందించారు. మార్షల్స్‌ను పిలిపించి మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇంతకుముందు లాగే వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో వెంటనే మార్షల్స్ విధులకు హాజరయ్యారు. ఇదిలా ఉంటే మార్షల్స్ రూ.23 వేలు హైడ్రా నుంచి మిగతా రూ.6 వేలు జీహెచ్ఎంసీ నుంచి చెల్లించే ఆవకాశముందని సమాచారం. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

పదిలో 20% ఇంటర్నల్స్ యథాతథం

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పదోతరగతిలో ఇప్పటివరకు కొనసాగుతున్న ఇంటర్నల్ మార్కులను ఈ విద్యా సంవత్సరంలోనూ యథావిధిగా కొనసాగించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కొన్నేళ్లుగా పదో తరగతిలో 20% ఇంటర్నల్ మార్కుల విధానం కొనసాగుతుండగా, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులకు పూర్తిమార్కులు కేటాయిస్తున్నాయన్న ఆరోపణలొచ్చాయి. దీంతో ఈ విద్యా సంవత్సరం ఇంటర్నల్ మార్కులు తొలగించనున్నట్టు గతంలో ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు.

సర్వేయర్ నుంచి రూ.2లక్షల లంచం డిమాండ్

» యూట్యూబ్ చానెల్ సీఈవో కటకటాల పాలు

నిజాంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ తహసీల్ లైసెన్సుడ్ సర్వేయర్ శ్రీకాంత్‌ను రూ.2 లక్షలు డిమాండ్ చేసిన చరణ్ యూ-ట్యూబ్ చానెల్ సీఈఓ లింగంగౌడ్ చివరకు కటకటాల పాలయ్యాడు. 'సర్వేయర్ అక్రమాలు' అనే శీర్షిక సదరు యూ-ట్యూబ్ చానెల్‌లో వార్త ప్రసారమైంది. తర్వాత ఈ కథనంపై మాట్లాడాలని ఐదు రోజుల క్రితం సదరు సర్వేయర్‌ను మెదక్‌కు పిలిపించుకుని తనకు రూ.2 లక్షలివ్వాలని డిమాండ్ చేశాడు. అతడి వద్దనున్న 7 గ్రాముల బంగారం, రూ.10 వేల నగదు బలవంతంగా లాక్కోవడంతోపాటు మరిన్ని డబ్బుల కోసం వేధించాడు. దీంతో సర్వేయర్ శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లింగం గౌడ్‌పై రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ కేసు నమోదు చేశారు. లింగంగౌడ్‌ను సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు.

హెచ్‌సీఏలో నిబంధనలకు విరుద్ధంగా సెలెక్షన్ కమిటీ సభ్యుల నియామకం

» సీఐడీకి ఫుడ్ కమిషన్ చైర్మన్ ఫహీమ్ ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) నిబంధనలకు విరుద్ధంగా సీనియర్, జూనియర్ సెలెక్షన్ కమిటీ సభ్యుల నియామకం జరిగిందని సీఐడీ అదనపు డీజీపీ, విజిలెన్స్ డీజీలకు సోమవారం తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ సెలెక్షన్ కమిటీలో సభ్యులుగా ఉండాలంటే కనీసంగా ఏడు టెస్టు మ్యాచ్‌లు లేదా.. 30 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు లేదా పది అంతర్జాతీయ, 20 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలన్నారు. ఈ కమిటీ సభ్యుడు కావడానికి కనీసం ఐదేళ్ల ముందు రిటైర్ అయి ఉండాలని పేర్కొన్నారు. కమిటీలో ఎస్పీ సింగ్, ఆకాష్ బండారి మినహా మిగిలిన ఎవరికీ అర్హత లేదని, చైర్ పర్సన్‌కు సైతం అర్హత లేదని తెలిపారు. జూనియర్ సెలక్షన్ కమిటీలోనూ సుదీప్ త్యాగి, అరవింద్ శెట్టి మినహా మిగిలిన నియామకాలు నిబంధనలు విరుద్ధంగా జరిగాయని ఫిర్యాదులో ఫహీమ్ పేర్కొన్నారు.

'సృష్టి' కేసులో మరో నలుగురి కోసం గాలింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సృష్టి సంతాన సాఫల్య కేంద్రం మోసం కేసులో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు గోపాలపురం పోలీసులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతోపాటు.. మొత్తం 25 మంది అరెస్టయ్యారు. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వైద్యులు, టెక్నీషియన్లు, ఏజెంట్లు, చిన్నారుల అక్రమ రవాణా ముఠాల సభ్యులున్నారు. నమ్రత ముఠాలో కీలకంగా వ్యవహరించిన మరో నలుగురి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వీరికోసం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడ, నెల్లూరు ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ కేసులో.. ఈ నలుగురు కీలకమని, వారి వాంగ్మూలం కీలకమనిదర్యాప్తు అధికారులు చెబుతున్నారు. కాగా.. నమ్రత, ఆమె కుమారుడు జయంత్‌కృష్ణ, ఇతర నిందితులు బెయిల్ కోసం సికింద్రాబాద్ కోర్టులో పిటిషన్లు వేశారు. అయితే.. వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ రాకుండా దర్యాప్తు అధికారులు బలమైన కౌంటర్ దాఖలు చేశారు. నిందితులు బెయిల్‌పై బయటకు వస్తే.. సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రమాదముందని కోర్టుకు విన్నవించారు. పోలీసుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. నిందితులకు బెయిల్‌ను నిరాకరించింది.

అంతర్జాతీయంగా 'తపాలా' పార్సిల్ సేవలు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈ-కామర్స్ ఎగుమతిదారులు, వ్యక్తిగత వినియోగదారుల కోసం వేగవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన అంతర్జాతీయ పార్సిల్ సేవలను అందించడానికి తపాలా శాఖ కొత్తగా 'ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్(ఐటీపీ) సర్వీస్'ను ప్రారంభించింది. ఈ సర్వీస్ ద్వారా 45 దేశాలకు సులభంగా, నమ్మకంగా పార్సిళ్ల రవాణా చేయవచ్చని సంస్థ తెలిపింది. ఈమేరకు సోమవారం హైదరాబాద్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ ఎన్.ఆర్. విశాలాక్షి పేరిట ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సేవల్లో గరిష్ఠంగా 2 నుంచి 5 కిలోల వరకు (పంపించాల్సిన దేశం నిబంధనల ప్రకారం) తక్కువ ధరల్లో, సమయానికి డెలివరీ చేయనున్నామని తెలిపారు. వీటిని అన్ని పోస్టాఫీసుల్లో సులభంగా బుకింగ్ ద్వారా పొందవచ్చని, చిన్న పరిమాణంలోని అంతర్జాతీయ పంపిణీలకు ఇవి అనువైనవిగా ఉంటాయని తెలిపారు. పూర్తి దేశాల జాబితా, టారిఫ్ వివరాలు ఇండియా పోస్ట్ వెబ్‌సైట్ లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మరిన్ని వివరాలకు 6309658112 / 9963617719 నంబర్లలో కార్యాలయ సమయాల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

కశ్మీర్‌లో వాహనం బోల్తా.. రాష్ట్ర జవాన్ మృతి



బానోత్ అనిల్ (ఫైల్)

కారేపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో ఓ సైనిక వాహనం అదుపుతప్పి లోయలో పడిన ఘటనలో ఖమ్మం జిల్లాకు చెందిన జవాను మృతి చెందాడు. కారేపల్లి మండలం సూర్యతండాకు చెందిన బానోత్ అనిల్ (30) సోమవారం గస్తీ నిర్వహించే ప్రాంతానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు ఆర్మీ అధికారులు అనిల్ కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. అనిల్‌కు భార్య రేణుక, ఎనిమిది నెలల వయసున్న కుమారుడు ఉన్నారు. ఇటీవల సెలవులపై స్వగ్రామానికి వచ్చిన అనిల్ 20 రోజుల కిత్రమే తిరిగి విధుల్లో చేరాడు. ఈ నెల 10వ తేదీ ఆదివారం అనిల్ పుట్టిన రోజు కాగా.. ఆ మరునాడే మృతి చెందడం బాధాకరం. అనిల్ మృతదేహాన్ని మంగళవారం విజయవాడ విమానాశ్రయానికి తీసుకురానున్నట్లు సమాచారం.

వన్ ధన్ వికాస్ ద్వారా 1,461 మందికి శిక్షణ

» ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు కేంద్రం సమాధానం

న్యూఢిల్లీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఈ ఏడాది జూలై వరకు వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా 1,461 మందికి శిక్షణ ఇచ్చి, గిరిజన కుటుంబాల ఆదాయం పెంచామని కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. సోమవారం ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. సౌర విద్యుత్‌లో వ్యాపారానికి సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 30 మందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తికి

క్షమాపణ చెప్పండి

(మొదటిపేజీ తరువాయి)



క్షమాపణ చెప్పాలని నిర్దేశించింది. దానిని ఆమోదించాలా లేదా అనేది పూర్తిగా ఆమె విచక్షణకే వదిలేస్తున్నామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ అతుల్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు 2016లో గచ్చిబౌలిలోని తన హౌసింగ్ సొసైటీలోకి ప్రవేశించి నిర్మాణాలను ధ్వంసం చేశారంటూ పెద్ది రాజు అనే వ్యక్తి ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టారు. ఈ కేసు చాలా కాలం రంగారెడ్డి జిల్లా ప్రత్యేక సెషన్ జడ్జి ముందు పెండింగ్‌లో ఉంది. అయితే, ఇది రాజకీయ ప్రేరేపితమని, దీనిని కొట్టి వేయాలంటూ రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఘటన జరిగినప్పుడు రేవంత్ రెడ్డి ఘటనా స్థలంలో ఉన్నారని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని పేర్కొంటూ గత జూలై 17న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసుమి భట్టాచార్య కేసును కొట్టివేశారు. అయితే, అంతకంటే ముందే పిటిషనర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన దృష్ట్యా హైకోర్టులో తన కేసుపై నిష్పాక్షిక విచారణ జరగదని, కేసును నాగపూర్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా.. జస్టిస్ మౌసుమి భట్టాచార్య చేసిన వ్యాఖ్యలు నిష్పాక్షికంగా లేవని, వివక్షతో వ్యవహరించారని పిటిషన్‌లో పెద్దిరాజు ఆరోపించారు. రేవంత్ రెడ్డి తరఫు న్యాయవాదికి, ప్రభుత్వం తరఫు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సుదీర్ఘంగా వాదనలు వినిపించేందుకు అనుమతించారని, తమ తరఫున న్యాయవాది వాదనలు వినిపించేటప్పుడు కేవలం పది నిమిషాల్లోనే ముగించాలంటూ న్యాయమూర్తి అడ్డుకున్నారని ఆరోపించారు. తమ వాదనను వినిపించేందుకు తమకు కేవలం ఐదు నిమిషాలే సమయం ఇచ్చారని, వాస్తవాలను వివరించేందుకు సరైన అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. న్యాయమూర్తి వైఖరి సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఉందని, ఆమె పూర్తిగా వివక్ష ప్రదర్శించారని ఆరోపించారు. రాష్ట్ర యంత్రాంగంపై ముఖ్యమంత్రికి పూర్తి పట్టు, రాజకీయ పలుకుబడి ఉన్న రీత్యా హైకోర్టులో తనకు న్యాయం జరగదనే అభిప్రాయానికి వచ్చానని పేర్కొన్నారు. ఈ పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది. పిటిషన్‌పై మండిపడిన ధర్మాసనం.. హైకోర్టు న్యాయమూర్తిపై అవమానకర వ్యాఖ్యలు చేసినందుకు వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. దీంతో, పిటిషనర్ పెద్ది రాజు, పిటిషనర్ తరఫు న్యాయవాది రితేశ్ పాటిల్, పిటిషన్‌ను డ్రాఫ్ట్ చేసిన న్యాయవాది నితిన్, సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే క్షమాపణలు చెప్పారు. వారంలోగా హైకోర్టు న్యాయమూర్తికి కూడా క్షమాపణలు చెప్పాలని నిర్దేశించింది. అందుకనుగుణంగా, కేసును మళ్లీ అదే న్యాయమూర్తి విచారణ జరిపేందుకు వీలు కల్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కోరింది. "హైకోర్టు, ట్రయల్ కోర్టు జడ్జిలను న్యాయవాదులు విమర్శించడం ఇటీవలి కాలంలో ఓ ట్రెండ్‌గా మారింది. రాజకీయ నాయకుల జోక్యం ఉన్న కేసును హైకోర్టులు విచారిస్తే అక్కడ తమకు న్యాయం జరగదనే భావన కూడా పెరిగిపోయింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల తరహాలోనే హైకోర్టు జడ్జిలకు కూడా రాజ్యాంగపరంగా రక్షణ ఉంది. పాలనపరంగా హైకోర్టు లేదా హైకోర్టు జడ్జిలపై సుప్రీం కోర్టుకు ఎటువంటి నియంత్రణ లేదు. హైకోర్టు న్యాయమూర్తులపై ఇటువంటి ఆరోపణలు వచ్చినప్పుడు.. వారిని కాపాడాల్సిన బాధ్యత అత్యున్నత న్యాయస్థానానికి ఉంటుంది" అని వ్యాఖ్యానించిది. నిజానికి, ఈ కేసులో గత నెల 29నే సుప్రీం కోర్టు పెద్ది రాజు, ఆయన ఏవోఆర్ రితేశ్ పాటిల్, ఇతర న్యాయవాదులకు ధిక్కార నోటీసులు జారీ చేసింది. తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని వారు అభ్యర్థించినా తిరస్కరించింది. న్యాయమూర్తులను బోన్‌లో నిలబెట్టేందుకు పిటిషనర్లు వారికి వ్యతిరేకంగా ఆరోపణలు చేసేందుకు ఏమాత్రం అనుమతించబోమని స్పష్టం చేసింది. న్యాయవాదులు హైకోర్టు, కింది కోర్టు న్యాయమూర్తులను విమర్శించే ధోరణికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని, ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తే రాజకీయ నేతలపై ఏ న్యాయమూర్తి తీర్పు ఇవ్వలేరని సుప్రీం అభిప్రాయపడింది. రాజకీయ నాయకుల కేసుల విషయంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి కేసు బదిలీ కోరడాన్ని అనుమతించకూడదని అభిప్రాయపడింది.



బంజారాహిల్స్‌లోని ఏఐఎన్‌యూ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న సీపీ ఆనంద్, చిత్రంలో ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

వైద్య రంగంలో హైదరాబాద్‌కు ప్రాధాన్యం

» ఏఐఎన్‌యూ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో హైదరాబాద్ ప్రాధాన్యం రోజురోజుకీ పెరుగుతోందని, నాణ్యమైన వైద్య సేవలకు ఇది కేంద్రంగా మారిందని ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆస్పత్రిని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ కొత్త ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 150 పడకలు, 4 ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీతో కూడిన శస్త్రచికిత్స విభాగాలు ఇక్కడ ఉన్నాయని ఏఐఎన్‌యూ చైర్మన్, చీఫ్ యూరాలజిస్టు డాక్టర్ మల్లికార్జున వివరించారు.హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేయనున్న అతిపెద్ద నెఫ్రాలజీ, యూరాలజీ ఆస్పత్రి వచ్చే ఏడాది నాటికి అందుబాటులోకి రానుందని మల్లికార్జున, ఏఐఎన్‌యూ ఈడీ పూర్ణచంద్రా రెడ్డి తెలిపారు. కాగా దేశవ్యాప్తంగా తమసేవలను విస్తరిస్తున్నామని, రూ.150 కోట్ల పెట్టుబడులతో మూడు నుంచి ఐదు కొత్త ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నట్లు ఆసియా హెల్త్‌కేర్ హోల్డింగ్స్ (ఏహెచ్‌హెచ్) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విశాల్ బాలి వెల్లడించారు. వీటిని పుణె, భువనేశ్వర్, పట్నా, కోయంబత్తూర్ నగరాల్లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు చెన్నై, వైజాగ్, సిలిగురిలో ఏఐఎన్‌యూ ఆసుపత్రులు ఉన్నాయన్నారు. ఈ విస్తరణ పూర్తయితే, ఆసుపత్రుల పడకల సామర్థ్యం ఇప్పుడు ఉన్న 550 నుంచి 850కి పెరుగుతుందని బాలి తెలిపారు.

వివేకా హత్యపై జగన్‌కు అంతా తెలుసు!

» కేసును రాజకీయంగా వాడుకుని వదిలేశారు: సునీతారెడ్డి

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి వైఎస్ వివేకానందరెడ్డిని ఇంట్లోనే అత్యంత కిరాతకంగా హత్య చేయడం గురించి తన సోదరుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అంతా తెలుసని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి స్పష్టం చేశారు. నాన్న చనిపోయిన విషయం బాహ్య ప్రపంచానికి తెలియకముందే జగన్‌కు తెలుసన్నారు. ఈ విషయాన్ని మాజీ ఐఏఎస్ అధికారి అజేయ కల్లం కూడా దర్యాప్తు సమయంలోనే వెల్లడించారని, సీబీఐ కూడా తెలంగాణ హైకోర్టుకు ఈ సంగతి నివేదించిందని గుర్తుచేశారు. అయితే ఆ కోణంలో సీబీఐ దర్యాప్తు చేయకుండా నిలిపివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. నాన్న హత్య కేసును జగన్ తన రాజకీయ లబ్ధికి వాడుకుని వదిలేశారని ధ్వజమెత్తారు. ఈ హత్య కేసులో న్యాయం జాప్యం కాలేదని.. తిరస్కరణకు గురైందని వాపోయారు. వివేకా హత్యపై పునర్విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును సోమవారం అభ్యర్థించారు. 'సీబీఐ చార్జిషీటులో కీలకాంశాలు దాచిపెట్టింది. అసలు దోషులను గుర్తించకుండానే దర్యాప్తు పూర్తయిపోయినట్లు తేల్చేసింది. ఈ కేసులో పెద్ద కుట్ర దాగి ఉందని సుప్రీంకోర్టు గుర్తించింది. ఫలితంగానే హత్య కేసును 2022 నవంబరు 29న ఏపీ నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసింది' అని తెలిపారు. తాను హైకోర్టును ఆశ్రయించడంతో.. 2020 మార్చి 11వ తేదీన సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా దర్యాప్తునకు అడ్డుతగిలిందని ధ్వజమెత్తారు. ఏకంగా సీబీఐ అధికారులపైనే పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. ఈ కేసులో సీబీఐ మళ్లీ దర్యాప్తు చేయాలని.. పునర్విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు. తన న్యాయపోరాటానికి అందరి మద్దతూ కావాలని కోరారు.

జగిత్యాల ప్రజావాణిలో అమానుషం

» కలెక్టర్ వస్తున్నారని దివ్యాంగుడిని ఈడ్చుకెళ్లిన సిబ్బంది

» బాధితుడు కుర్చీలోంచి జారిపడ్డా కనికరించని వైనం

» కలెక్టర్ కళ్ల ముందే దారుణం

జగిత్యాల/హైదరాబాద్. ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో ఓ దివ్యాంగుడి పట్ల సిబ్బంది అమానుషంగా ప్రవర్తించారు. కలెక్టర్ వచ్చేటప్పుడు అడ్డుగా ఉన్నాడని దివ్యాంగుడని కూడా చూడకుండా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన్ను బయటకు ఈడ్చుకెళ్లారు. జగిత్యాల జిల్లా కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఇక్కడకు తన గోడును వినిపించేందుకు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన దివ్యాంగుడు రాజా గంగారాం వచ్చారు. తన ఇంటికి దారి లేదని ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు స్పందించడం లేదని గత వారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్‌కు రాజా గంగారాం ఫిర్యాదు అందించారు. అప్పుడు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఆయనకు కలెక్టర్ హామీ ఇచ్చారు. వారం రోజులు గడుస్తున్నా తన సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో సోమవారం మళ్లీ ప్రజావాణికి వచ్చి ఫిర్యాదులు స్వీకరించే చోట రాజా గంగారం వేచి చూస్తున్నారు. అదే సమయంలో కలెక్టర్ సత్యప్రసాద్ వస్తున్నారని సిబ్బందికి సమాచారం అందడంతో రాజా గంగారాం అడ్డుగా ఉన్నారని పేర్కొంటూ ఆయన్ను అక్కడి నుంచి ఈడ్చుకెళ్లారు. సిబ్బంది ఈడ్చుకెళ్తున్న సమయంలో రాజా గంగారాం కుర్చీలోంచి జారీ కిందపడ్డారు. అయినప్పటికీ కనికరం చూపకుండా ఆయన్ను బయటకు ఈడ్చుకెళ్లారు. అమానవీయంగా దివ్యాంగుడిని సిబ్బంది ఈడ్చుకెళ్తుంటే ఎదురుపడ్డ కలెక్టర్ అవేమీ పట్టనట్టు ప్రజావాణి హాల్‌లోకి వెళ్లిపోయారు. దివ్యాంగుడి పట్ల కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ప్రవర్తించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటన మానవత్వానికి మాయని మచ్చని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. ఇంత దారుణ ఘటన తన కళ్ల ముందే జరిగినా చూసి చూడనట్టు కలెక్టర్ వెళ్లిపోయారని, ఇక దివ్యాంగులకు గౌరవం ఎక్కడుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆ దివ్యాంగుడి సమస్యను పరిష్కరించాలని కోరారు.



దివ్యాంగుడు రాజా గంగారాంను ఈడ్చుకెళ్తున్న సిబ్బంది



దివ్యాంగుడు రాజా గంగారాంను ఈడ్చుకెళ్తుండగా ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్న జగిల్యాల కలెక్టర్ సత్యప్రసాద్

ఎంత చెప్పినా వినకపోవడంతోనే: కలెక్టర్ సత్యప్రసాద్

తాము ప్రతి అర్జీదారుడి పట్ల మర్యాదగా ప్రవర్తిస్తామని కలెక్టర్ సత్యప్రసాద్ చెప్పారు. అధికారులు ఎంత చెప్పినా వినకుండా రాజా గంగారాం తన సమస్య పరిష్కారం అయ్యేంత వరకు అక్కడి నుంచి కదలనని అర్ధ గంటకు పైగా కూర్చోవడంతో పక్కకు వెళ్ళమని సిబ్బంది అభ్యర్థించారని, అయినా ఆయన వినలేదని చెప్పారు. దాంతో పక్కనే ఉన్న హాల్‌లోకి ఆయన్ను సిబ్బంది తీసుకెళ్లారని, ఆ ప్రయత్నంలో కానిస్టేబుల్ కొంచెం దురుసుగా ప్రవర్తించారని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. కాగా, ఈ ఘటనపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. తక్షణమే దివ్యాంగుడు రాజా గంగారాం సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు

ఔటర్ ఆదాయం హైస్పీడ్!

» టోల్ సంస్థకు సగటున నెలకు రూ.70 కోట్ల వసూళ్లు

» ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే సమకూరిన రాబడి రూ.414కోట్లు

» ఔటర్ నిర్వహణ, టోల్ వసూలు హక్కును 7,380 కోట్లకే 30 ఏళ్ల లీజుకిచ్చిన గత సర్కారు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలు వేగంగా దూసుకెళ్తున్నట్టే.. టోల్ ఆదాయం కూడా వేగంగా పెరుగుతోంది. రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాలు, ఏటా టోల్ పెంపుతో.. ఔటర్‌ను లీజుకు దక్కించుకున్న ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు మరింత రాబడి సమకూరుతోంది. ప్రస్తుతం ఆదాయం నెలకు రూ.70కోట్లు దాటింది. 2024 సంవత్సరంలో ఔటర్‌పై టోల్ వసూళ్ల ద్వారా రూ.764కోట్ల ఆదాయంరాగా.. ఈ ఏడాది 6 నెలలకే రూ.414 కోట్లు రావడం గమనార్హం. దేశవ్యాప్తంగా 17 జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ఐఆర్‌బీ సంస్థ టోల్ నిర్వహణ చేపడుతుండగా.. అందులో అత్యధికంగా ఆదాయం వచ్చేవాటిలో ఔటర్ రింగ్ రోడ్డు ఒకటని తెలిసింది. హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించిన విషయం తెలిసిందే. అది కూడా ఏకంగా 30 ఏళ్ల పాటు టోల్ వసూళ్ల హక్కును రూ.7,380కోట్లకే ధారాదత్తం చేసింది. 2023 ఆగస్టు 11న అర్ధరాత్రి నుంచి ఔటర్ రింగ్ రోడ్డును ఐఆర్‌బీ ఆధీనంలోకి తీసుకుంది. ఔటర్‌ను దాటి మరీ హైదరాబాద్ విస్తరిస్తుండడం, ఔటర్ వెంట బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తుండటంతో.. ఔటర్‌కు డిమాండ్ మరింతగా పెరుగుతోంది. ప్రస్తుతం రోజుకు 2లక్షల వాహనాలు తిరుగుతున్నట్టు అంచనా. భవిష్యత్తులో వాహనాల సంఖ్య, టోల్ వసూళ్లు భారీగా పెరగనున్నాయి.

చట్టాలు తెలుసుకుని అమెరికా రండి

» వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం

» విద్యార్థులకు యూఎస్ కాన్సులేట్ జనరల్ లౌరా విలియమ్స్ సూచన



ఫెయిర్‌కు హాజరైన విద్యార్థినులతో లౌరా విలియమ్స్

హైదరాబాద్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విద్యార్థిగా అమెరికా వెళ్లి ఉన్నత విద్య అభ్యసించడం ప్రతి విద్యార్థికి లభించే అద్భుతమైన అవకాశం, గౌరవమని హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ లౌరా విలియమ్స్ అన్నారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ విద్యార్థులుగా ఎదగాలని కోరారు. అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లే భారతీయ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అమెరికా రాయబార కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన యూఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమెరికాకు వచ్చే ప్రతి పౌరుడిని తమ ప్రభుత్వం గౌరవిస్తుందని తెలిపారు. 'అమెరికా రండి.. మా చట్టాలను గౌరవించండి.. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే మాత్రం ఉపేక్షించబోం' అని చెప్పారు. స్టూడెంట్ వీసాపై వెళ్లేవారు అమెరికా చట్టాలను పూర్తిగా తెలుసుకోవాలని, బాధ్యతాయుత పౌరులుగా ప్రవర్తించాలని సూచించారు. ఈ ఫెయిర్‌లో అమెరికాలోని 30కి పైగా యూనివర్సిటీలు పాల్గొని తాము అందించే కోర్సుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.